సాహితి
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

31-1-2026 శనివారం సంపుటి: 31 సంచిక: 360 పేజీలు: 12 వెల: 6.50

ఇంధనశాఖలో 27 మందికి కారుణ్య నియామకాలు 3లో

శాంతి చర్చలకు జెలెన్‌స్కీని ఆహ్వానించిన రష్యా 9లో



శుక్రవారం వార్డు, మండల స్థాయి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు తరగతుల్లో లోకేష్

## కూటమిని ఎవరూ విడదీయలేరు..

### వైఎస్సార్సీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

### పార్టీనేతల శిక్షణ తరగతిలో మంత్రి లోకేష్

**విజయవాడ,జనవరి30,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమిని చీల్చేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నా విడదీయడం ఎవరి తరం కాదని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి,రాష్ట్ర మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు.వైఎస్సార్సీపీ తప్పుడు ప్రచారాలను వాస్తవాలతో తిప్పికొట్టడంతో పాటు వాటిని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత తెలుగుదేశం కార్యకర్తలదేనని స్పష్టం చేశారు. ఎన్ని ఇబ్బందులు, కష్టాలు ఎదురైనా ఓర్పుతో, ఐక్యంగా దుష్ప్రచారాలను ఎదుర్కోవాలని సూచించారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. టౌన్, వార్డు, మండల స్థాయి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల >>2

# గ్రీన్ ఎనర్జీలో ఎపి నం.1

**కుప్పం, జనవరి 30 ప్రభాతవార్త:** ప్రపంచదేశాలతో పోల్చితే భారతదేశం అభివృద్ధిలో ముందుకుసాగుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. మూడు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా శుక్రవారం సాయంత్రం స్థానిక అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ప్రాంగణంలో 15కోట్లతో ఏర్పాటుచేసిన విద్యా చల్ అకాడమీ, లెర్నర్ అకామిడేషన్ సెంటర్, టీచర్ ట్రైనింగ్ శిక్షణ భవనాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రసంగించారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించాలనే లక్ష్యంతోనే విజన్ 2047, వికసిత్ భారత్ 2047 నినాదంతో ముందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. కొత్త ఆవిష్కరణలతోనే భవిష్యత్తు ఉంటుందన్నారు. అందుకు అనుగుణంగానే ఎపికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) క్వాంటం వ్యాలీ తీసుకువచ్చినట్లు చెప్పారు. రాష్ట్రానికి అన్ని టెక్నాలజీలు వచ్చాయన్నారు. టాటా ఇన్నోవేషన్ హబ్, డ్రోన్ సిటీ, స్పేస్ టెక్నాలజీలు తెచ్చామన్నారు. రాష్ట్రంలో ఈఏడాది నుంచే డ్రోన్ అంబులెన్స్‌లను సైతం తీసుకువచ్చేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. రాష్ట్రంలో రెన్యువబుల్ ఎనర్జీ తీసుకురావడం జరిగిందన్నారు. అలాగే గ్రీన్ ఎనర్జీ తయారీలో దేశంలోనే ఎపి నెంబర్‌వన్ రాష్ట్రంగా ఉందన్నారు.గ్రీన్ ఎనర్జీతో కరెంట్ ధరలు తగ్గుతున్నాయని ఇప్పటికే యూనిట్‌కు 38పైసలు తగ్గించామని మున్ముందు మరింత తగ్గే అవకాశం ఉందని స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లాలోని శ్రీహరి కోట సమీపంలో ఐదువేల ఎకరాల్లో కమర్షియల్ పార్క్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులు సృజనాత్మకత, >>2

ఈ యేడాది నుంచే డ్రోన్ అంబులెన్స్ సర్వీసులు

శ్రీహరికోట వద్ద 5వేల ఎకరాల్లో కమ్మర్షియల్ పార్కు

కొత్త ఆవిష్కరణలతోనే భవిష్యత్తు

కుప్పం పర్యటనలో సిఎం చంద్రబాబు



శుక్రవారం కుప్పంలో విద్యాసంస్థలను ప్రారంభించిన అనంతరం విద్యార్థులతో ముచ్చటిస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో అగస్త్యఫౌండేషన్ వ్యవస్థాపకుడు రామ్‌జీ రాఘవన్

## 14నే బడ్జెట్

### 11 నుంచి అసెంబ్లీ సమావేశాలు ఆరంభం

### నోటిఫికేషన్ విడుదల

**విజయవాడ.జనవరి 30,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర బడ్జెట్ సమావేశాల నోటిఫికేషన్ ను ప్రభుత్వం విడుదల చేసింది. శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 11 నుంచి ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 11న ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు. 14వ తేదీన ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టే యోచనలో ప్రభుత్వం ఉంది. అలాగే బీఏసీ సమావేశాల్లో పని దినాలను శాసనసభ, మండలి ఖరారు చేయనుంది. 2026- 27కు రాష్ట్ర బడ్జెట్ రూపకల్పనపై కసరత్తు మొదలైంది. అన్ని ప్రభుత్వ శాఖలు జనవరి నెలాఖరులోగా తమ బడ్జెట్ ప్రతిపాదనలు సమర్పించాలని ఆర్థికశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు అనుసరించాల్సిన మార్గదర్శకాలను సూచించింది. దీంతోపాటు 2025 26 అంచనాల సవరణ ప్రతిపాదనలు కూడా ఇవ్వాలని, అదే సమయంలో ఏ ప్రభుత్వ హెడ్ కింద ఎంతమొత్తం ఆదా అయ్యిందో ముందే గుర్తించాలని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటిదాకా వివిధ ఖాతాల కింద ఎంత ఖర్చు చేశారు? మిగిలిన మూడు నెలల్లో ఎంత ఖర్చుచేసే అవకాశముందో స్పష్టమైన అంచనాలతో సవరణలు ప్రతిపాదించాలని ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ ఇప్పటికే ఉత్తర్వులిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యమిస్తోంది. ఇళ్ల నిర్మాణం, రహదారులు, ఇతర రవాణా సౌకర్యాల అభివృద్ధి, రక్షిత నీటికల్పన, విద్య, వైద్యం తదితర అంశాల్లో ప్రమాణాల మెరుగుదల, పారిశ్రామికీకరణ విస్తృతిని దృష్టిలో ఉంచుకొని మూలధన బడ్జెట్ ప్రణాళిక రూపొందించాలి. అలాగే పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం, కేంద్ర ప్రాయోజిత పథకాలు, రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలో భాగంగా అమలయ్యే పథకాలు, నాబార్డ్, హడ్కో సాయంతో చేపడుతున్న పనుల గురించి వివరంగా సమర్పించాలి.




## కాలుష్యానికి కళ్లెం వేద్దాం



శుక్రవారం విశాఖలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న డి.సిఎం పవన్

### అధునాతన సాంకేతికతతో వ్యర్థాల నిర్వహణ చేపట్టాలి

### ఉత్తరాంధ్రలోనూ వ్యాపిస్తున్న కాలుష్యం

### గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టులో పారిశ్రామికవేత్తలు భాగస్వాములవ్వాలి

### విశాఖలో డి.సిఎం పవన్

**విశాఖపట్నం, జనవరి 30 ప్రభాతవార్త:** 'కాలుష్యం మన దైనందిన జీవితంలో అంతర్భాగంగా మారిపోయింది. రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే కొంత వరకు కాలుష్యాన్ని భరించక తప్పని పరిస్థితి. అయితే కాలుష్యాన్ని పూర్తి స్థాయిలో నివారించలేకపోయినా నిలువరించి నియంత్రించే ప్రయత్నం అయితే జరగాలి. ముఖ్యంగా పారిశ్రామికవాడల్లో కాలుష్య నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలి' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ నిర్దేశించారు. పరిశ్రమలు కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలను తు.చ. తప్పక పాటిస్తూ జీవ వైవిధ్యానికి సహకరించాలని సూచించారు. నూతన సాంకేతికత సాయంతో వ్యర్థాల నిర్వహణ, గాలి నాణ్యత పెంపు తదితర చర్యలు తీసుకోవాలని తెలిపారు. శుక్రవారం సాయంత్రం విశాఖలోని ఓ ప్రైవేటు హోటల్‌లో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణం, కాలుష్య నియంత్రణ అంశంపై విశాఖ పరిసరాల్లోని పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశం అయ్యారు. పోర్టు నుంచి పారిశ్రామికవాడల వరకు యాజమాన్యాలు కాలుష్య నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ప్రవన్ కల్యాణ్ మాట్లాడుతూ 'ఉత్తరాంధ్ర తీర ప్రాంతం ఎంత వేగంగా అభివృద్ధి చెందిందో అంతే వేగంగా ఇక్కడ గాలి నాణ్యత తగ్గుతూ వచ్చింది. గడచిన రెండేళ్ల కాలంలో పరిస్థితులు కాస్త మెరుగుపడినప్పటికీ పరవాడ పారిశ్రామికవాడ పరిధిలోని తాడి గ్రామం లాంటి చోట్ల పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. రసాయన పరిశ్రమలు వెదజల్లే కాలుష్యం కారణంగా తాడి గ్రామంలో ఇంటికొకరు చొప్పున క్యాన్సర్ బారిన పడిన దుస్థితి. చిన్నారుల్లో చర్మ వ్యాధులు, మహిళల్లో గర్భస్రావాలు, ఊపిరితిత్తుల వ్యాధులు ఆ ప్రాంతంలో సర్వసాధారణం అయిపోయాయి. అలాగే విశాఖ పోర్టు కాలుష్యం కూడా పరిసర గ్రామాల ప్రజల ఆరోగ్యంపై దాడి >>2



## హోంగార్డు ఆస్తులు కోటాను కోట్లు!

### ఎసిబి తనిఖీల్లో బట్టబయలు

### విజయనగరం, విశాఖలో అధికారుల సోదాలు

**విజయనగరం, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలీసు శాఖలో ఆయనో సాధారణ ఉద్యోగి. కనీసం కానిస్టేబుల్ కూడా కాదు. అంతకన్నా దిగువ ర్యాంకు ఉన్న హోంగార్డు మాత్రమే.కానీ ఏసీబీలో ఉద్యోగం ఆయన అవినీతి ఆలోచనలకు బీజం వేసింది. అవినీతి అధికారుల ఆచూకీ తెలుసుకొని వారి నిగ్గు తేల్చే అవినీతి నిరోధకశాఖలో ఆయనకు హోంగార్డుగా >>2

## గ్రూప్-1 తుది ఫలితాలు

### 87 నియామకాల జాబితా ప్రకటించిన ఎపిపిఎస్సీ

**విజయవాడ.జనవరి 30,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీగ్రూప్1 తుది ఎంపిక జాబితాను ఎట్టకేలకు ఏపీపీఎస్సీ విడుదల చేసింది. 87 గ్రూప్ 1 ఉద్యోగాల నియామకాల కోసం ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. వివిధ కేటగిరీల్లో పోస్టులకు ప్రాథమికంగా ఎంపిక చేసిన వారి హాల్‌టికెట్ నంబర్లతో కూడిన జాబితాతోపాటు ఈ ఉద్యోగాల భర్తీకి సంబంధించిన ఇతర వివరాలను అధికారులు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. రిజర్వేషన్ రోస్టర్ కేసులో స్టే లేకపోవడం, న్యాయస్థానం ఆదేశాలకు లోబడి ఫలితాలు వెల్లడించేందుకు హైకోర్టు అనుమతించడంతో ఈ ఫలితాలను అధికారులు ప్రకటించారు.

**ఎంపిక జాబితా కోసం క్లిక్ చేయండి**

గ్రూప్1 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ 2023 డిసెంబరు 8న ప్రకటన విడుదల చేయగా 2024 మార్చి 17న ప్రిలిమ్స్ నిర్వహించింది. 2025 మేలో మెయిన్స్ నిర్వహించి, జూన్‌లో ఫలితాలు విడుదల చేసింది. జూన్ 23 నుంచి జులై 15 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎట్టకేలకు నేడు(శుక్రవారం) రాత్రి తుది ఎంపిక జాబితాను వెలువరించింది.

**గ్రూప్-2 పరీక్షల తుది ఎంపిక జాబితా**

గ్రూప్2 పరీక్షల తుది ఎంపిక జాబితా (ఫైనల్ సెలెక్షన్ లిస్ట్)ను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మంగళవారం(2712026) రాత్రి పొద్దుపోయాక విడుదల చేసింది.మొత్తం 905 ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేయగా, ప్రస్తుతం 891 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెల్లడించింది. గ్రూప్2లో క్రీడా కోటాకు సంబంధించి రెండు పోస్టులను రిజర్వ్ చేయాలని గతంలో హైకోర్టు ఆదేశాలు ఇచ్చినందున న్యాయస్థానాన్ని ఆశ్రయించిన అభ్యర్థులు ఇచ్చిన ఐచ్ఛికాల మేరకు ఎక్సైజ్ ఎస్సై, లా ఏఎస్ఓ పోస్టులను పక్కన పెట్టింది. ప్రకటించిన 891 పోస్టుల్లో హైకోర్టు తీర్పును అనుసరించి, హారిజంటల్ రిజర్వేషన్ కారణంగా 25 పోస్టుల్లో మార్పులు జరిగే అవకాశముంది. మిగతా 866 పోస్టుల్లో ఏ మార్పూ ఉండదు. ఇంకా ప్రకటించని 14 పోస్టుల్లో హైకోర్టు తీర్పుతో పక్కన పెట్టిన క్రీడా కోటా పోస్టులు 2 పోనూ 7 దివ్యాంగ, 5 రిజర్వేషన్ పోస్టులకు ఆయా కేటగిరీల్లో అభ్యర్థులు లేరు. అయితే గ్రూప్2లో 905 పోస్టుల భర్తీకి 2023 డిసెంబరు 7న ఏపీపీఎస్సీ ప్రకటన జారీ చేసింది. 2024 ఫిబ్రవరి 25న ప్రిలిమినరీ, 2025 ఫిబ్రవరి 23న మెయిన్ పరీక్షలు నిర్వహించారు. 2025 ఏప్రిల్ 4న ఫలితాలు వెల్లడించారు. క్రీడా కోటాకు సంబంధించిన కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున అభ్యర్థుల ఎంపిక జాబితా తయారీకి ఇన్నాళ్లుగా జాప్యం జరిగింది.



31-1Pg2exHNWMJQE 2_31-1Pg2exHNWMJQE.qxd 31/Jan/26 12:14 AM Page 1





శుక్రవారం విశాఖలో నిర్వహించిన అనకాపల్లి ఉత్సవ్‌లో కళాకారులతో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, మంత్రి కొల్లు రవీంద్ర, స్పీకర్ అయ్యన్నపాత్రుడు తదితరులు

# పర్యాటక హబ్‌గా అనకాపల్లి

**- అనకాపల్లి ఉత్సవ్‌లో మంత్రి దుర్గేష్**

**- ఉత్తరాంధ్ర సంస్కృతికి ఈ వేడుకలు అద్దంపడుతున్నాయని వెల్లడి**

**అనకాపల్లి, జనవరి 30 ప్రభాతవార్త:** విశాఖ ఉత్సవ్‌లో భాగంగా అనకాపల్లి జిల్లా ముత్యాలమ్మపాలెం తీరంలో నిర్వహిస్తున్న 'అనకాపల్లి ఉత్సవ్' నిజమైన ప్రజా ఉత్సవంగా సాగుతోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎంపి సీఎం రమేశ్, సహచర మంత్రులు వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్ బాబు, సుందరపు విజయ్ కుమార్‌లతో కలిసి పాల్గొన్న అనకాపల్లి ఉత్సవ్‌లో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్ ఆద్యంతం ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ప్రకృతి ఒడిలో, సుందరమైన సముద్రతీరంలో జరుగుతున్న ఈ వేడుకలు ఉత్తరాంధ్ర ఆచారాలను, సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పేలా దిగ్విజయంగా సాగుతున్నాయన్నారు. అనకాపల్లి జిల్లా ఏర్పాటు తర్వాత జరుగుతున్న తొలి భారీ పర్యాటక ఉత్సవం కావడంతో స్థానికుల్లో, పర్యాటకుల్లో మిన్నంటిన ఉత్సాహాన్ని ఆయన కొనియాడారు. జిల్లా ఏర్పాటు తర్వాత మొట్టమొదటిసారిగా ఇంత ఘనంగా ఉత్సవాలు నిర్వహించుకోవడం గర్వకారణమన్నారు. ముత్యాలమ్మపాలెం సముద్రతీరంలో వేడుకలు జరుపుకోవడం ఆనందం.

# కాలుష్యానికి కళ్లెం వేద్దాం

>> చేస్తోంది. పోర్టు పరిసరాల్లో బొగ్గు కాలుష్యం కారణంగా ఊపిరితిత్తుల వ్యాధులు, చర్మ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. ముఖ్యంగా పోర్టు అథారిటీ పరిధిలోని గ్రామాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంటుంది. అక్కడ నివశించే ప్రజలు ఎన్నో సందర్భాల్లో వారి సమస్యలు నా దృష్టికి తీసుకువచ్చారు. ఇలాంటి ఘటనలపై మానవతా దృక్పథంతో స్పందించి బాధిత ప్రజలకు అండగా నిలవాలి. పరిశ్రమలు నిబంధనలు పాటించవన్న భావన ఉందిరాష్ట్రం అభివృద్ధి చెందాలి అంటే పరిశ్రమలు రావాలి. అదే సమయంలో ఒక పరిశ్రమను స్థాపించాలి అంటే ఎన్నో సామాజిక అంశాలను పరిగణలోకి తీసుకోవాలి. పరిశ్రమలు కాలుష్య నియంత్రణ వ్యవహారంలో నిబంధనలు సరిగా పాటించవన్న భావన ప్రజల్లో బలంగా ఉంది. అన్ని రకాల కాలుష్యాలకు ఉత్తరాంధ్రను డంపింగ్ ప్రాంతం చేశారని ఆ ప్రాంత ప్రజలు వాపోతూ ఉంటారు. పరిశ్రమలు వచ్చిన ప్రతిసారి ప్రజల్లో నిరక్ష్యాన్లికి గురవుతున్నామన్న భావన కూడా పెరిగిపోతోంది. పరిశ్రమల యాజమాన్యాలు సాటి మనుషుల పట్ల కనీస బాధ్యతతో స్పందించాల్సిన అవసరం ఉంది. పారిశ్రామికవాడల్లోని ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు చేయగలిగినంత చేయాలి.

# గ్రీన్ ఎనర్జీలో ఎపి నం.1

>> ఆవిష్కరణలు, టెక్నాలజీ, నాలెడ్జ్ వైపు దృష్టి సారించాలని సూచించారు. పిల్లలేదేశ భవిష్యత్తు అని పేర్కొన్నారు.

**తెలుగువారికే అత్యధిక ఆదాయం :** ప్రపంచంలో అధికంగా విదేశాల్లో భారతీయులకు ఆదాయం వస్తోందని అందులో అధికంగా ఉన్నది తెలుగువారేనని సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. 1995లో ఇంటర్నెట్ విప్లవం వచ్చిందనిదాన్ని అందిపుచ్చుకున్నట్లు పేర్కొన్నారు. అదే సమయంలో ఉమ్మడి రాష్ట్రంలో అత్యధికంగా ఇంజనీరింగ్ కాలేజ్‌లు ఏర్పాటుచేశామన్నారు. అలాగే ఐటి సంస్థలను హైదరాబాద్‌కు తీసుకువచ్చామన్నారు. ఇండియాలోనే తొలిసారి వైజాగ్‌లో మెడ్‌టెక్ పార్కు, జీనోమ్ వ్యాలీ ఏర్పాటుచేశామన్నారు. కోవిడ్ సమయంలో భారత్ బయోటెక్ జీనోమ్ వ్యాలీలోనే కోవిడ్ టీకాలు తయారు చేయగా ప్రధాని నరేంద్రమోడీ దాదాపు వంద దేశాలకు సరఫరా చేశారన్నారు.

**కుప్పం ఓ ప్రయోగశాల :** కుప్పాన్ని తాను ఓ ప్రయోగశాలగా మార్చినట్లు సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఇప్పటికే కుప్పానికి భారీ పరిశ్రమలు వచ్చాయన్నారు. మరిన్ని పరిశ్రమలు సైతం వస్తున్నాయన్నారు. కుప్పానికి కృష్ణాజలాలు తీసుకువచ్చామని తద్వారా చెరువులు కళకళలాడుతున్నాయని పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణంతో పాటు కోలార్ మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే సైతం రానుందని పేర్కొన్నారు. కుప్పంలోని అగస్త్య ఫౌండేషన్‌ను దేశంలోనే ఓ ఉత_్తమ ఇన్నోవేషన్ కేంద్రంగా మార్చుతామని ఈ ఫౌండేషన్ ఏర్పాటై పాతికేళ్లు పూర్తికావడం పట్ల ఆనందం వ్యక_్తం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వవిప్ కంచర్ల శ్రీకాంత్, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, టిడిపి జిల్లా అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి, పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్ సురేష్‌బాబు, అగస్త్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామ్‌జీ రాఘవన్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కూటమిని ఎవరూ విడదీయలేరు..

>> కోసం నిర్వహించిన 11వ శిక్షణ తరగతుల్లో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ పాల్గొన్నారు. పార్టీ క్యాడర్ సమన్వయంతో పాటు సిద్ధాంతాలకు కట్టుబడి పని చేయాల్సిన అవసరం ఉందని లోకేశ్ స్పష్టం చేశారు. వైఎస్సార్సీపీ హయాంలో కలియుగ దైవం శ్రీవెంకటేశ్వరస్వామి, టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా వ్యవహరించిందని మంత్రి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. చేయకూడని పాపాలు చేసి ఇప్పుడు తప్పుడు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. 2014- 19 మధ్య కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసినా వాటిని ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లడంలో వెనుకబడ్డామని గుర్తు చేశారు. అదే అప్పటి ఓటమికి ప్రధాన కారణమన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలను ప్రజలకు నేరుగా వివరించాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందని తెలిపారు. ఇకపై అభివృద్ధితో గురించి విస్తృతం ప్రచారం చేయాలన్నారు. ఇదే సమయంలో ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలతో రాజకీయాలు చేసే శక్తులను ధీటుగా ఎదుర్కోవాలని స్పష్టం చేశారు. కూటమి నాయకుల మధ్య సఖ్యత అత్యంత ముఖ్యమని లోకేశ్ వ్యాఖ్యానించారు. పార్టీ నాయకులు అలగడం తగదని, ప్రతి ఒక్కరి కష్టాన్ని పార్టీ తప్పకుండా గుర్తిస్తుందని భరోసా ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ ఒక కుటుంబం అని, కుటుంబంలో సమస్యలు ఉంటే కూర్చొని మాట్లాడుకుంటే పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. మరోవైపు పార్టీ బలోపేతం కోసం తాను ఓ కార్యకర్తలా కృషి చేస్తున్నానని లోకేశ్ అన్నారు. పనిచేసే కార్యకర్తలనే పార్టీ ప్రోత్సహిస్తుందని వెల్లడించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీలో మార్పులు రావాలని లోకేశ్ సూచించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు పొలిట్ బ్యూరో స్థాయికి వచ్చేలా సంస్కరణలకు శ్రీకారం చుట్టామని అన్నారు. కింద నుంచి పై స్థాయి వరకు కూడా యువతకు పార్టీలో ప్రాధాన్యం ఎంతో అవసరమని తెలిపారు. జనాభా దామాషా ప్రకారం పదవుల్లో అన్ని కులాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని, అలానే మహిళలకు 33 శాతం పదవులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని మంత్రి లోకేశ్ వెల్లడించారు. సంక్షేమం అభివృద్ధికి చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అయితే టీమ్ 11కోడి కత్తి, కల్తీ నెయ్యి, కల్తీ మద్యానికి బ్రాండ్ అంబాసిడర్ అని లోకేశ్ విమర్శించారు. ఇచ్చిన హామీలు అన్నీ ఓ పద్ధతి ప్రకారం నెరవేర్చుతూ ముందుకెళ్తున్నామని, అలానే చేసిన పనులు చెప్పుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు.



మహాత్మునికి నివాళిని అర్పిస్తున్న సిఎం చంద్రబాబు

# మహాత్మునికి సిఎం చంద్రబాబు నివాళి

**విజయవాడ,జనవరి30,ప్రభాతవార్తప్రతినిధి:** మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘనంగా నివాళులర్పిస్తూ "ఎక్స్" వేదికగా ట్వీట్ చేశారు. అహింసను పరమధర్మంగా చెప్పిన మహాత్ముడు ప్రాత:స్మరణీయుడని అన్నారు. ఆయన బోధనలు నేటికీ అనుసరణీయమని అన్నారు. జాతిపితకు మరొక్కసారి ఘన నివాళి అర్పిస్తున్నానని సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. గుంటూరు పర్యటనకు వెళ్ళడానికి ముందు ఉండవల్లిలోని తన నివాసగృహంలోని మహాత్ముని చిత్రపటానికి సీఎం చంద్రబాబు పూల మాలలు వేసి నివాళులర్పించారు. జాతిపితకు మంత్రి నారా లోకేష్ నివాళి సత్యం, అహింసలే ఆయుధాలుగా దేశానికి స్వాతంత్ర్య సముపార్జించిన జాతిపిత మహాత్మాగాంధీ వర్థంతి సందర్భంగా విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆ మహనీయునికి ఘన నివాళి అర్పించారు. అహింస అనే ఆయుధంతో సూర్యదస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి భరతమాత దాస్యశృంఖలాల నుంచి విముక్తి కలిగించిన మహోన్నతుడు మహాత్మాగాంధీ అని కొనియాడారు. 20వ శతాబ్దంలో మానవాళిని అత్యధికంగా ప్రభావితం చేసిన వ్యక్తుల్లో మహాత్మాగాంధీ ఒకరని, తాను నమ్మిన సిద్ధాంతాలను ఆచరించి చూపారని, భారతదేశంపై చెరగని ముద్ర వేశారన్నారు. దేశానికి స్వాతంత్ర్య ఫలాలు అందించిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయ సాధన కోసం కృషిచేద్దామని మంత్రి లోకేష్ అన్నారు.

# ఎపి జైళ్ల శాఖ డిజి అంజనీకుమార్ నేడు పదవీ విరమణ

**వైజాగ్‌లో ఘనంగా సన్మానించిన జైళ్ల శాఖ**




వైజాగ్‌లో ఎపి జైళ్ల శాఖ డిజి అంజనీ కుమార్, ఆయన సతీమణి వసుంధర సిన్హాలకు సన్మానం జరిగిన దృశ్యం

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:** ఎపి జైళ్ల శాఖ డిజి అంజనీ కుమార్ ఆయన సతీమణి వసుంధర సిన్హా (ముంబాయి ఐటి కమిషనర్)కు వై జాగ్‌లో శుక్రవారం ఆ రాష్ట్ర జైళ్ల శాఖ ఘనంగా సన్మానించింది. శనివారం నాడు ఆయన పదవీ విరమణ చేయనున్న సందర్భంగా జైళ్ల శాఖ అంజనీ కుమార్ దంపతులకు ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సన్మాన సభలో జైళ్ల శాఖతో పాటు ఎపి పోలీసు శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉమ్మడి ఎపి క్యాడర్‌కు చెందిన అంజనీ కుమార్ 1990 బ్యాచ్ ఐపిఎస్ అధికారి. ఉమ్మడి ఎపిలోని అనేక చోట్ల ఆయన పనిచేశారు. రాష్ట్ర విభజన తరువాత ఎపి కేడర్‌కు కేటాయించినా కొన్ని కారణాల వల్ల తెలంగాణలో చేరారు. ఈ క్రమంలోనే అంజనీ కుమార్ హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా, ఎసిబి డిజిగా సేవలదించి తెలంగాణకు డిజిపిగా పనిచేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల కమిషన్ ఆయనను ఆకస్మికంగా బదిలీ చేసి రోడ్ సేఫ్టీ విభాగం డిజిపిగా నియమించింది. అనంతరం కేంద్ర ప్రభుత్వం ఎపికి కేటాయించగా ఏడాదిన్నర క్రితం ఆ రాష్ట్ర సర్వీసులో చేరి జైళ్ల శాఖ డిజిగా చేరారు. ముక్కుసూటి వ్యక్తిగా పనిచేసే అధికారిగా ఆయనకు పేరుంది. ఎక్కడ పనిచేసినా నిక్కచ్చి గా వ్యవహరించడం ఆయన ప్రత్యేకత. తెలంగాణ డిజిపిగా పనిచేసిన సమయంలో ఎన్నికలు సాఫీగా జరిగేందుకు ఆయన తనదైన శైలిలో వ్యవహ రించారు. 36 ఏళ్ల సుదీర్ఘ సర్వీసులో ఆయనకు అనేక అవార్డులు, కేంద్ర ప్రభుత్వం నుంచి రివార్డులు, పోలీసు పతకాలు అందాయి.

# ఐగాట్ కర్మయోగి పోర్టల్‌లో ఎపి జాతీయ రికార్డు

**- కోటికి పైగా ఎన్‌రోల్‌మెంట్లు పూర్తి చేసిన తొలి రాష్ట్రంగా ఘనత: సిఎం చంద్రబాబు - ప్రభుత్వ ఉద్యోగుల నిబద్ధతను కొనియాడిన ముఖ్యమంత్రి - పిఎం స్వనిధి కింద 3.42 లక్షల కుటుంబాలకు.. 978 కోట్లు పంపిణీ**

**విజయవాడ.జనవరి30,ప్రభాతవార్తప్రతినిధి:** ఐగాట్ కర్మయోగి పోర్టల్‌లో ఆంధ్రప్రదేశ్‌సరికొత్త జాతీయ రికార్డు సృష్టించింది. దేశంలో కోటి కోర్సుల దరఖాస్తులను పూర్తిచేసిన తొలి రాష్ట్రంగా ఏపీ నిలిచింది. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఈ విజయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఈ పోర్టల్‌లో కోటికి పైగా ఎన్‌రోల్‌మెంట్లు, 80 లక్షలకు పైగా కోర్సులు పూర్తయ్యాయని.. 4,290 కోర్సుల ద్వారా ఇది సాధ్యమైందని సీఎం పేర్కొన్నారు." శుభవార్త ఐగాట్ కర్మయోగి పోర్టల్‌లో ఆంధ్రప్రదేశ్ సరికొత్త రికార్డు సృష్టించింది. ఇందులో కోటికి పైగా దరఖాస్తులు వచ్చాయి. 80 లక్షలకు పైగా కోర్సులకు శిక్షణ పూర్తైంది. మొత్తం 4,290 కోర్సుల ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు నైపుణ్యాభివృద్ధి పొందారు. ఇది ప్రభుత్వ ఉద్యోగుల నిరంతర అభ్యాసం పట్ల బలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తోంది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ(ఏపీఎస్‌డిపి) ఆధ్వర్యంలో సమర్థవంతంగా ఈ కర్మయోగి కార్యక్రమం అమలవుతోంది. నైపుణ్యంతో కూడిన భవిష్యత్తు వైపు ఆంధ్రప్రదేశ్ అడుగులు వేస్తోంది"అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. మరో ట్వీట్‌లో ఈ 30 ఏళ్లలో ప్రపంచంలో ఎంతో అభివృద్ధి జరిగింది. టెక్నాలజీలో మార్పులు వచ్చాయి. నాడు ఐటీ నేడు ఏఐ వచ్చింది. ఉద్యోగ అవకాశాలు పెంచుతున్నాం. అమెరికాలో సిలికాన్ వ్యాలీ ఉంది. మరి ఇండియాలో ఏముంది అని అడిగే వారి కోసం అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఉంది అన్నది సమాధానమన్నారు. ఆనాడు సైబరాబాద్ కట్టాం..నేడు క్వాంటమ్ వ్యాలీకి శ్రీకారం చుట్టాం. ఒకప్పుడు కరెంటు ఉండేది కాదు...ఇప్పుడు ఇంటిపైనే కరెంటు తయారు చేసుకుంటున్నాం. అందుకే నేను ప్రోజ్యూమర్ అనే కొత్త కాన్సెప్ట్ తెచ్చాం. అసెంబ్లీలో కరెంటు గురించే గంటల కొద్దీ చర్చలు జరిగేవి. అందుకే నాడు విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చాం. విద్యుత్ రంగంలో మన దేశం నెంబర్ వన్ గా ఉండటం గర్వ కారణం. అమెరికాలోనూ కూడా నాలుగు గ్రిడ్ లు ఉన్నాయి. ప్రపంచంలో సింగిల్ పవర్ గ్రిడ్ ఉండే ఏకైక దేశం మనదే. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజీకి శ్రీకారం చుడుతున్నాం. ఇంకో పదేళ్లలో గుంటూరు సహా అమరావతి రూపురేఖలు ఎలా ఉంటాయే చూస్తారు. గుంటూరు, మంగళగిరి, విజయవాడ కార్పొరేషన్లు కలిసిపోతాయి. గుంటూరు కు182 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు వస్తుంది. రెన్యువబుల్ ఎనర్జీతో పొల్యూషన్ అనేది ఉండదు. 1995లో నేను ఐటీని ప్రమోట్ చేశాను. 2000లో బయో టెక్నాలజీ ప్రమోట్ చేశాను. జీనోమ్ వ్యాలీకి భూములిచ్చాం. కొవిడ్ వ్యాక్స్ న్ భారత్ బయోటెక్ జినామ్ వ్యాలీ నుంచి తయారుచేసింది. ప్రజల ఆరోగ్యం కోసం సంజీవని పేరుతో కొత్త ప్రాజెక్టు తెస్తున్నాం. గేట్స్ ఫౌండేషన్ సహకరించేందుకు ముందుకొచ్చింది. కుప్పం నియోజకవర్గంలో



పైలట్ ప్రాజెక్టుగా అమలు చేశాం. 70 వేల మందికి క్లీనిక్ టెస్టులు చేశాం. చిత్తూరు జిల్లాలో స్కీనింగ్ పరీక్షలు చేస్తున్నాం. ఈ ఏడాదిలోనే 28 జిల్లాలు పూర్తిగా సంజీవని ప్రాజెక్టులో భాగంగా డిజిటల్ హెల్త్ రికార్డులు చేయడమే కాకుండా 72 లక్షలమంది రోగుల డేటా తీసుకుంటున్నాం. ఎవరి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది, క్యాన్సర్, న్యూరో సమస్యలపై దృష్టి పెట్టాం. కార్పొరేట్ ఆస్పత్రులు ఫైవ్ స్టార్ హోటళ్లను మించాయి. చికిత్స ఖర్చు కంటే రూమ్ ఖర్చే ఎక్కువవుతోంది. ఈ 2026లోనే డ్రోన్ అంబులెన్స్ తీసుకురావాలని అనుకుంటున్నాం. పీఎం స్వనిధి కింద 3.42 లక్షల కుటుంబాలకు 978 కోట్లు పంపిణీచేసామని వివరించారు.. మూడు నగరాల్లో తృప్తి క్యాంటీన్లు, 2,673 ఉద్యోగ అవకాశాలతో 18 జాబ్ మేళాలు, మరియు ఆటో డ్రైవర్ సేవాలో పథకం కింద ..436 కోట్ల వ్యయంతో 2.90 లక్షల ఆటో, టాక్సీ మరియు మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు సంవత్సరానికి ..15,000 ఆర్థిక సహాయం అందించబడింది. సామాజిక న్యాయం కేంద్రంగా ఉంది. వెనుకబాటుతనం ఆధారంగా ఎస్సీ ఉప వర్గాల మధ్య సమాన రిజర్వేషన్లు కల్పించడానికి ఎస్సీ ఉపవర్గీకరణ చేపట్టబడింది. షెడ్యూల్డ్ కులాల కోసం ఆర్థిక సహాయం గణనీయంగా పెరిగింది 2019-24 మధ్య సంవత్సరానికి సగటున ..70 కోట్ల నుండి 2024-26లో సంవత్సరానికి ..115 కోట్లకు పెరిగింది. అదనంగా, 11.44 లక్షల మంది ఎస్సీ పెన్షనర్లకు ..3,938.75 కోట్లు విడుదల చేయబడ్డాయి, హాస్టళ్లు మరియు గృహ నిర్మాణంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టబడ్డాయి. 2025-26 సంవత్సరానికి, 20,692 మంది లబ్ధిదారులకు స్థిరమైన జీవనోపాధిని కల్పించడానికి ఎస్సీ ఆర్థిక సహాయ పథకాల కింద ..341 కోట్లు కేటాయించ బడ్డాయి. వెనుకబడిన తరగతుల విషయాని కొస్తే, ప్రభుత్వం ఆర్థిక సాధికారత మరియు సామాజిక గౌరవానికి కట్టుబడి ఉంది. బీసీ సహకార ఆర్థిక సంస్థ ద్వారా ఈ సంవత్సరం ..11,620 కోట్లు మళ్లించబడ్డాయి. శాసన సభలలో బీసీలకు 33 రిజర్వేషన్‌తో ప్రాతి నిధ్యం బలోపేతం చేయబడింది మరియు స్థానిక సంస్థలు మరియు నామినేటెడ్ పదవులలో 34 రిజర్వేషన్‌ను అమలు చేయ డానికి చర్యలు తీసుకుంటున్నారు. విద్య కోసం, ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ..686.64 కోట్లు మరియు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం..420.74 కోట్లు విడుదల.

# హోంగార్డు ఆస్తులు కోటాను కోట్లు!

>> అవకాశం రావడంతో ఆయన పంట పండింది. ఒక నెల కాదు. , ఒక సంవత్సరం కాదు... ఏకంగా 15 సంవత్సరాల పాటు ఏసీబీ కార్యాలయంలో హోంగార్డుగా విధులు నిర్వర్తించారు. అవినీతి అధికారులపై వస్తున్న ఫిర్యాదుల సమాచారాన్ని చాకచక్యంగా తెలుసుకొని మరో కంటికి తెలియకుండా నేరుగా సదరు అవినీతి అధికారులతోనే మాట్లాడి బేరం పెట్టుకునేవాడు. ముందస్తు సమాచారం ఇవ్వడం ద్వారా వారిని అప్రమత్తం చేయడం, వారి నుంచి భారీ మొత్తంలో లక్షలాది రూపాయలను గుంజడం అలవాటు చేసుకున్నాడు. ఈ క్రమంలో కోట్లాది రూపాయల అక్రమ ఆస్తులను పోగేసుకున్నాడు. సదరు హోంగార్డు నెట్టి శ్రీనివాసరావు కదలికలను, వ్యవహార శైలిని అనుమానించిన అధికారులు ఆరు నెలల క్రితం ఆయనను ఏసీబీ నుంచి జిల్లా పోలీస్ కార్యాలయానికి పంపించేశారు.

## వారం - వర్జ్యం

31-01-2026, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శ్రావణ కార్తె
త్రయోదశి ఉ.8.26, చతుర్దశి తె.5.41
పునర్వసు రా.1.35
వర్జ్యం : ఉ.9.03-10.33
దు.ఉ.6.39-8.13
శుభసమయం : ఉ.8.30-9.00
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** విలువైన వస్తు భద్రతపట్ల తగు జాగ్రత్తలు అవసరం. నిర్మోహమాటంగా త్రోసిపుచ్చండి. శ్రమ అధికం.

**వృషభం:** ఇబ్బందికరంగా పరిణమిస్తాయని మీరు భావించిన అంశాలను ఎంత మాత్రంగా పరిగణనలోనికి తీసుకోకండి.

**మిథునం:** దూరప్రాంతంలో వున్న మిత్రుల నుండి శుభవార్తలు అందుకుంటారు. ఋణాలు తీరి ఊరట చెందుతారు.

**కర్కాటకం:** సహోద్యోగులతో ఏర్పడిన అభిప్రాయ భేదాలు తొలుగుతాయి. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**సింహం:** భాగస్వామ్య వ్యాపారాలలో భాగస్వాముల పాత్ర నామమాత్రమవుతుంది. వ్యాపారాలు లాభిస్తాయి.

**కన్య :** కర్త, కర్మ, క్రియ అన్నీ మీరే అయి నడిపిస్తారు. రాజకీయ పరమైన అంశాలు అమితంగా ఆకర్షిస్తాయి.

**తుల :** మీలోని మంచితనాన్ని పదిమందీ గుర్తించాలని ఆరాట పడతారు. అందుకు తగిన ప్రయత్నాలు చేస్తారు.

**వృశ్చికం:** శత్రువులు సైతం మిత్రులుగా మారతారు. భూముల క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

**ధనుస్సు:** గృహాలంకరణకు, ఆరోగ్యానికి ఎక్కువ ప్రాముఖ్యతనిస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**మకరం :** సోదరుల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. ఉద్యోగులకు పదోన్నతులు, స్థానమార్పులు.

**కుంభం:** కీలక నిర్ణయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు. కొత్త విద్యలపై ఆసక్తి చూపుతారు.

**మీనం:** అనుకోని అవకాశాలు లభిస్తాయి. వీసా, పాస్‌పోర్ట్స్ వంటి అంశాలు సానుకూల పడతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కాకినాడలో 60 పడకల కోరమాండల్ ఆసుపత్రిని ప్రారంభించిన మంత్రి లోకేష్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జనవరి 30(ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వలసపాకల బీచ్ రోడ్డులో కోరమాండల్ ఎరువుల కర్మాగారం ఆధ్వర్యంలో అత్యాధునిక వసతులతో ఏర్పాటుచేసిన 60 పడకల ఆసుపత్రి నూతన భవనాన్ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా ప్రారంభించారు. ముందుగా ఆసుపత్రి ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు కోరమండల్ ఇంటర్నేషనల్ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం 60 పడకల ఇంటిగ్రేటెడ్ కోరమాండల్ హాస్పటల్ నూతన భవనాన్ని రిబ్బన్ కట్ చేసి మంత్రి ప్రారంభించారు. ఆసుపత్రి భవనం మొత్తం కలియతిరిగి వసతులను పరిశీలించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద కోరమాండల్ సంస్థ గత కొన్నేళ్లుగా అవుట్ పేషంట్ హాస్పిటల్ ను నిర్వహిస్తోంది. కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల నుంచి ఏడాదికి 1.2 లక్షల మందికి పైగా రోగులకు సేవలందించడం జరుగుతోంది. మొదటి దశలో ఆసుపత్రి అభివృద్ధికి రూ.8 కోట్లు వెచ్చించారు. రెండో దశలో ప్రస్తుతం రూ.32 కోట్లు వెచ్చించి ఇన్ పేషంట్ సదుపాయాలను కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎమ్ఎమ్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ఎం.ఏ అలగప్పన్, ఎండీ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎన్.శంకరసుబ్రహ్మణ్యన్, ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ అరుణ్ అలగప్పన్, కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ డైరెక్టర్ వి.నారాయణన్ తో పాటు ఎంపీ సానా సతీష్, మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం వెంకటేశ్వరరావు, రాజమండ్రి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



కోరమండల్ ఆసుపత్రి ప్రారంభిస్తున్న తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

# నెయ్యి టెండర్లలోనూ నిబంధనల ఉల్లంఘన

**- లడ్డూలలో నెయ్యి కల్తీని బహిర్గతం చేసిన సిట్ - మైక్రోడిఎన్ఏ పరీక్ష తప్పనిసరిగా చేయాలి - టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు**



**తిరుమల,జనవరి 30ప్రభాతవార్తప్రతినిధి:** 2019-24 మధ్యకాలంలో తిరుమలకు స్వచ్ఛమైన ఆవునెయ్యి సరఫరా చేసే అంశంలో నెయ్యి కొనుగోలు టెండర్ల ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘించారని ,కొందరికి లాభం చేకూర్చేలా అప్పటి పాలకమండలి ,అధికారులు నిబంధనలను మార్చారని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. కల్తీనెయ్యి సరఫరా చేశారని సిబిఐ సిట్ అధికారులు ఛార్జిషీట్‌లో ఆధారాలతో దాఖలు చేసినా, దానిపై వైసిపి నాయకులు వాస్తవాలకు విరుద్ధంగా ప్రచారం చేయడం దారుణమన్నారు. నెయ్యినాణ్యతపై తుది నిజాలు వెలుగులోకి రావాలంటే మైక్రో డిఎన్ఏ పరీక్ష తప్పనిసరిగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వంలో, అప్పటి వైసిపి టిటిడి బోర్డు హయాంలో తిరుమలకు కల్తీనెయ్యి జరిగిందనేది సిట్ ఛార్జిషీట్‌లో పేర్కొందన్నారు. అయితే ఈ తప్పుడు పనులు చేసి ఈ పాపం కేసులో తప్పించుకునేందుకు వైసిపి పెద్దలు పలు రకాల ఆరోపణలతో, వాస్తవాలను వక్రీకరించి మాట్లాడటం మంచిది కాదన్నారు. వైసిపి నాయకుల తీరు, వ్యాఖ్యలపై శుక్రవారం సాయంత్రం తిరుపతిలోని పద్మావతి అతిధిగృహంలో బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, పనబాకలక్ష్మి, సి.దివాకర్‌రెడ్డి, నరేశ్‌కుమార్‌తో కలసి ఛైర్మన్ బిఆర్‌నాయుడు మీడియా సమావేశం నిర్వహించారు.

అసలు నెయ్యి కల్తీ జరగలేదని చెప్పడం వాస్తవం కాదన్నారు. సిట్ చార్జిషీట్‌లో కల్తీజరిగిందనేది స్పష్టంగా నమోదు చేశారని, అసలు వైసిపి బోర్డు పెద్దలు నెయ్యి కొనుగోలు టెండర్ల ప్రక్రియనే మార్చేశారని వెల్లడించారు. సరైన సామర్థ్యం లేని డెయిరీలకు. సంస్థలకు నెయ్యి టెండర్లు అప్పగించడమే పెద్ద నేరమన్నారు. సుమారు 250కోట్ల రూపాయలతో 60లక్షల కిలోల కల్తీనెయ్యి కొనుగోలు జరిగిందన్నారు. నెయ్యినాణ్యతను పరీక్షించిన ఎన్‌డిడిబి జంతు కొవ్వు ఉందని నివేదిక ఇచ్చిందని ఛైర్మన్ నాయుడు మరోసారి వెల్లడించారు.

3RD GNT_31-1P□g3exHMNWJQETL.qxd 31/Jan/26 12:49 AM Page 1



# ఆర్థిక అసమానతలు తగ్గించేందుకే పి4

● సమాజానికి కొంత తిరిగి ఇచ్చినప్పుడే నిజమైన సంతృప్తి ● జన్మభూమికి ప్రవాసాంధ్రుల సేవలు స్ఫూర్తిదాయకం ● పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో సంజీవని ప్రాజెక్టు ● పదేళ్లలో గుంటూరు సహా అమరావతి రూపురేఖలు మారతాయి ● గుంటూరు జిజిహెచ్‌లో పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన సిఎం చంద్రబాబు ● రూ.100 కోట్ల విరాళం సమకూర్చిన గుంటూరు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులకు ముఖ్యమంత్రి అభినందన



గుంటూరు, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: ఎంత ఎదిగినా జన్మభూమిని మర్చిపోకుండా ప్రవాసాంధ్రులు చేస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సంపాదించిన దాంట్లో కొంత సమాజసేవకు వినియోగిస్తే వచ్చే తృప్తి మాటల్లో చెప్పలేనిదని సీఎం అన్నారు. గుంటూరు జీజీహెచ్ లో మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. కానూరిజింఖానా మాతా శిశు సంరక్షణ కేంద్ర నిర్మాణం కోసం కాలేజీ పూర్వ విద్యార్థులు రూ.100 కోట్ల విరాళాలను సమకూర్చగా... ఎక్విప్మెంట్, ఫర్నిచర్ కోసం రూ. 27 కోట్లు ప్రభుత్వం వెచ్చించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... ఖిసమాజంలో ఇంకా మంచి మిగిలే ఉందని ప్రవాసాంధ్రులు నిరూపించారు. సాధారణంగా నలభై, యాభై ఏళ్ల క్రితం విదేశాలకు వెళ్లి స్థిరపడినవాళ్లు జన్మభూమిని మర్చిపోతారు. కానీ మీరంతా చదువుకున్న కాలేజీని గుర్తుపెట్టుకుని 1981లోనే జింఖానా సంస్థ ఏర్పాటు చేసి ఇంత పెద్ద ఎత్తున సాయం చేస్తున్నారు. అందుకు మీ అందర్నీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఆరోగ్య కేంద్రం నిర్మాణంతో పాటు భవిష్యత్ లో దాని నిర్వహణకు ఎటువంటి ఆటంకాలు రాకుండా బ్యాంకులో కొంత సొమ్ము డిపాజిట్ చేయడం గొప్ప విషయం. మనతో పాటు సమాజం కూడా బాగుండాలన్నదే మన సంస్కృతి. ఇప్పటి వరకూ పాఠశాలలకు, ఆస్పత్రులకు, దేవాలయాలకు, ఆట స్థలాలకు ఎంతోమంది దాతలు పెద్ద ఎత్తున విరాళాలు ఇచ్చారు. మనదేశ సంస్కృతి, సంప్రదాయాలు మరే దేశంలోనూ కనిపించవు. అమెరికాలోనైతే 18 ఏళ్లకే పిల్లలు బయటకు వెళ్లి స్వతంత్రంగా జీవిస్తారు. కానీ మనదేశంలో పిల్లలు ఎంత పెద్దవారైనా జీవితాంతం వారిని తల్లిదండ్రులు కనిపెట్టుకునే ఉంటారు. 1995లో నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మెడిసిన్ చేసిన ఎంతోమంది అమెరికా వెళ్లేవాళ్లు. ఇది చూసి చాలామంది నాతో బ్రెయిన్ డ్రెయిన్ అవుతోందన్నారు. రాబోయే రోజుల్లో బ్రెయిన్ గెయిన్ అవుతుందని వారికి చెప్పాను అని ముఖ్యమంత్రి అన్నారు.

### పేదల అభ్యున్నతి కోసం పి4

నేను జన్మభూమి కార్యక్రమానికి పిలుపునిచ్చినప్పుడు ఎంతోమంది ప్రవాసాంధ్రులు తాము పుట్టి పెరిగిన ఊరికి సాయం చేసేందుకు ముందుకొచ్చారు. మనందరం గ్రామీణ ప్రాంతాల్లో చిన్న కుటుంబాల్లో పుట్టిన వారమే. అవకాశాలు అందిపుచ్చుకుని అంచెలంచెలుగా ఎదిగాం. రహదారులు, ఎయిర్ పోర్టులు, విద్యుత్ రంగంలో వేగవంతమైన అభివృద్ధికి పీ4 మోడల్ సరైందని కేంద్రం భావిస్తోంది. అయితే ధనిక, పేదల మధ్య వ్యత్యాసాలు పెరిగిపోతున్నాయి. నేను అందుకే పేదల అభ్యున్నతి కోసం పీ4 తీసుకొచ్చాను. పేదలు సంపాదించే స్థాయికి చేరితేనే సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గుతాయి. చదువు అనేది గేమ్ ఛేంజర్. అంబేద్కర్, అబ్దుల్ కలామ్ ఆర్థిక సాయంతోనే అత్యున్నత స్థాయికి ఎదిగారు. పీ4 కార్యక్రమం లక్ష్య సాధనలో 50 శాతం రీచ్ అయ్యాం. ప్రవాసాంధ్రులు కూడా పేదలకు ఆర్థిక చేయూత అందించేందుకు ముందుకు రావాలని సీఎం పిలుపునిచ్చారు.

### దాతృత్వం గొప్పది:

గుంటూరు మెడికల్ కాలేజీలో చదివిన వారిలో 8 మందికి పద్మశ్రీలు రావడం గొప్ప విషయం. మన రాష్ట్రంలో ఆంధ్రా మెడికల్ కాలేజీ తర్వాత ఏర్పాటైన రెండవది గుంటూరు మెడికల్ కాలేజీనే. జీజీహెచ్ లో మాతా, శిశు ఆరోగ్య కేంద్రాన్ని 2,69,245 చదరపు అడుగుల విస్తీర్ణంలో, 5 అంతస్తుల్లో ఏర్పాటు చేశారు. మొత్తంగా 600 బెడ్లు ఈ బ్లాకులో ఉన్నాయి. ప్రసూతి విభాగం 300 బెడ్లు, పీడియాట్రిక్స్ విభాగంలో 200 బెడ్లు విభాగాల్లో మిగిలిన బెడ్లు ఉన్నాయి. నిర్మాణం కోసం డాక్టర్ గవిని ఉమాదేవి రూ.22 కోట్లు, నళినివెంకట్ తేళ్ల రూ.8 కోట్లు, వాసిరెడ్డి రమాదేవి కొండ్రగుంట వెంకట్రావు రూ. 4.32 కోట్లు, మొవ్వ వేదవతివెంకటేశ్వరరావు రూ. 4.04 కోట్లు, డాక్టర్ తేలికిచర్ల గుడిమెడ కుటుంబాలు రూ. 3.60 కోట్లు, డాక్టర్ లక్ష్మీచౌదరి గంగ రూ.3.40 కోట్లు, బీనా నూతక్కిగోపాలరావు రూ.3.20 కోట్లు ఇచ్చారు. పూర్వ విద్యార్థులు ఈ బ్లాక్ నిర్మాణంతో పాటు... గతంలో రూ.35 కోట్లను వెచ్చించి ఆడిటోరియం నిర్మించారు తులసీ సీడ్స్ సహా పలువురు దాతలు ముందుకొచ్చారు. గుంటూరు ఎంపీ, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ రూ.80 కోట్ల వరకూ విరాళాలు సేకరించి పనులు పూర్తి చేస్తున్నారు. నాట్కో కూడా 201718లో రూ. 47 కోట్లు, ఈ ఏడాది రూ.18 కోట్లు, క్యాన్సర్ చికిత్సకు రూ. 18 కోట్లు, ఇతరత్రా అవసరాలకు రూ. 12 కోట్లు ఖర్చు చేశారు. అలాగే గుంటూరులో మిలీనియమ్ బ్లాక్ కోసం రూ. 16 కోట్లు, విశాఖ ఏయూ మెడికల్ కాలేజీ బ్లాక్ నిర్మాణం కోసం రూ. 60 కోట్లు, కాకినాడ ఆస్పత్రికి రూ. 40 కోట్లు, కర్నూలు మెడికల్ కాలేజీకి రూ, 20 కోట్లు ఖర్చు చేయడం అభినందనీయం అని సీఎం చంద్రబాబు అన్నారు.

### మేటి నగరంగా అమరావతి

నూతన గ్రీన్ ఫీల్డ్ నగరంగా అవతరిస్తోందని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 202526 ఆర్థిక సర్వేలో స్పష్టం చేసింది. ప్రధాని మోదీ నాయకత్వంలో 2038 నాటికి ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మన దేశం తయారవుతుంది. 2047 నాటికి స్వర్ణాంధ్ర లక్ష్య సాధనతో మనం ముందుకెళ్తున్నాం. రాజధానికి అంత భూమి ఎందుకు, 100 ఎకరాల్లో సచివాలయం కట్టేస్తే చాలని ఎంతోమంది అన్నారు. కానీ జాతికి గుర్తింపు లభించాలన్నా, అన్ని ప్రాంతాలతో సమానంగా మనం ఉండాలన్నా అభివృద్ధి చెందాలి. కర్ణాటక రాష్ట్రానికి బెంగుళూరు, తమిళనాడుకు చెన్నై, తెలంగాణకు హైదరాబాద్ నగరాలున్నాయి. మనం అమరావతిని చిన్న నగరంగా వదిలేస్తే ఆర్థిక వ్యవస్థలో వెనకబడతాం. అందుకే హైదరాబాద్ కంటే మెరుగైన నగరం కట్టాలని నిర్ణయించాం. ఈ 30 ఏళ్లలో ప్రపంచంలో ఎంతో అభివృద్ధి జరిగింది. టెక్నాలజీలో పెను మార్పులు వచ్చాయి. అమెరికాలో సిలికాన్ వ్యాలీ ఉంది... మరి ఇండియాలో ఏముందని అడిగే వారికి అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఉందన్నదే మన సమాధానం. ఆనాడు సైబరాబాద్ నిర్మించాం. నేడు క్వాంటమ్ వ్యాలీకి శ్రీకారం చుట్టాం. ఒకప్పుడు ఇళ్లలో కరెంటే ఉండేది కాదు ఇప్పుడు ఇంటిపైనే కరెంటు తయారు చేసుకుంటున్నాం. 1999లో నాటి అసెంబ్లీలో కరెంటు గురించే గంటల కొద్దీ చర్చలు జరిగేవి. అప్పుడు విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చాం. విద్యుత్ రంగంలో మన దేశం నెంబర్ వన్ గా ఉండటం గర్వకారణం. అమెరికాలో కూడా నాలుగు గ్రిడ్ లు ఉండగా... ప్రపంచంలో సింగిల్ పవర్ గ్రిడ్ ఉండే ఏకైక దేశం మనదే. సోలార్ విండ్ పంపుడ్ స్టోరేజీకి శ్రీకారం చుడుతున్నాం. ఇంకో పదేళ్లలో గుంటూరు సహా అమరావతి ప్రాంత రూపురేఖలు ఎలా మారతాయో మీరే చూస్తారు. గుంటూరు, మంగళగిరి, విజయవాడ కార్పొరేషన్లు కలిసిపోతాయి. 182 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు వస్తుంది. రెన్యువబుల్ ఎనర్జీ ఉంటుంది. పొల్యూషన్ మాటే వినపడదు. 1995లో ఐటీని, 2000లో బయో టెక్నాలజీని ప్రమోట్ చేశాము. ఆనాడు జినోమ్ వ్యాలీకి భూములిచ్చి ప్రోత్సహించగా ఆ తర్వాత కాలంలో భారత్ బయోటెక్ కొవిడ్ వ్యాక్సిన్ అక్కడి నుంచే తయారు చేసిందని సీఎం అన్నారు.

### రాష్ట్రమంతటా సంజీవని

టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చి నాణ్యమైన వైద్య సేవలను ప్రజలకు అందించే లక్ష్యంతో సంజీవని ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టాం. ప్రజల హెల్త్ రికార్డులను డిజిటలైజ్ చేసేలా ఈ ప్రాజెక్టును రూపొందిస్తున్నాం. కుప్పంలో పైలట్ ప్రాజెక్టు అయింది. త్వరలో రాష్ట్రమంతటా విస్తరించి రోల్ మోడల్ గా మారుస్తాం. నేడు కార్పొరేట్ ఆస్పత్రులు ఫైవ్ స్టార్ హోటళ్లను మించిపోతున్నాయి. రోగి చికిత్స ఖర్చు కంటే రూమ్ ఖర్చే ఎక్కువవుతోంది. త్వరలో ఎయిర్ అంబులెన్స్‌లు వస్తున్నాయి. 2026లో డ్రోన్ అంబులెన్స్ తీసుకురావాలని అనుకుంటున్నాం. ప్రవాసాంధ్రులు అమెరికా నుంచి వర్చువల్ గా లేక ఇక్కడికి వచ్చినప్పుడు కానీ పేషెంట్లకు ట్రీట్ మెంట్ చేసి, మెరుగైన వైద్య సేవలకు తగిన సూచనలు చేయాలని సీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి సత్యకుమార్ సహా పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.



మంత్రి అచ్చెన్నాయుడు అధ్యక్షతన ఆయిల్ పామ్ ధరల నిర్ధారణ కమిటీ సమావేశం

## ఆయిల్ పామ్ రైతుల సంక్షేమమే లక్ష్యం

### ధరల నిర్ధారణ కమిటీ సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు

విజయవాడ, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు అధ్యక్షతన 2025-26 నూనె సంవత్సరముకు గాను పామ్ ఆయిల్ గెలలు ధరను లెక్కించే సూత్రాన్ని నిర్ణయించేందుకు, ఆయిల్ పామ్ ధరల నిర్ధారణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఆయిల్ పామ్ విస్తీర్ణం, ఉత్పత్తి, ఉత్పాదకతలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 1.97 లక్షల మంది రైతులు 2.49 లక్షల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు చేస్తుండగా, ఇది 24 జిల్లాలు, 371 మండలాలకు విస్తరించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ నూనె గింజల మిషన్ ద్వారా ఉచిత మొక్కలు, సాగు ప్రోత్సాహకాలు, అంతర పంటలకు సహాయం, బిందు సేద్యం పరికరాలపై రాయితీలు అందిస్తున్నామని, కూటమి ప్రభుత్వ లక్ష్యసాధక నిర్ణయాలతో ఆయిల్ పామ్ రాష్ట్ర రైతులకు స్థిరమైన, లాభదాయక ఆదాయ పంటగా మారుతోందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, ఉద్యానవన శాఖ సంచాలకులు శ్రీనివాసులు, ఉద్యాన అదనపు సంచాలకులు, ఆయిల్ పామ్, ఆయిల్ ఫెడ్, ఆయిల్ పామ్ రైతులు, ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మార్చి 3న శ్రీవారి ఆలయం మూత

### ఉ.9గంటల నుండి సా. 7.30గంటల వరకు దర్శనాలుండవు



తిరుమల, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా మార్చి 3వ తేదీ మంగళవారం 10.30గంటలు పాటు తిరుమలేశుని ఆలయాన్ని మూసివేస్తున్నారు. ఆరోజు సాయంత్రం 3.20గంటల గంటలకు గ్రహణం ప్రారంభమై సాయంత్రం 6.47గంటలకు పూర్తవుతుంది. సాధారణంగా గ్రహణసమయానికి ఆరుగంటలు ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ. మార్చి 3వ తేదీ ఉదయం చంద్రగ్రహణం ప్రభావంతో ఉదయం 9గంటల నుండి సాయంత్రం 7.30గంటల వరకు శ్రీవారి ఆలయ తలుపులు మూసివేసి అన్ని దర్శనాలను రద్దుచేశారు. సాయంత్రం 7.30గంటలకు ఆలయం తలుపులు తెరచి శుద్ధి, పుణ్యాహవచనం నిర్వహిస్తారు. అనంతరం రాత్రి 8.30గంటలకు శ్రీవారి భక్తులకు స్వామివారి దర్శనం పునఃప్రారంభమవుతుంది. ఆరోజు ఆలయంలో జరగాల్సిన అష్టదళపాద పద్మారాధనసేవ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దుచేసింది. దేశవిదేశాల్లో ఉన్న శ్రీవారి భక్తులు ఈ విషయాన్ని గమనించి తిరుమల యాత్ర ప్రణాళికలు రూపొందించుకోవాలని టిటిడి కోరింది.

## శ్రీవారి ఆలయం వెలుపల మరింత సాఫీగా కదిలేలా ఉక్కురాడ్ల లైను

తిరుమల, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి విచ్చేస్తున్న భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ అధికారులు భక్తులకు సాఫీగా, సౌకర్యవంతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌ల నుండి ఆలయంలోనికి క్యూలైన్లమీదుగా చేరుకునే భక్తులు సంఖ్య పెరిగితే దక్షిణమాఢవీధిలో వెలుపల క్యూలైన్ తెరచి భక్తులను ఎలిపెంట్ గేట్ సమీపంలోనుండి ఆలయంలోనికి అనుమతినిస్తారు.

ఇక్కడ ఇదివరకు ఎలాంటి నియంత్రణ క్యూలైన్ లేకపోవడంతో భక్తులు గుంపులు గుంపులుగా వచ్చేవారు. అక్కడి భద్రత స్పింది నియంత్రించడం కష్టంగా మారింది.

ఇటీవల రథసప్తమికి ముందు ఈ ప్రాంతంలో భక్తుల క్యూలైన్ రద్దీని అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి గమనించారు. అక్కడ భక్తులకు ఇబ్బందులు, అసౌకర్యం లేకుండా అదనంగా ఉక్కురాడ్లతో క్యూలైన్‌ను ఆధునీకరించి ఏర్పాటుచేశారు. దీనివల్ల వైకుంఠమ్ క్యూలైన్ నుండి వచ్చే భక్తులు ఎలిఫెంట్ గేట్‌మీదుగా ఈ వెలుపల క్యూలైన్‌లో సాఫీగా చేరుకునే వీలుకలుగుతుంది.

## ఇంధన శాఖలో 27 మందికి కారుణ్య నియామకాలు

### ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



విజయవాడ, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: విద్యుత్ శాఖలో చనిపోయిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద 27 మంది అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగాలు మంజూరు చేశారు. ట్రాన్స్‌కో, జెన్‌కో సహా విద్యుత్ శాఖలోని పలు సంస్థల్లో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఈ నియామకాలు జరిగాయి. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నియామక పత్రాలను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ ట్రాన్స్‌కో, జెన్‌కోలో ఎప్పటికప్పుడు కారుణ్య నియామకాలు చేపడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో అర్హత మేరకు ఇంజినీరింగ్ ఉద్యోగాలు ఒక్కరికీ ఇవ్వలేదని విమర్శించారు. ఉన్నత విద్యార్హత ఉన్నవారికి కూడా ఆఫీసు సబార్డినేట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు మాత్రమే ఇచ్చారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అభ్యర్థి అర్హతకు తగిన ఉద్యోగాలు ఇస్తున్నామని తెలిపారు. అర్హులైనవారికి జూనియర్ ఇంజినీర్ ఉద్యోగాలు కూడా కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు చనిపోయిన ఉద్యోగుల కుటుంబాల్లోని పిల్లలకు 600 మందికి పైగా ఉద్యోగాలు ఇచ్చామని.. కారుణ్య నియామకాల్లో జాప్యం లేకుండా ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. సీఎం చంద్రబాబు నాయుడు అభ్యర్థుల ఏజ్ రిలాక్సేషన్ విషయంలోనూ సానుకూలంగా స్పందించి కారుణ్య నియామకాలకు పచ్చజెండా ఊపారని మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. తద్వారా బాధిత కుటుంబాలకు చెందిన ఓవర్ ఏజ్, అండర్ ఏజ్ వారికి ప్రత్యేక అనుమతులతో ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. భవిష్యత్తులోనూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకుని, ప్రతి మూడు నెలలకు ఒకసారి కారుణ్య నియామకాలు చేపడుతుందని చెప్పారు. దీనితో బాధితుల కుటుంబాలకు త్వరితగతిన ఊరట లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుత విద్యుత్ శాఖ ఇన్ సర్వీస్ ఉద్యోగులతో పాటు, కొత్తగా విధుల్లో చేరిన వారికి అవసరమైన శిక్షణను విశాఖపట్నంలోని సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రంగా అందిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగులందరూ విధుల్లో రెట్టింపు ఉత్సాహంగా పని చేసి విద్యుత్ సంస్థలకు మంచి పేరు తీసుకు రావాలని మంత్రి సూచించారు. సీఎస్ కె. విజయానంద్ మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తూ ఉద్యోగులు ఎవరైనా చనిపోతే కారుణ్య నియామకాలు చేపడుతున్నామని అన్నారు. ఏడాది లోపు దరఖాస్తు చేసుకోలేకపోయినవారికి కూడా సడలింపులు ఇచ్చి ఉద్యోగాలు కల్పించామని అన్నారు. ఉద్యోగుల భద్రత, యోగక్షేమాలు కల్పించడం తమ బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రమాదాలబారిన పడిన ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ఉద్యోగంలో చేరిన అభ్యర్థులంతా తమ స్కిల్ పెంచుకుంటూ వృత్తిపరమైన అభివృద్ధి సాధించాలని సీఎస్ విజయానంద్ ఆకాంక్షించారు.

## త్వరలో తిరుమలకు ఆ వాహనాలు బ్యాన్!

### ఘాట్‌లో కాలుష్య నియంత్రణ దిశగా టిటిడి కార్యాచరణ



తిరుమల, జనవరి 30 ప్రభాతవార్తప్రతినిధి: ఆధ్యాత్మికనగరం... యాత్రాస్థలం తిరుపతిలో రోజురోజుకూ పెరిగిన కాలుష్య శాతాన్ని నియంత్రించడంలో భాగంగా పుణ్యక్షేత్రం తిరుమలకు పాత డీజిల్, పెట్రోల్‌తో నడిచే వాహనాలకు త్వరలోనే చరమగీతం పాడాలనే కార్యాచరణ టిటిడి రూపొందిస్తోంది. ఇందుకోసం యాత్రికులు కూడా వీలైనంత వరకు విద్యుత్ వాహనాలను వినియోగించుకునే దిశగా టిటిడి అవగాహన కల్పించనుంది. తిరుపతినుండి తిరుమలకు ఘాట్‌లో నడిచే వాహనాల వల్ల కాలుష్యం పెరిగిపోతోంది. పర్యావరణం కూడా కలుషితమవుతోందని పర్యావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తిరుమలకొండపై వాయు, వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించేందుకు పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యుత్ వాహనాల వినియోగంపై టిటిడి అధికారులు ఇప్పటికే దృష్టిపెట్టారు. దశాబ్ధకాలం క్రిందటి వాహనాలను, కాలంచెల్లిన వాహనాలను తిరుమలకు దాదాపు అనుమతించడం లేదు. అలిపిరి వద్ద రవాణాశాఖ, పోలీసులు తనిఖీ చేసి ఆ తరువాత అనుమతినిస్తున్నారు. ఘాట్‌లో సామర్థ్యం లేనివాహనాలను అలిపిరిలోనే నిలిపివేసి ఆర్టీసి బస్సుల్లో, ప్రత్యామ్నాయాలు చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో తిరుమలను పూర్తిస్థాయిలో కాలుష్య రహిత పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దాలనే సిఎం చంద్రబాబునాయుడు సూచనలు టిటిడికి స్పష్టంగా తెలిపారు. ఈ నేపథ్యంలో టిటిడి అధికారులు కూడా తిరుమల ఘాట్‌లో విద్యుత్ వాహనాలు వినియోగం పై అవగాహన, చర్యలకు సిద్ధమవుతున్నారు. టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సిఎం సూచనలు అమలు చేసే దిశగా కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే తిరుమలకు 50వరకు విద్యుత్‌తో నడిచే ఆర్టీసి బస్సులు తిరుగుతున్నాయి. ఇవేగాక మరో వందవరకు టిటిడి అధికారుల కార్లు, రెండువందలపైగా ద్విచక్ర వాహనాలు కూడా విద్యుత్‌తో నడిచేవి వినియోగిస్తున్నారు. గతంలోనే తిరుమలకు విద్యుత్ వాహనాలు నడపాలని ప్రభుత్వం సంకల్పించింది. టిటిడి ఉద్యోగులకు గత బోర్డు సులభ విధానంలో విద్యుత్ వాహనాలు కొనుగోలుకు మార్గం సుగమం చేశారు. ఇప్పుడు తిరుమల పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపింది. సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలవుతోంది. ఇక పూర్తిగా పాత డీజెల్, పెట్రోల్‌తో నడిచే వాహనాలను కూడా మెల్లగా తిరుమలకు అనుమతించకూడదని నిర్ణయించారు. ప్రస్తుతం ఆరువేలవరకు రోజువారీగా యాత్రికుల వాహనాలు, ట్యాక్సీలు దేశంలోని అనేక రాష్ట్రాల నుండి పెట్రోల్, డీజెల్‌తో నడిచేవి తీసుకువస్తున్నారు. 450వరకు ఆర్టీసి బస్సులు డీజిల్‌తో నడిచేవి తిరుగుతున్నాయి. స్థానికంగా తిరుపతి– తిరుమల మధ్య నాలుగు వేల వరకు ట్యాక్సీలు, వాహనాలు డీజెల్, పెట్రోల్‌వి నడుపుతున్నారు. దీనివల్ల ఘాట్‌లో, తిరుమల కొండపై కాలుష్యం శాతం పెరిగిపోతోందనేది పర్యావరణ శాస్త్రవేత్తల అంచనా. దీన్ని తగ్గించేందుకు, పచ్చదనం పెంపొందించడంతోబాటు పూర్తిగా విద్యుత్‌తో నడిచే వాహనాలను వినియోగంలోకి తీసుకురావాలని టిటిడి అధికారులు తీవ్రంగా ఆలోచన చేస్తున్నారు. 2026 జూన్‌నాటికి పాత డీజెల్, పెట్రోల్ వాహనాలను ఘాట్‌లో అనుమతించరాదనేది ఒక అంశంగా చర్చించారు. తిరుమలను కాలుష్యరహిత పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దాలనే ఆశయం దిశగా అడుగులు పడుతుండటం శుభపరిణామంగానే భావిస్తున్నారు.

## తిరుమల సమాచారం

### రేపు మాఘమాస పౌర్ణమి గరుడసేవ



తిరుమల, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: పవిత్రమైన మాఘమాసం పౌర్ణమి విశేషమైన రోజున ఆదివారం (రేపు) సాయంత్రం తిరుమలలో గరుడ సేవ జరగనుంది. విశేషాభరణాల అలం కృతుడై మలయప్పస్వామి గరుడ వాహనాన్ని అధిరోహించనున్నారు. ప్రతినెలా పౌర్ణమి రోజు తిరుమల ఆలయ మాఢ వీధుల్లో గరుడవాహనసేవ నిర్వహించడం పరిపాటి. ఆదివారం పౌర్ణమి వేళ గరుడ వాహనసేవ రాత్రి7గంటలకు జరగనుంది.

### భగవంతుని ఆశీస్సులందుకున్నాం




తిరుమల, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు పొందడంతో ఆనందంగా ఉందని పలువురు ప్రముఖులు తెలిపారు. దేవుని కరుణాకటాక్షాలు అందరిపై కలగాలని వేడుకున్నామన్నారు. శుక్రవారం వేకువజామున శ్రీవారి సుప్రభాతసేవ సమయంలో మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్, ఎంపి కేశినేని చిన్ని, మంత్రి టిజి భరత్ ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

### తిరుచానూరు పద్మావతి అమ్మవారికి జత కర్ణపత్రాలు బహూకరణ



తిరుమల, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: సిరులతల్లి... తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారికి దాత బంగారు,రాళ్ళతో పొదిగిన జత కర్ణపత్రము ఆభరణాలను బహుకరించారు.

తెలంగాణ హైదరాబాద్‌కు చెందిన కె.దీపక్ కుటుంబం 178 గ్రాముల బరువుతో రూ.23లక్షల విలువైన జత కర్ణపత్రములు బంగారు ఆభరణాలను టిటిడి అధికారులకు అందజేశారు. ఆలయ డిప్యూటీ ఇఒ పి.హరీంద్రనాథ్, ఆలయ సూపరింటెండెంట్ సురేశ్, ఏవిఎస్ఒ రాధాకృష్ణ, ఆలయ ఇన్‌స్పెక్టర్లు చలపతి, ప్రసాద్, ఆలయ అర్చకుడు బాబు స్వామి సమక్షంలో విరాళాలను అందజేశారు. అమ్మ వారికి వీటిని అలంకరించనున్నారు. వేద పండితులు వేదాశీర్వచనం చేశారు.



## బాలల సంరక్షణ కేంద్రాల రిజిస్ట్రేషన్ దరఖాస్తులు స్వీకరణ

విజయవాడ (గన్నవరం), జనవరి 30 ప్రభాతవార్త: బాలల సంరక్షణ కేంద్రాలకు తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లాఅదనపు పర్యవేక్షణాధికారి టి.జ్యోతి ఒప్రకటనలో తెలిపారు. సంరక్షణ కేంద్రాలకు ఏదైని చట్టం కింద లైసెన్స్ తీసుకున్నప్పటికీ జువ నైల్ జస్టిస్ చట్టం 2015లోని సెక్షన్ 41 కింద రిజిస్ట్రేషన్ తప్పదన్నారు. రక్షణ సంరక్షణ అవసరమైన పిల్లల కోసం పూర్తిగా కాని పాక్షికంగా నడప బడుతున్న బాలసంరక్షణ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వివరించారు. దరఖాస్తుతోపాటు అన్ని రకాల పత్రాలు జిరాక్స్ కాపీలతో 13తేదీ లోపు జిల్లా బాలల పరిరక్షణ విభాగం, ప్రభుత్వ అబ్జర్వేషన్ హోమ్ ఫర్ బాయ్స్ ప్రాంగణం, కబేళా సెంటర్, విద్యాధరపురం, విజయవాడ కార్యాలయంలో స్వయంగా సమర్పించాలని టి.జ్యోతి సూచించారు.


**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II,**
**At: Triveni Complex, Firstfloor, Abids, Hyderabad**

O.A.NO. 973 OF 2025

BETWEEN:
**PEGASUS ASSETS RECONSTRUCTION PRIVATE LIMITED,** Acting in its Capacity of Trustee of Pegasus Group 39 Trust 1, Having its Corporate Office at 55-56, 5th Floor, Free Press House, Nariman Point, Mumbai-400021.
**And one of its Representative Office at: Regus Business Centre** at 1-10-39 to 44, Level -4, Gumidelli Towers, Begumpet, Hyderabad-500016. Represented by its Authorized Signatory, **MAHESH KUMAR, S/o Jayanna,** Aged 44 years, Occ: Senior Manager of Applicant. ... **APPLICANT**

**AND**

1. **VRC SHORELINE ENTERPRISES PVT LTD,** Having its Office at H.No.8-2-268/1/A/8, Aurora Colony, Venture-2, Road No.3, Banjara Hills, Hyderabad-500034. Represented by its Directors **K CHARAN TEJ, K VIMALA DEVI, N MERU DEVI**
2. **KANNEGANTI CHARAN TEJ, S/o K Rama Krishna,** Aged about 37 Years, Occ: Business, R/o. Flat No.306, 3rd Floor, Mount Meru Apartments, H.No.8-2-393/B/306, Road No.5, Banjara Hills, Hyderabad-500034.
3. **VIMALA DEVI KANNEGANTI, W/o K Rama Krishna,** Aged about 59 Years, Occ: Business, R/o. Flat No.306, 3rd Floor, Mount Meru Apartments, H.No.8-2-393/B/306, Road No.5, Banjara Hills, Hyderabad-500034.
4. **MERU DEVI NUTHALAPATI, W/o N Veera Prakasa Rao,** Aged about 68 Years, Occ: Business, D.No.3-14-11, B-1, Sri Mansions, Pattabhipuram, Guntur- 522006. ... **DEFENDANTS**

To,
1. **VRC SHORELINE ENTERPRISES PVT LTD,** Having its Office at H.No.8-2-268/1/A/8, Aurora Colony, Venture-2, Road No.3, Banjara Hills, Hyderabad-500034. Represented by its Directors **K CHARAN TEJ, K VIMALA DEVI, N MERU DEVI**
2. **KANNEGANTI CHARAN TEJ, S/o K Rama Krishna,** Aged about 37 Years, Occ: Business, R/o. Flat No.306, 3rd Floor, Mount Meru Apartments, H.No.8-2-393/B/306, Road No.5, Banjara Hills, Hyderabad-500034.
3. **VIMALA DEVI KANNEGANTI, W/o K Rama Krishna, Aged about 59 Years, Occ: Business,** R/o. Flat No.306, 3rd Floor, Mount Meru Apartments, H.No.8-2-393/B/306, Road No.5, Banjara Hills, Hyderabad-500034.
4. **MERU DEVI NUTHALAPATI, W/o N Veera Prakasa Rao,** Aged about 68 Years, Occ: Business, D.No.3-14-11, B-1, Sri Mansions, Pattabhipuram, Guntur- 522006.

**NOTICE**

Please take notice that the Applicant had filed the above O.A seeking to direct the Defendants jointly and severally liableto pay an amount of **Rs.6,37,36,750.54/-** towards Loan Account Nos.809000752272& 809000752591and others reliefs sought therein. The Hon'ble Debt Recovery Tribunal-II posted the above **O.A on 04.03.2026** for your appearance. Hence make it convenient to appear before the Hon'ble Debt Recovery Tribunal-II on **04.03.2026 at 10:30 a.m.** either personally or through authorized Counsel or otherwise the matter will be adjudicated in due process of law.
Hence, this NOTICE.

[BY ORDER OF THE HON'BLE DEBT RECOVERY TRIBUNAL-II]
**VEERA SHIVA KUMAR**
ADVOCATE
Off: # Flat No.104, 1st Floor, Agarwal Towers, H.No.2-3-703/2/A, Thirumala Nagar, Amberpet, Hyderabad-500013. Mob No: 9154450333

వార్త

అహంకారం ఆత్మను పతనం చేయడమే కాక అనామకునిగా చేయడానికి ముఖ్య కారణమౌతుంది.

-సిసిరో

# 'సమ భావన' సామరస్యమేనా?

విశ్వవిద్యాలయాల్లో సమానత్వాన్ని ప్రోత్సహించడానికి అన్ని విద్యాసంస్థలు 'ఈక్విటీ' కమిటీలను ఏర్పాటు చేయడం తప్పనిసరి చేస్తూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ సరికొత్త నిబంధన ఇప్పుడు అత్యున్నత న్యాయస్థానం జోక్యం కోరుతోంది. ఈ నిబంధనలకు లోబడి కమిటీలు ఏర్పడతే కుల వివక్ష రూపు మాపడం తేలిక అని యుజిసి భావించింది. ఆ నేపథ్యంలోనే సర్వసమ్మతంగా ఉంటుందని ఎలాంటి విద్యార్థి భాగస్వామ్య సమావేశాలు లేకుండా ప్రకటించేశారు. కానీ విద్యార్థి సంఘాలు సుప్రీంకోర్టు కెక్కాయి. ఈ నిబంధనలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై తాత్కాలిక స్టే మంజూరైంది. ఈ సందర్భంగా న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలు ఆలోచించదగినవే. వ్యాఖ్యలు తీర్పులుగా రాకపోయిన ఈఅంశంలో ఉన్న లోతుపాతుల్ని చర్చించేందుకు మార్గదర్శకాలు అవుతాయి. యుజిసి మార్గదర్శకాలు అస్పష్టంగా ఉన్నందున వీటిని దుర్వినియోగం చేసేందుకే ఎక్కువ అవకాశం ఉందన్న ధోరణిలో ఉందనే న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు.విద్యాసంస్థల్లో స్వేచ్ఛాయుత సమానత్వం, సమ్మిళిత వాతావరణాన్ని ప్రతిబింబించే పరిస్థితులు ఉండాలని ధర్మాసనం భావిస్తోంది. రోహిత్ వేముల కేసులో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇన్నాళ్లకు యుజిసి నిబంధనలు 2012 స్థానంలో కొత్త నిబంధనలు అమల్లోకి తెచ్చింది. కొత్త నిబంధనలలో కులవివక్ష నిర్వచనాన్ని సరైన విధానంలో భాష్యం చెప్పలేదని కొన్ని వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఈ అంశంలో ఒబిసి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, అధ్యాపక సిబ్బందికే పరిమితం చేయడంలో అభ్యంతరాలు వెల్లువెత్తాయి.కొన్ని వర్గాలను యుజిసి మినహాయించడం సరైన విధానం కాదని కోర్టులో పిటిషనర్ వాదిస్తున్నారు. 'ఉన్నత విద్యాసంస్థల్లో సమభావన' అన్న నినాదం బాగానే ఉంది.కానీ ఎక్కడో ఏదో తేడా ఉందని పలు వర్గాలు అభ్యంతరాలు నడమ ఇప్పుడు ఏదో ఓ రూపంలో సుప్రీంకోర్టుకు చేరతాయి. అప్పుడే ఆ నిర్ణయంలోని లోపాలు తేటతెల్లమవుతాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల సాధారణ ప్రవర్తనను కూడా స్థానిక సంప్రదాయాలను సాటి విద్యార్థులకు అవగాహనలేక 'టీజింగ్'కు గురవుతున్నారన్న వార్తలు వింటూనే ఉన్నాం. యుజిసి కొత్త నిబంధనలో ర్యాగింగ్ అంశాన్ని చేర్చకపోవడమూ విమర్శకు గురైంది. ఈ కారణాల చేతనే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయమాల్యా బాగ్చీ ధర్మాసనం 'ఉన్నత విద్యాసంస్థల్లో సమానత్వ ప్రోత్సాహక కమిటీ ఏర్పాటు నిబంధనలు 2026ను నిలిపివేసింది. అంతవరకు పాత నిబంధనలే అమల్లో ఉంటాయి. జనరల్ కేటగిరీ విద్యార్థులకు ఫిర్యాదు చేసే హక్కులేకపోవడం వల్లనే అత్యధిక విద్యార్థులు తమకు కష్టం కలిగితే దిక్కెవరు? అన్న చందాన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాంతీయతత్వంతో ర్యాగింగ్ సమస్యలు తలెత్తుతున్న అంశాలు బయటికి వస్తున్నా వాటిని పరిష్కరించే యోచన యుజిసి నిబంధనల్లో కనబడటం లేదని జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి అభిప్రాయపడ్డారు. 2019లో రోహిత్ వేముల, పాయల్ తడ్వి మాతృమూర్తులు దాఖలు చేసిన 'పిల్'సందర్భంగా ఎన్నో అంశాలకు మార్గదర్శకాలను రూపొందించారు.వాటిని మార్చడంలో కుల వివక్షను పూర్తిగా నిర్మూలించాలన్న రాజ్యాంగ లక్ష్యంతోనే కొత్తనిబంధన రూపుదిద్దుకొంది. ఈ విషయంలో సుప్రీం ధర్మాసనం జోక్యం చేసుకోవడంపై భారతీయ జనతా పార్టీ, బిఎస్‌పి, టిఎంసి, ఎస్పీ పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి అంశాలపై విస్తృత చర్చలు జరగాల్సి ఉంది. కుల వివక్షలేని, కుల రహిత సమాజ సాధన కోసం స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్లయినా సరైన దిశగా ఆలోచించలేకపోతున్నారు అనే భావన కలుగుతోందన్న ధర్మాసనం అభిప్రాయం కరెక్టే. కులాంతర వివాహాలు, సర్వమత ప్రార్థనలు, పరమత సహనం వెల్లివిరుస్తున్న సందర్భాలు రానురాను గోచరిస్తూనేఉన్నాయి. అయినా 'సమ భావన' నిబంధనలో సమాజాన్ని చీల్చే ఆలోచనలెందుకు వస్తున్నాయో అర్థంకాదు. సమాజం మారుతున్నప్పుడు నిర్ణయాలు కూడా ఆ దిశగానేఉండాలి. ప్రఖ్యాత న్యాయ కోవిదులు, సామాజిక స్థితిగతులపై సమగ్ర అవగాహన ఉన్న నిపుణులు,ఇలా ఇద్దరు, ముగ్గురుతో కమిటీ ఏర్పాటు అత్యంత అవశ్యకం. సమాజం ఎలా ప్రగతి సాధించాలి? దాని కోసం విద్యాసంస్థల్లో నిబంధనలు తమ భవిష్యత్ జీవితంలో ఎలా ఉపయోగపడతాయి. వాటి పర్యవసానాలు ఎలా ఉంటాయి అనే అన్ని అంశాలను వారు లోతుగా అధ్యయనం చేయాల్సి ఉంటుందని ప్రధాన న్యాయమూర్తి సూచించారు. యూనివర్సిటీల్లో 'వివక్ష' అనగానే కులానికి అంటగట్టే ఏ విధమైన భాష్యాన్నైనా సరిచేయాలని ఆ విధమైన ప్రస్తావన తప్పనిసరిగా ఉండాలని విద్యార్థిలోకంకోరుతోంది.యుజిసి నిబంధనతో విద్యార్థిలోకంలో అలజడి మొదలైంది. కొన్ని సందర్భాల్లో అలజడి,మరికొన్ని అంశాల్లో ఆవేదన, ఇంకొన్ని ఉదంతాల్లో క్రమశిక్షణ వంటిఅన్ని అంశాలూ విద్యార్థుల్లో ఉండేవే. కానీ ఒక్కసారిగా యుజిసి ఆలోచనలు నిరసనలకు దారితీయకుండా ముందే జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత వర్సిటీల్లో ఉంది. విద్యార్థులకు కులాల వారీ హాస్టళ్ల ఏర్పాటును సుప్రీంకోర్టు వ్యతిరేకిస్తోంది. ఇన్నాళ్లూ ఒకే హాస్టల్‌లో కలిసి మెలిసి ఉండే వారిలో కులవైషమ్యాలు తలెత్తుతాయని ధర్మాసనం కూడాఆవేదన వ్యక్తం చేయడం విశేషం. 'ఐక్యభారత్' భావనను విద్యాయాల్లో తీసుకొచ్చే దిశగా నిపుణుల నివేదిక ఉండాలని ప్రజలు కోరుతున్నారు. 'సమభావన'కు అసలు సిసలైన నిర్వచనాన్నివ్వగల పరిస్థితి ఇప్పుడు ధర్మాసనం దృష్టిలోపడడం మంచిదే అయింది.

అధికారం నిలుపుకోలేనివారు వేరొకరిపై అధికారం చూపడం భావ్యం కాదు.



ఆస్కార్‌వైల్డ్

విజయం మేధావిని వినయవంతుణ్ని చేస్తుంది. సామాన్యుడిని ఆశ్చర్య పరుస్తుంది. అవివేకిని అహంభావిగా మారుస్తుంది.



స్వామి వివేకానంద

## ప్రజావాక్కు



### మానవత్వాన్ని చూపుదాం

గూడు లేని అభాగ్యులు ఫుట్‌పాత్‌లపై ఆకలి,చలి, నిరాశలతో ప్రతిరోజూ పోరాడుతూ జీవితాన్ని గడుపుతున్నారు. వారికి అన్నం పెట్టేందుకు కొందరు దాతలు ముందుకు వచ్చిమానవత్వాన్ని చాటుతున్నా, అది సరిపోవడంలేదు. సమాజంలోనిప్రతిఒక్కరం మనవంతుబాధ్యతను గుర్తించి చిన్న సహాయమైనా చేయూతనివ్వాలి.ఒక్కపూట అన్నం, ఒక మాట ధైర్యం, కొంచెం సానుభూతి కూడా వారి జీవితాల్లో ఆశనునింపగలదు.మనకు మిగిలిపోయే ఆహారాన్ని వృథా చేయకుండా అవసరమైన వారికి పంచితే, వారి కళ్లలో చిరునవ్వు వెలుగుతుంది. మనందరం కలిసిముందుకు వస్తే, గూడు లేని వారి బాధను కొంతైనా తగ్గించి, మానవత్వంతో నిండిన సమాజాన్ని నిర్మించగలుగుతాం.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి

తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రయాణికుల రక్షణకై చొరవ తీసుకుని ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలను నిరంతరము పర్యవేక్షిస్తూ నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న వాహనాలపై చర్యలుతీసుకుని ఫిట్నెస్ లేనివాహనాలు రోడ్లపైకి రాకుండా చూడాలి.ఈమధ్యరోడ్డుప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయి. ప్రభుత్వాలు రోడ్డుప్రమాదాలు పునరావృతం కాకుండా అధికారులు అప్రమత్తమైఎప్పటికప్పుడు తనిఖీలు చేపటాలి. ట్రాఫిక్ నియమ నిబంధనలను అతిక్రమిస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యలను కఠినంగా శిక్షించాలి. ప్రభుత్వాలు సురక్షిత రవాణాకై రోడ్ల మరమ్మత్తులు చేపడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి.

- కె.నాగరాజు, నల్గొండజిల్లా

### టీచింగ్ సిబ్బంది అవసరం

తెలంగాణ రాష్ట్రంలోఉన్న కరీంనగర్‌జిల్లాలో ఉన్న ఎస్సీ సైనిక్‌స్కూల్,వరంగల్ జిల్లాలోఉన్న ఎస్టిసైనిక్ స్కూల్‌లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఎక్కువ సిబ్బంది ఉండాలి.అన్ని టీచింగ్ సబ్జెక్టులతోపాటుగా జనరల్ నాలెడ్జి, కరెంట్‌అఫైర్స్,పోటీ పరీక్షలుఆర్థిక సామాజిక విషయాలపై అవగాహనకల్పించడానికి మిగులుటీచింగ్ సిబ్బందిని ఉపయోగించాలి. క్రీడలకు ఫిజికల్ డైరెక్టర్, టీచింగ్ కోసం తప్పనిసరిగా టీచింగ్ సిబ్బంది ఉండే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

-రాపాక రవీందర్, జనగాం

### స్టార్టప్ వ్యవస్థకు కొత్త దిశ

ప్రభుత్వ ప్రధాన పారిశ్రామికోత్పత్తి ప్రోత్సాహక కార్యక్రమం పదేళ్ల మైలురాయిని చేరుకున్న ఈసమయంలో, భారతదేశంలోని నూతన వ్యాపార వ్యవస్థను తిరిగి పరిశీలించాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది. 2016లో కొన్ని వందల నూతన సంస్థలతో మొదలైన ఈ ప్రయాణం, నేడు లక్షల సంఖ్యలో నూతన వ్యాపార యత్నాలకు విస్తరించింది. ఈవ్యవస్థ కోట్లాది ఉపాధి అవకాశాలను సృష్టించి,ప్రపంచంలో అగ్రగణ్య స్థానాన్ని సంపాదించింది. ఇది గర్వకారణమే అయినా, ఈ విజయంతోనే తృప్తిపడి నిలిచిపోవడం భవిష్యత్తుకు హానికరమవుతుంది.ఇప్పటివరకుభారత నూతనవ్యాపారాలఎదుగుదలప్రధానంగా ప్రజల దైనందినఅవసరాలకు సంబంధించినసేవలపైనే ఆధారపడింది.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఉపాధి హామీ స్ఫూర్తి పోకూడదు

సామ్రాజ్యవాద విధానం అవలంబించే నేటి ప్రపంచంలో చుక్కానిలా తీసుకొచ్చిన ఉపాధి హామీ స్ఫూర్తి పోకూడదు అంటే తెలంగాణ లాంటి రాష్ట్రాలు డ్యూరబుల్ అస్సెట్స్ మీద దృష్టి పెట్టాలి.పండ్ల తోటలు మీద దృష్టిపెట్టాలి. తెలంగాణలో పండ్ల తోటల వృద్ధి, కురాగాయాల తోటలు అభివృద్ధి చేయాలి. అప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యంఅవుతుంది. ఏలక్ష్యం తొని అయితే ఉపాధిహామీ ప్రవేశ పెట్టబడిందో ఆ లక్ష్యంచేరాలి. ఇప్పుడు రాష్ట్రాలు చేయాల్సింది ఏమిటి సంక్షేమం పేరుతో అప్పు లు తెచ్చి పప్పు బెల్లంలాగా పంచకుండా 40 శాతం నిధులు కేటాయించి పలవంతం అయినఉపాధి హామీ తెలంగాణలో సాధ్యం అని చూపాలి. ఇలా చేయడం వల్ల రైతులు లేదా కూలీల జీవన ప్రమాణ స్థాయిలు పెంచవచ్చు.

-భారత అవినాష్, జనగామ

### పెరుగుతున్న వాయు కాలుష్యం

దేశంలో మహా నగరాలు వాయు కాలుష్య కోరల్లో చిక్కుకుని ఉన్నాయి. దేశరాజధాని అందులో ప్రధానంగా ఉంది. పౌరులు తమ సొంత జీవన ప్రదేశాలను విడిచి వెళ్లలేరు. నివారణ చర్యలు కాగితాలమీదే ఉన్నంత కాలం వ్యక్తుల బాధ్యత ,ఇంగితం ఉండదు. ప్రకృతి రక్షణ, అవసరాల నియంత్రణ మరచిపోతే తెలియకుండానే హానికర వాయువులు ప్రవేశించి వింత వ్యాధులు ప్రబలి, వైద్యానికి నోచుకొని దుస్థితి వస్తుంది. ఇది ఏ రీతిలో మనిషికి గొప్పతనం. అభివృద్ధి చేసే దిశలో ఏ రంగమైన దాని ప్రతికూలతలు సమాంతరంగా చూడాల్సిందే.

-బి. మేఘనాదం, విశాఖపట్నం

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# గాంధీయిజమా! బ్రాందీయిజమా?

**దశలవారీగా తగ్గిస్తామని వేదికలెక్కి ఎన్నో ఉపన్యాసాలు ఇచ్చిన కొందరు నేతలు దశల వారీగా విస్తరింప చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో మంచినీరు దొరకని గ్రామాలు ఎన్నో ఉన్నాయి కానీ మద్యం దొరకని గ్రామాలు లేవనే చెప్పొచ్చు. ఇప్పటికైనా గాంధీ వారసులమని చెప్పుకొనే నేతలు ఆలోచించాలి. అవినీతిలో కూరుకు పోయి నిస్తేజంగా ఉన్న ఎక్సైజ్ శాఖను ప్రక్షాళన చేయాలి. సంకుత ప్రయోజనాలు విడనాడి విశాల ధృకథ్పంతో ప్రధానంగా జాతి భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని అడుగులు వేయాలి. అప్పుడే మహాత్ముడ్ని మరిచిపోలేదంటూ యేటా తామెంతో ఘనంగా నిర్వహిస్తున్న గాంధీ జయంతి, వర్ధంతులకు ఒక అర్థం ఉంటుంది**

దామెర్ల సాయిబాబ

జనవరి ముప్పై సోదరా జాతికి ముప్పైనాదిరా, కరం చంద్ నేడుండినా ఈ నిషా బంద్ కాకుండేనా అంటూ ఎంతో ఆవేదనతో అన్నాడో కవి. వాస్తవానికి మద్యపాన నిషేధం అన్నది మహాత్ముడు భారత ప్రజలకు అందించిన అమృత సందేశం. ఆనాడు కాంగ్రెస్ పార్టీయేకాదు స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న ప్రజాస్వామ్యవాదులెందరో మద్యపానాన్ని ఈ దేశం నుంచి పారద్రోలాలని నినదించారు. రాజకీయాలకు అతీతంగా మహాత్ముడ్ని అందరూ గౌరవించేవారే, ఆదరించేవారే, ఆరాధించేవారే. ఆయన జయంతులు, వర్ధంతులు క్రమం తప్పకుండా చేసుకుంటూనే ఉన్నాం. ఆయన ఇచ్చిన సందేశాలను పదేపదే వల్లిస్తూనే ఉంటాం. నిన్న శుక్రవారం గాంధీ వర్ధంతి దేశవ్యాప్తంగా ఎంతో ఘనంగా నిర్వహించుకున్నాం. ఆయనకు ప్రధానమంత్రి నరేంద్రమోడీతోసహా పలు రాష్ట్రాల ముఖ్య మంత్రులు, మంత్రులు, నాయకులు పార్టీలకు అతీతంగా అందరూ శ్రద్ధాభక్తులతో నివాళులు అర్పించారు.ఆయన సిద్ధాంతాలను, ఆయన చేసిన ప్రసంగాలను జాతికి ఇచ్చిన సందేశాలను మరీ మరీ గుర్తు చేసుకుంటూనే ఉన్నాం.కానీ ఆయన నినదించిన మద్యపాన నిషేధాన్ని మాత్రం పట్టించుకోకపోగా కేవలం ఆదాయం కోసం మద్యం సేవించండి అంటూ పాలకులే ప్రోత్సహించ డం అత్యంత దురదృష్టకరం. మద్యనిషేధంపై ప్రజలను కూడబెట్టి ఉద్యమం చేసినవారే అధికారంలోకి రాగానే ఏరు దాటాకా తెప్పతగలేసినట్లు వ్యవహరిస్తున్నా రు. మద్యం అనేది ప్రభుత్వాలకు ప్రధానఆదాయాల్లో ఒకటిగా మారింది. ఈ పరిస్థితుల్లో మద్యనిషేధం విధించడం అన్నది సాధ్యం కాదని కొందరి ఆర్థిక నిపుణుల వాదన నిజమే కావచ్చు.ఆదాయం కోసం ప్రజలఆరోగ్యాన్ని పణంగా పెట్టడం ఎంత వరకు సమంజసమో ఆలోచించాలి. మద్యం వల్ల జరుగుతున్న కష్టనష్టాలను పరిశీలిస్తే ముఖ్యంగా క్షేత్రస్థాయిలో జరుగు తున్న విషయాలను మనసుపెట్టి చూస్తే ఎంతటి హృదయ విదారక పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారో తెలుస్తుంది. అధికశాతం నేరాలు మద్యం మత్తులోనే జరుగుతున్నాయి. మానవ సంబంధాలు, మమతానురాగాలను కూడా మద్యం తుంచివేస్తున్నది. మొన్న ఆ మధ్య ఆంధ్రప్రదేశ్‌లో ఓ కన్న తండ్రి ఇద్దరు కుమారులనుఅత్యంత పాశవికంగా గొంతుకోసి చంపాడు. మద్యంమత్తులో భర్త పెట్టే బాధలు భరించ లేక ఇల్లాలు పుట్టింటికి వెళ్లిపోతే మైకంలో భార్యపై కసితీర్చుకునేందుకు సొంత కొడుకులనే గొంతుకోసి మట్టుపెట్టాడు. మద్యం తాగేందుకు డబ్బులు అడిగితే ఇవ్వని తల్లినే ఏకంగా కొట్టి చంపిన కొడుకులున్నారు. ఇలాంటి సంఘట నలు ఇటీవల కాలంలో తరచుగా జరుగుతున్నాయి. మరొక కిరాతకుడు మద్యం అలవాటు విడిచిపెట్టమని కాళ్లావేళ్లా పడిన భార్యను చంపి మూటకట్టి పడేశాడు. వారి ఏకైక కుమార్తె అనాథగా మారిపోయింది. మద్యం మత్తులో కూతురుపై అఘాయిత్యాలకు పాల్పడిన తండ్రులు జైళ్లలో మగ్గుతున్నారు. మద్యం రక్కసికి వేలాది కుటుంబాలు చిద్రమైపోతున్నాయి. ఇక నేరాల సంఖ్య విపరీతంగా పెరిగిపోతున్నది. మహిళలపై అత్యాచారాలకు, హత్యలకు అంతేలేకుండా పోతున్నది. అధికశాతం నేరాల్లో నిందితులు మద్యంమత్తులో ఉన్నవారే. అంతెందుకుప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దేశరాజధాని ఢిల్లీలో జరిగిన నిర్భయ కేసులో దోషులందరూ పూర్తిమత్తులో ఉన్నవారే. చాలా ప్రమాదాలకు మూలకారణం ఈ మద్యంమత్తే అని చెప్పొచ్చు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొంతకాలం పూర్తి నిషేధం అమలు చేసిన సమయంలో నేరాలతోపాటు ప్రమాదాలు కూడా తగ్గినట్లు అధికారిక రికార్డులే వెల్లడిస్తున్నాయి. యేటాదాదాపుపదిహేడు, పద్దెనిమిది వేల మందికిపైగా ఈ

## ఒక్క మాట

ప్రమాదాల్లో మరణిస్తున్నారు. మరో యాభై,అరవైవేలమంది క్షతగాత్రులవుతున్నారు. ఇలా క్షతగాత్రులైనవారిలో కొందరు శాశ్వత వికలాంగులుగా మారి కుటుంబానికి భారమై,మంచానికే పరిమితమై జీవచ్ఛ వంలా జీవనం సాగిస్తున్నారు. ఆ విషయం అలాఉంచితే.మద్యంవల్ల మామూలువ్యాధులేకాదు ఊపిరితిత్తులు,కేన్సర్‌లాంటి ప్రాణాంతక వ్యాధులతో కోట్లాది మంది అల్లాడిపోతున్నారు. మద్యం అనేది ఇప్పటికిప్పుడు వచ్చింది కాదు. దీనికి సుదీర్ఘ చరిత్రఉంది. మద్యానికి బానిసలై అనారోగ్యంపాలై కుటుంబాలకు కుటుంబాలే రోడ్డున పడు తుండడంతో ఆనాడే ఆవేదన చెందిన మహాత్ముడు స్వతంత్ర భారతావని నుంచిమద్యాన్ని తరమికొట్టాలని పిలుపునిచ్చారు. మహాత్ముడు కలలకు అనుగుణంగాస్వాతంత్ర్యం సిద్ధిం చిన తర్వాత 1947 అక్టోబరు ఒకటో తేదీ నుంచి అప్పటి మద్రాసు ప్రభుత్వం మద్యనిషేధాన్ని విధించింది. అందులో భాగంగా ఆంధ్ర,రాయలసీమ ప్రాంతాల్లో ఆనాడే దీనిని విజయవంతంగా అమలుచేశారు. మద్యపానం వల్ల కలిగే కష్టనష్టాలను ప్రజలకు వివరించి చెప్పడంలోనూ, మరోకపక్క అక్రమంగా మద్యం తయారు చేసేవారిపై ఉక్కుపాదం మోపడంలోనూ ఆనాటి ప్రభుత్వం ఎంతోసమర్థవంతంగా వ్యవహరించింది.ఎక్కడో రహస్యంగా మద్యం సేవించాలనుకున్నా, తాగి పదిమందిలోకి రావాలనుకున్నా భయపడేవారు. తాగుబోతులంటే ప్రజల్లోఒకరకమైన హేయభావం ఉండేది. వారిని సామాజికంగా బహిష్కరించే స్థాయికి ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో ఆనాటి పాలకులుకొంత వరకు విజయం సాధించారు.తాగుబోతు యువకుల పెళ్లిళ్లు కావడంకూడా కష్టతరమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. మద్యం రక్కసి రాష్ట్రాన్ని వదలిపెట్టక తప్పదనే పరిస్థితులు నెలకొన్నాయి. 1960ప్రాంతంలో రాజకీయ జోక్యంపెరగడంతో నిషేధాన్ని అమలుచేయడం కష్టతరంగా పరిణమించింది. సారాతయారీ దారులు కొందరు రాజకీయ నాయకుల అండదండలతో నిషేధానికి తూట్లు పొడవడం ప్రారంభించారు. మద్యనిషేధం వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆదాయంకోల్పోతుందని దానిని ఎత్తివేయాలనే వాదనను లేవనెత్తారు. అప్పటికే తెలంగాణ ప్రాంతంలో నిషేధం అమలులో లేకపోవడం, అక్కడఆదాయం ఆనాటికి దాదాపు రూ.యాభైకోట్లు ఉండడంతో ఒకే రాష్ట్రంలో ఒక దగ్గర నిషేధం, మరొకదగ్గర నిషేధం లేకపోవడం వంటి కారణాలు తర్జనభర్జనల అనంతరం 1969 ప్రాంతంలో నిషేధానికి స్వస్తి పలికారు.దీంతో ఆదాయం ఆనాడే వంద కోట్లపైకి చేరుకున్నది. అదిఇప్పుడు రెండు తెలుగురాష్ట్రాలలో అరవై, డెబ్భైవేల కోట్లకుపెరిగింది. ప్రభుత్వాలకు ప్రధాన ఆదాయంగా మారిపోయింది. ఎన్నికల్లో కూడా ఇది కీలకమైపోయింది. నియోజక వర్గంలోఎన్ని మంచి పనులు చేసినా, ఎంతడబ్బు వెదజల్లినా మద్యం పంచకపోతే గెలుపు అసాధ్యమనే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో రాజకీయాన్ని శాసించేస్థాయికి మద్యం ఎదిగిపోయింది. 1990ప్రాంతంలో ప్రధానంగా మహిళలు, మరికొందరు ప్రజాస్వామ్యవాదులు మద్యానికి వ్యతిరేకంగా ఉద్యమించారు. ఉద్యమ తీవ్రతను గ్రహించిన ఆనాటి ముఖ్యమంత్రి కె.శే. విజయభాస్కర్ రెడ్డి 1994 ఏప్రిల్ ఒకటిన సారాను నిషేధించి పాక్షికంగా మద్యనిషేధా న్ని విధించారు. కానీ అప్పటికే ఆరువందల కోట్ల రూపాయల వరకు రాష్ట్ర ఆదాయం కోల్పోతుందని కొందరు అధికారులు గగ్గోలు పెట్టారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉంటూ అధికార పీఠాన్ని అధిష్టించేందుకు ఆరాటపడుతున్న తెలుగు దేశం నేత ఎన్టీరామారావు పాక్షిక నిషేధంతో ఆశించినఫలితాలు రావని,సంపూర్ణ మద్యనిషేధమే సరైన మార్గమని పిలుపునిచ్చారు. అప్పటికే ఉద్యమిస్తున్న స్వచ్ఛసంస్థలు కొన్ని ఆయనతో గొంతుకలిపాయి. ఆఎన్నికల్లో ఈ నినాదం తెలుగుదేశం పార్టీకి ఎంతో ఉపయోగపడింది. ముఖ్యంగా మహిళలు నమ్మి తెలుగు దేశాన్ని అఖండ మెజారిటీతో గెలిపించారు. వేలాది మంది ప్రజలు పార్టీ కార్యకర్తలు, అధికారులు, అభిమానుల సమక్షంలో హైదరాబాద్ లాల్‌బహదూర్ స్టేడియంలో ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం సంపూర్ణ మద్యనిషేధం ప్రకటిస్తూ ఫైలుపై తొలిసంతకం చేశారు. ఆతర్వాత కొద్దికాలానికి అదే ప్రభుత్వంమద్యం అమ్మకాలకు తెరలేపింది. దశలవారీగా తగ్గిస్తామని వేదికలెక్కి ఎన్నో ఉప న్యాసాలు ఇచ్చిన కొందరు నేతలు దశలవారీగా విస్తరింప చేస్తున్నారు. తెలుగురాష్ట్రాల్లో మంచినీరు దొరకని గ్రామాలు ఎన్నో ఉన్నాయి కానీ మద్యం దొరకని గ్రామాలు లేవనే చెప్పొచ్చు.ఇప్పటికైనా గాంధీ వారసులమని చెప్పుకొనే నేతలు ఆలోచించాలి. అవినీతిలో కూరుకు పోయి నిస్తేజంగా ఉన్న ఎక్సైజ్ శాఖను ప్రక్షాళన చేయాలి. సంకుత ప్రయోజ నాలు విడనాడి విశాలధృకథ్పంతో ప్రధానంగా జాతి భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని అడుగులు వేయాలి.అప్పుడే మహాత్ముడ్ని మరిచిపోలేదంటూ యేటా తామెంతో ఘనంగా నిర్వహిస్తున్న గాంధీ జయంతి, వర్ధంతులకు ఒక అర్థం ఉంటుంది. ●

# భద్రత ముసుగులో నిఘా సామ్రాజ్యం

తిప్పర్తి శ్రీనివాస్

సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న కొద్దీ మన జీవితం మరింత సౌకర్యవంతమవుతోంది. ఒక క్లిక్‌తో సమాచారం, ఒక యాప్‌తో సేవలు, ఒక కెమెరాతో భద్రత ఇవి ఆధునిక సమాజానికి గుర్తులు. కానీ ఈ సౌకర్యాల వెనుక దాగి ఉన్న మరో వాస్తవం ఏమిటంటే, వ్యక్తిగత గోప్యత క్రమంగా కనుమరుగవుతూ ఉండటం.'భద్రత' అనే పదాన్ని ముందు పెట్టి, నిఘా వ్యవస్థలను విస్తరించడం నిజంగా ప్రజల రక్షణ కోసమా? లేక పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛపై దాడేనా? అనే ప్రశ్న నేడు ప్రతి ఆలోచన గల పౌరుడిని కలవరపెడుతోంది. ఒకప్పుడు నిఘా అనేది నేరస్తులపై మాత్రమే ఉండేది. నేడు పరిస్థితి మారిపోయింది. సీసీటీవీ కెమెరాలు, మొబైల్ ఫోన్ ట్రాకింగ్, బయోమెట్రిక్ డేటా, సోషల్ మీడియా పర్యవేక్షణ ఇవన్నీ సామాన్య ప్రజల జీవితాల్లో భాగమయ్యాయి. మనం రోడ్డుపై నడిచినా, బస్సులో ప్రయాణించినా, కార్యాలయంలో పని చేసినా, చివరకు మన ఇంట్లో ఉన్నా కూడా ఎవరో ఒకరు గమనిస్తున్నారనే భావన కలుగుతోంది. ఇది భద్రతకు సంకేతమా, లేక స్వేచ్ఛకు సంకెళ్లో? ప్రభుత్వాలు నిఘా వ్యవస్థలను సమర్థించడానికి ప్రధానంగా చూపే కారణం 'జాతీయ భద్రత'. ఉగ్రవాదం, నేరాలు, సామాజిక అశాంతిని నివారించడానికి నిఘా అవసరమని వాదిస్తాయి. నిజమే, కొన్ని సందర్భాల్లో నిఘా వల్ల నేరాలు వెలుగులోకి వచ్చాయి, దోషులు పట్టుబడ్డారు. కానీ ఈ నిఘా పరిమితులు ఎక్కడ ముగుస్తాయి? ఎవరి అనుమతితో, ఎవరి పర్యవేక్షణలో ఈ డేటా సేకరణ జరుగుతోంది? అన్న ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు చాలాసార్లు కనిపించవు. వ్యక్తిగత గోప్యత అనేది మానవ హక్కులలో ఒక ముఖ్యమైన హక్కు. ఒక వ్యక్తి ఏమి మాట్లాడాలి, ఎవరితో మాట్లాడాలి, ఎక్కడికి



వెళ్లాలి, ఏ ఆలోచనలను వ్యక్తపరచాలి ఇవి అతని స్వేచ్ఛకు సంబంధించిన అంశాలు. కానీ నిఘా విస్తరించిన కొద్దీ, ప్రజలు తమ మాటలు, చర్యలపై స్వయంగా నియంత్రణ విధించుకుంటున్నారు. ఎవరైనా వింటున్నారేమో, ఎక్కడైనా రికార్డ్ అవుతుందేమో అనే భయం సమాజంలో నెమ్మదిగా చొచ్చుకుపోతోంది. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతం. డిజిటల్ యుగంలో డేటా అనేది కొత్త సంపదగా మారింది. మన వేలిముద్రలు, కంటి రెటీనా వివరాలు, ఫోన్‌కాల్ రికార్డులు, లొకేషన్ డేటా ఇవన్నీ ఎవరి చేతుల్లో ఉంటున్నాయి? ఈ సమాచారాన్ని భద్రంగా ఉంచుతున్నారా?లేక వాణిజ్య ప్రయోజనాల కోసం లేదా రాజకీయ అవసరాలకోసం దుర్వినియోగం చేస్తున్నారా?అనే అనుమానాలు సహజంగా తలెత్తుతున్నాయి. ఒకసారి డేటా లీక్ అయితే, దాని ప్రభావం వ్యక్తి జీవితాన్ని పూర్తిగా అస్తవ్యస్తం చేయగలదు.ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో నిఘాగోప్యతమధ్య సమతుల్యతపై చర్చ జరుగుతోంది. కొన్నిదేశాలు కఠినమైన డేటా రక్షణ చట్టాలను తీసుకొచ్చాయి. పౌరుల అనుమతి లేకుండా వారి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించడాన్ని నిషేధించాయి. కానీ ఇంకా చాలా దేశాల్లో స్పష్టమైన చట్టాలు లేకపోవడం వల్ల, అధికారాల దుర్వినియోగానికి అవకాశం ఏర్పడుతోంది. భద్రత అవసరమే. కానీ ఆ భద్రత ప్రజల హక్కులను హరించేస్థాయికిచేరితే,అది రక్షణకాదుఅణచివేత. నిజమైన భద్రతఅంటే ప్రజలు భయపడకుండా జీవించగలగడం, తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరచగలగడం. నిఘా వ్యవస్థలు పారదర్శకంగా ఉండాలి, చట్టపరమైన నియంత్రణలో ఉండాలి.ఎవరు,ఎందుకు, ఎంతవరకు నిఘా చేయవచ్చో స్పష్టమైన మార్గదర్శకాలు అవసరం. చివరగా చెప్పాలంటే, భద్రత పేరుతో గోప్యతను త్యాగం చేయడం సులభమే.కానీ ఒకసారి కోల్పోయిన స్వేచ్ఛను తిరిగి పొందడం చాలా కష్టం. కాబట్టి సమాజం మొత్తం ఈ అంశంపై ఆలోచించాల్సిన అవసరం ఉంది. భద్రత గోప్యత ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం నిలబడగలదు. లేకపోతే, నిఘా కళ్లనీడలో మన స్వేచ్ఛ నెమ్మదిగా మాయమైపోయే ప్రమాదం ఉంది. ●

# ఒక్క క్షణం తప్పిదం.. జీవితాంతం విషాదం

ఎస్. కిష్టయ్య

రోడ్డు ప్రమాదాలు నేటి భారత సమాజంలో అత్యంత తీవ్రమైన ప్రజా సమస్యగా మారాయి. ఇవి కేవలం ఒక్క వ్యక్తి లేదా ఒక కుటుంబానికి మాత్రమే సంబంధించిన విషాదాలు కావు.సమాజం మొత్తాన్ని ఆర్థికంగా, మానసికంగా, సామాజికంగా దెబ్బతీసే విపత్తులు, అభివృద్ధి,సాంకేతిక పురోగతి, వాహనాల సంఖ్య పెరుగుదల ఒకవైపు జరుగుతుండగా, భద్రతా సంస్కృతి మాత్రం అదేస్థాయిలో పెరగకపోవడమే రోడ్డు ప్రమాదాల తీవ్రతకు మూల కారణంగా మారింది. ప్రతి రోజు జరిగే ప్రమాదాలు మనకు అలవాటుగా మారిపోవడం ఈ సమస్య ఎంత లోతుగా వేళ్లూనుకుపోయిందో సూచిస్తోంది. గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా ప్రతి ఏడాది సుమారు ఐదు లక్షలకు పైగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు అధికారిక నివేదికలు చెబుతున్నాయి. వీటిలో దాదాపు ఒకటిన్నర లక్షల మంది ప్రాణాలు కోల్పోతుండగా, లక్షల మందికి పైగా గాయాలపాలవుతున్నారు. అంటే సగటున ప్రతి గంటకు దాదాపు 17 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారన్న మాట. ప్రపంచంలో రోడ్డు ప్రమాద మరణాల్లో భారత్ ముందున్న దేశాల్లో ఒకటిగా ఉండటం అత్యంత ఆందోళనకరం. మరణించిన వారిలో సుమారు 60 శాతం మంది 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు గలవారే కావడం వల్ల, కుటుంబాలకు ఆధారమైన యువతే ఎక్కువగా బలవుతుండటం దేశానికి తీరని నష్టంగా మారుతోంది. ఈ ప్రమాదాలకు ప్రధాన కారణంగా మానవ తప్పిదమే అత్యధిక శాతంలో ఉంది. గణాంకాల ప్రకారం రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 75 నుంచి 80 శాతం వరకు మానవ నిర్లక్ష్యం, నియమాల ఉల్లంఘనే కారణం.అతివేగం ఒక్కటే సుమారు 40శాతం ప్రమాదాలకు కారణమవుతోంది. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల జరిగే ప్రమాదాలు సుమారు 8నుంచి 10శాతం వరకు ఉంటున్నాయి. మొబైల్ ఫోన్ మాట్లాడుతూ లేదా మెసేజ్‌లు చూస్తూ డ్రైవింగ్ చేయడం వల్ల జరిగే ప్రమాదాలు ప్రతి ఏడాది పెరుగుతున్నాయి. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఈ ధోరణి ఎక్కువగా కనిపిస్తోంది.హెల్మెట్, సీట్ బెల్ట్ వాడకం విషయంలో కూడా నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ద్విచక్ర వాహన ప్రమాదాల్లో మరణించిన వారిలో సగానికి పైగా హెల్మెట్ ధరించకపోవడం వల్ల తల గాయాలతోనే ప్రాణాలు కోల్పోతున్నారు. నాలుగు చక్రాల వాహనాల్లో సీట్ బెల్ట్ ధరించకపోవడం వల్ల తీవ్ర గాయాలపాలయ్యే వారి సంఖ్య



కూడా అధికంగానే ఉంది.చిన్నపిల్లలను సురక్షితంగా కూర్చోబెట్టే చైల్డ్ సేఫ్టీ సీట్లు వినియోగించకపోవడం వల్ల పిల్లల మరణాలు, గాయాలు పెరుగుతున్నాయి.మానవ తప్పిదంతో పాటు రోడ్డు మౌలికసదుపాయాల లోపాలు కూడా ప్రమాదాలకు దోహదపడుతున్నాయి.దేశవ్యాప్తంగా జరిగే ప్రమాదాల్లో సుమారు 25శాతం వరకు రోడ్డు డిజైన్ లోపాలు, గోతులు, తగిన సంకేతాల లేమి, సరైన లైటింగ్ లేకపోవడం వంటి అంశాలు కారణమవుతున్నాయి. హైవేలు, జాతీయ రహదారులపై గుర్తించిన 'బ్లాక్ స్పాట్లు' వేలసంఖ్యలో ఉన్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి. ఈ బ్లాక్‌స్పాట్ల వద్దే ప్రతి ఏడాది వేలాది ప్రమాదాలు, వందలాది మరణాలుజరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో సరైన రోడ్డు భద్రతా చర్యలు లేకపోవడం వల్ల అక్కడ ప్రమాదాల తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుంది. వాహనాల సాంకేతిక స్థితి కూడా ఒక ప్రధాన అంశం. సరైన నిర్వహణలేకపోవడం వల్ల బ్రేక్ ఫెయిల్యూర్, టైరు పేలడం, లైట్లు పనిచేయక పోవడం వంటి కారణాలతో జరిగే ప్రమాదాలు గణనీయంగా ఉన్నాయి. వాణిజ్య వాహనాల్లో ఓవర్ లోడింగ్ వల్ల జరిగే ప్రమాదాలు సుమారు 10శాతం వరకు ఉంటున్నట్లు అంచనాలు చెబుతున్నాయి. డ్రైవర్లకు సరైన విశ్రాంతి లేకపోవడం వల్ల నిద్రలేమి, అలసట కారణంగా జరిగే ప్రమాదాలు ముఖ్యంగా రాత్రి వేళల్లో ఎక్కువగా నమోదవుతున్నాయి. ఈ అసమతుల్యతే ప్రమాదాల పెరుగుదలకు దారితీస్తోంది.ప్రమాదాల తర్వాత పరిస్థితులు మరింత బాధాకరంగా ఉంటాయి. గణాంకాల ప్రకారం రోడ్డు ప్రమాదాల్లో మరణించే వారిలో సుమారు 30శాతం మంది సరైన సమయంలో వైద్యం అందకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోతున్నారు.'గోల్డెన్ అవర్'లో చికిత్స అందితే ప్రాణాలు దక్కే అవకాశమున్న అనేక కేసులు ఆలస్యాల వల్ల మృత్యువాత పడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ట్రామా కేర్ కేంద్రాల కొరత,అంబులెన్స్ సేవల ఆలస్యం ఈ పరిస్థితిని మరింత తీవ్రం చేస్తున్నాయి. రోడ్డు ప్రమాదాలవల్ల దేశానికి జరిగే ఆర్థికనష్టం కూడా అపారమే. నిపుణుల అంచనాల ప్రకారం రోడ్డు ప్రమాదాల వల్ల దేశ జిడిపిలో సుమారు 3నుంచి 4శాతం వరకు నష్టం జరుగుతోంది. ఇది లక్షలకోట్ల రూపాయల విలువైన నష్టం. వైద్య ఖర్చులు,పనిదినాల నష్టం, కుటుంబాలపై పడే ఆర్థికభారం, సామాజిక భద్రతా వ్యవస్థలపై ఒత్తిడి కలిపి దేశ అభివృద్ధిని వెనక్కి లాగుతున్నాయి. ఈపరిస్థితిని మార్చాలంటేప్రభుత్వ, సామాజిక, వ్యక్తిగత స్థాయిల్లో సమగ్ర చర్యలు అవసరం. రహదారుల నిర్మాణంలో భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడం,బ్లాక్‌స్పాట్లను శాస్త్రీయంగా సరిచేయడం,ట్రాఫిక్‌నియమాల అమలును కఠినంగా చేయడం అత్యవసరం. డ్రైవింగ్ లైసెన్సుల జారీప్రక్రియను కఠినతరంచేసి నిజమైన శిక్షణ పొందిన వారికే అనుమతులు ఇవ్వాలి. సమాజ స్థాయిలో రోడ్డు భద్రత ఒక ఉద్యమంలా మారాలి. పాఠశాల స్థాయి నుంచే ట్రాఫిక్ అవగాహనను పాఠ్యాంశంగా చేర్చాలి. ప్రమాదాల సమయంలో సహాయం చేసే వారికి చట్టపరమైన రక్షణ కల్పించాలన్న అవగాహనను విస్తరించాలి. ●












గుంటూరు వార్త



# మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు

గుంటూరు వెస్ట్,జనవరి 30, ప్రభాతవార్త: ఎంత ఎదిగినా జన్మభూమిని మర్చిపోకుండా ప్రవాసాంధ్రులు చేస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సంపాదించిన దాంట్లో కొంత సమాజసేవకు వినియోగిస్తే



వచ్చే తృప్తి మాటల్లో చెప్పలేనిదని సీఎం అన్నారు. గుంటూరు జీజీహెచ్ లో మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. కానూరిజింఖానా మాతా శిశు సంరక్షణ కేంద్ర నిర్మాణం కోసం కాలేజీ పూర్వ విద్యార్థులు రూ.100 కోట్ల విరాళాలను సమకూర్చగా... ఎక్విప్మెంట్, ఫర్నిచర్ కోసం రూ. 27 కోట్లు ప్రభుత్వం వెచ్చించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... ఖిసమాజంలో ఇంకా మంచి మిగిలే ఉందని ప్రవాసాంధ్రులు నిరూపించారు. సాధారణంగా నలభై, యాభై ఏళ్ల క్రితం విదేశాలకు వెళ్లి స్థిరపడినవాళ్లు జన్మభూమిని మర్చిపోతారు. కానీ మీరంతా చదువుకున్న కాలేజీని గుర్తు పెట్టుకుని 1981లోనే జింఖానా సంస్థ ఏర్పాటు చేసి ఇంత పెద్ద ఎత్తున సాయం చేస్తున్నారు. అందుకు మీ అందర్నీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఆరోగ్య కేంద్రం నిర్మాణంతో పాటు భవిష్యత్ లో దాని నిర్వహణకు ఎటువంటి ఆటంకాలు రాకుండా బ్యాంకులో కొంత సొమ్ము డిపాజిట్ చేయడం గొప్ప విషయం. మనతో పాటు సమాజం కూడా బాగుండాలన్నదే మన సంస్కృతి. ఇప్పటి వరకూ పాఠశాలలకు, ఆస్పత్రులకు, దేవాలయాలకు, ్రత్రాలకు, ఆట స్థలాలకు ఎంతోమంది దాతలు పెద్ద ఎత్తున విరాళాలు ఇచ్చారు. మనదేశ సంస్కృతి, సంప్రదాయాలు మరే దేశంలోనూ కనిపించవు. అమెరికాలోనైతే 18 ఏళ్లకే పిల్లలు బయటకు వెళ్లి స్వతంత్రంగా జీవిస్తారు. కానీ మనదేశంలో పిల్లలు ఎంత పెద్దవారైనా జీవితాంతం వారిని తల్లిదండ్రులు కనిపెట్టుకునే ఉంటారు. 1995లో నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మెడిసిన్ చేసిన ఎంతోమంది అమెరికా వెళ్లేవాళ్లు. ఇది చూసి చాలామంది నాతో..బ్రెయిన్ డ్రెయిన్ అవుతోందన్నారు. రాబోయే రోజుల్లో బ్రెయిన్ గెయిన్ అవుతుందని వారికి చెప్పాను అని ముఖ్యమంత్రి అన్నారు.

**పేదల అభ్యున్నతి కోసం పీ4:**

నేను జన్మభూమి కార్యక్రమానికి పిలుపునిచ్చినప్పుడు ఎంతోమంది ప్రవాసాంధ్రులు తాము పుట్టి పెరిగిన ఊరికి సాయం చేసేందుకు ముందుకొచ్చారు. మనందరం గ్రామీణ ప్రాంతాల్లో



చిన్న కుటుంబాల్లో పుట్టినవారమే. అవకాశాలు అందిపుచ్చుకుని అంచెలంచెలుగా ఎదిగాం. రహదారులు, ఎయిర్ పోర్టులు, విద్యుత్ రంగంలో వేగవంతమైన అభివృద్ధికి పీ4 మోడల్ సరైందని కేంద్రం భావిస్తోంది. అయితే ధనిక, పేదల మధ్య వ్యత్యాసాలు పెరిగిపోతున్నాయి. నేను అందుకే పేదల అభ్యున్నతి కోసం పీ4 తీసుకొచ్చాను. పేదలు సంపాదించే స్థాయికి చేరితేనే సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గుతాయి. చదువు అనేది గేమ్ ఛేంజర్. అంబేద్కర్, అబ్దుల్ కలామ్ ఆర్థిక సాయంతోనే అత్యున్నత స్థాయికి ఎదిగారు. పీ4 కార్యక్రమం లక్ష్య సాధనలో 50 శాతం రీచ్ అయ్యాం. 10 లక్షల 42 వేల మందిని లక్షా 2 వేల మంది దత్తత తీసుకున్నారు. ప్రవాసాంధ్రులు కూడా పేదలకు ఆర్థిక చేయూత అందించేందుకు ముందుకు రావాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

**మేటి నగరంగా అమరావతి:**

అమరావతి నూతన గ్రీన్ ఫీల్డ్ నగరంగా అవతరిస్తోందని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 202526 ఆర్థిక సర్వేలో స్పష్టం చేసింది. ప్రధాని మోదీ నాయకత్వంలో 2038 నాటికి ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మన దేశం తయారవుతుంది. 2047 నాటికి స్వర్ణాంధ్ర లక్ష ్య సాధనతో మనం ముందుకెళ్తున్నాం. రాజధానికి అంత భూమి ఎందుకు, 100 ఎకరాల్లో సచివాలయం కట్టేస్తే చాలని ఎంతోమంది అన్నారు. కానీ జాతికి గుర్తింపు లభించాలన్నా, అన్ని ప్రాంతాలతో సమానంగా మనం ఉండాలన్నా అభివృద్ధి చెందాలి. కర్ణాటక రాష్ట్రానికి బెంగుళూరు, తమిళనాడుకు చెన్నై , తెలంగాణకు హైదరాబాద్ నగరాలున్నాయి. మనం అమరావతిని చిన్న నగరంగా వదిలేస్తే ఆర్థిక వ్యవస్థలో వెనకబడతాం. అందుకే హైదరాబాద్ కంటే మెరుగైన నగరం కట్టాలని నిర్ణయించాం. ఈ 30 ఏళ్లలో ప్రపంచంలో ఎంతో అభివృద్ధి జరిగింది. టెక్నాలజీలో పెను మార్పులు వచ్చాయి. అమెరికాలో సిలికాన్ వ్యాలీ ఉంది... మరి ఇండియాలో ఏముందని అడిగే వారికి అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఉందన్నదే మన సమాధానం. ఆనాడు సైబరాబాద్ నిర్మించాం. నేడు క్వాంటమ్ వ్యాలీకి శ్రీకారం చుట్టాం. ఒకప్పుడు ఇళ్లలో కరెంటే ఉండేది కాదు ఇప్పుడు ఇంటిపైనే కరెంటు తయారు చేసుకుంటున్నాం. 1999లో నాటి అసెంబ్లీలో కరెంటు గురించే గంటల కొద్దీ చర్చలు జరిగేవి. అప్పుడు విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చాం. విద్యుత్ రంగంలో మన దేశం నెంబర్ వన్ గా ఉండటం గర్వకారణం. అమెరికాలో కూడా నాలుగు గ్రిడ్ లు ఉండగా... ప్రపంచంలో సింగిల్ పవర్ గ్రిడ్ ఉండే ఏకైక దేశం మనదే. సోలార్ విండ్ పంపుడ్ స్టోరేజీకి శ్రీకారం చుడుతున్నాం. ఇంకో పదేళ్లలో గుంటూరు సహా అమరావతి ప్రాంత రూపురేఖలు ఎలా మారతాయో మీరే చూస్తారు. గుంటూరు, మంగళగిరి, విజయవాడ కార్పొరేషన్లు కలిసిపోతాయి. 182 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు వస్తుంది. రెన్యువబుల్ ఎనర్జీ ఉంటుంది. పొల్యూషన్ మాటే వినపడదు. 1995లో ఐటీని , 2000లో బయో టెక్నాలజీని ప్రమోట్ చేశాము. ఆనాడు జినోమ్ వ్యాలీకి భూములిచ్చి ప్రోత్సహించగా ఆ తర్వాత కాలంలో భారత్ బయోటెక్ కొవిడ్ వ్యాక్సిన్ అక్కడి నుంచే తయారు చేసిందని సీఎం అన్నారు.

## రూ.25 లక్షల విలువ గల 198 కేజీల గంజాయి పోలీసుల స్వాధీనం

### -ఇద్దరు ముద్దాయిలు అరెస్ట్, మినీ ట్రక్కు, మొబైల్ ఫోన్‌లు సిజ్

**బాపట్ల,జనవరి30,ప్రభాతవార్త:** బాపట్ల జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా ఎస్పీ శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మార్టూరు పోలీస్ స్టేషన్ పరిధిలో బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద మార్టూరు పోలీసులు సీజ్ చేసిన 198 కేజీల గంజాయికి సంబంధించిన కేసు వివరాలను వెల్లడించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మంజునాథ ఈరప్ప (ముద్దాయి1) హోల్టింగ్



డ్రైవర్, కార్తిక్ హనుర్ రాజప్ప (ముద్దాయి2) బెల్దారి పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఇరువురు ఒకే గ్రామానికి చెందిన వారు పైగా బంధువులు, ఈరప్ప కి సుమారు 6 నెలలు క్రితం వారి గ్రామానికి సుమారు 5 కిమీ దూరములో గల హనురులో తమిళనాడుకి చెందిన ఒక వ్యక్తి పరిచయమన్నాడన్నారు.అతను చెప్పిన మేరకు ముద్దాయిలు ఇద్దరు కలిసి గంజాయి తీసుకొని రావడానికి జనవరి 27 న మధ్యాహ్నం హనుర్ నుండి బయలుదేరి జనవరి 29 వ తేది ఉదయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తుని దగ్గరికి వెళ్లి అక్కడ ఒక వ్యక్తిని కలిసి అతనికి వాహనము ఇచ్చిరన్నారు. ఆ వ్యక్తి వెళ్లి సదరు వాహనములో సుమారు 2 కేజీల బరువు గల 99 గంజాయి ప్యాకెట్స్ మొత్తం 198 కేజీల బరువు కలిగిన గంజాయిని లోడ్ చేసుకొని వచ్చి ముద్దాయులకి ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. ముద్దాయిలు ఇద్దరు జనవరి 29వ తేది న రాత్రి తుని నుండి బయలుదేరి బెంగుళూరు వెళుతున్నారు. రాబడిన సమాచారం మేరకు మార్టూరు పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ వై. శ్రీనివాసరావును అప్రమత్తం చెయ్యడంతో ఇన్స్పెక్టర్ వారి స్టేషన్ సిబ్బంది, ఈగల్ టీమ్ తో కలిసి బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద వాహన తనిఖీలు నిర్వహించారన్నారు. 54 9100 నెంబర్ గల బొలెరో మినీట్రక్కు వాహనము తనిఖీ చెయ్యగా అందులో 99 గంజాయి ప్యాకెట్ లను గుర్తించడం జరిగిందన్నారు ఒక్కొక ప్యాకెట్ లలో 2 కేజీల గంజాయి ఉందన్నారు. ఈమేరకు జనవరి 30న ఉదయం వాహనంలో ఉన్న ఇద్దరు ముద్దాయిలను అరెస్ట్ చేసి వారు అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.25,00,000/ విలువ గల 198 కేజీల గంజాయిని, గంజాయి



తరలించడానికి వినియోగించిన బొలెరో మినీట్రక్కు వాహనాన్ని, ముద్దాయిలకు చెందిన రెండు సెల్ ఫోన్ లను తదుపరి దర్యాప్తు నిమిత్తం సీజ్ చేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు బాపట్ల జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంను అరికట్టేందుకు సమర్థవంతమైన కార్యచరణతో ముందుకు సాగుతున్నామన్నారు. గతంలో గంజాయి సంబంధిత కేసులలో ముద్దాయిలుగా ఉన్న వారిపై నిఘా ఉంచడం జరిగిందన్నారు. ఈ కేసులో పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి ఫార్వర్డ్, బ్యాక్వర్డ్ లింకేజీలను కనుగొని కేసుతో సంబంధం ఉన్న మిగిలిన ముద్దాయిలను కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు. జిల్లాలో ఎవరైనా గంజాయి విక్రయించిన రవాణా చేసిన వినియోగించిన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా అడిషనల్ ఎస్పీ జి రామాంజనేయులు ఆధ్వర్యంలో ముద్దాయిలను అత్యంత చాకచక్యంగా పట్టుకోనుటలో ప్రతిభ కనభరిచిన మార్టూరు ఇన్స్పెక్టర్ వై.శ్రీనివాసరావు, ఎస్సై షేక్ సైదా, హెడ్ కానిస్టేబుల్ లు కోటేశ్వరరావు, ఆంజనేయులు, కానిస్టేబుల్ లు రమేష్, నాగేశ్వరరావు, శివకుమార్ మరియు హోంగార్డ్ లు రవి, రషీద్ లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## సీఎం చంద్రబాబు,మంత్రి నారాయణలను మర్యాదపూర్వకంగా కలిసిన కమిషనర్

**గుంటూరు కార్పొరేషన్, జనవరి 30, (ప్రభాతవార్త) :** ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో జింఖానా మాత శిశు సంక్షేమ కేంద్రం నూతన భవన ప్రారంభోత్సవానికి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ను గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కే మయూర్ అశోక్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గుంటూరుకు వచ్చిన సీఎంను ఎలిప్యాడ్ వద్ద కలిసి స్వాగతం పలికారు. అదేవిధంగా గుంటూరు నగర కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ కే.మయూరి అశోక్ శుక్రవారం సిఆర్‌డిఏ కార్యాలయంలో ఉన్న మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించారు. కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించాక ఆ శాఖ మంత్రిని శుక్రవారం కలిసి చర్చించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఇరువురు చర్చించుకున్నారు.





## చుట్టుగుంట వాకింగ్ ట్రాక్ హోర్డింగ్ల ఏర్పాటుకు ఏజెన్సీలకు ఇచ్చిన అనుమతులు తక్షణమే రద్దు చేయండి : నగర కమిషనర్


**గుంటూరు కార్పొరేషన్, జనవరి 30, ప్రభాతవార్త:** గుంటూరు నగరంలోని చుట్టుగుంట సెంటర్ లో ఉన్న వాకింగ్ ట్రాక్ చుట్టూ హోర్డింగ్ల ఏర్పాటుకు ఏజెన్సీలకు ఇచ్చిన అనుమతులను తక్షణమే రద్దు చేయాలని సిటీ ప్లానర్ రాంబాబుకు నగర కమిషనర్ కే. మయూరి అశోక్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. వాకింగ్ ట్రాక్ లో



హోర్డింగ్ ల ఏర్పాటుకు చేపడుతున్న పనుల విషయం తన దృష్టికి వచ్చిందని దీనిపై స్పందించి ఆ ఏజెన్సీలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్టు కమిషనర్ తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలిగే చర్యలను జిఎంసి అధికారులు ప్రోత్సహించవద్దని కమిషనర్ స్పష్టం చేశారు.

## సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికిన మేయర్ కోవెలమూడి

**గుంటూరు కార్పొరేషన్, జనవరి 30, (ప్రభాతవార్త) :** గుంటూరు నగరంలోని ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో నూతనంగా నిర్మించిన డాక్టర్ కానూరి జింఖానా మదర్ అండ్ చైల్డ్ హాస్పటల్ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని శుక్రవారం నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. గుంటూరు నగరానికి వచ్చిన సీఎంను హెలిప్యాడ్ వద్ద మేయర్ రవీంద్ర కలిసి స్వాగతం పలికారు.




## ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన ఎస్పీ

**గుంటూరు క్రైమ్,జనవరి30,ప్రభాతవార్త:** గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కానూరు - జింఖానా మాతా-శిశు సంరక్షణ ఆసుపత్రి భవనం" ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుంటూరు నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా గుంటూరు నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ముఖ్యమంత్రిని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మర్యాదపూర్వకంగా కలసి, పుష్పగుచ్ఛం అందించి సాదర స్వాగతం పలికారు.



## సీఎం సహాయనిధి రూ.1,50,404 ఎల్ఓసీ చెక్కు అందజేత

**మంగళగిరి, జనవరి 30, ప్రభాతవార్త:** మంగళగిరి మండలం పెద్దవడ్లపూడి గ్రామానికి చెందిన అనారోగ్య బాధితురాలు జొన్నకూటి ధనమ్మకు మంత్రి నారా లోకేష్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి



నుంచి రూ.1,50,404/ విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ) మంజూరు పత్రం అందజేశారు..ధనమ్మ కుటుంబ సభ్యులకు ఈ మంజూరు పత్రాన్ని టిడిపి నాయకులు అందజేసి, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, నిరుపేద కుటుంబాలకు సీఎం సహాయనిధి పెద్ద అండగా నిలుస్తోందని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం తరఫున ఆర్థిక భరోసా కల్పించడం ముఖ్య లక్ష ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, మాదల రమేష్ బాబు, పిడుగు రవి, కట్టా శ్రీను, షేక్ భాషా, కొండపల్లి కిషోర్, ఖాసీం, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

## పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

### నగర కమిషనర్ మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, జనవరి 30,(ప్రభాతవార్త) : గుంటూరు నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో కార్పొరేషన్ లోని విభాగాలకు చెందిన అధికారుల మధ్య సమన్వయ లోపం కనిపిస్తుందని, ఆయా విభాగాల అధికారులు కలిసి పనిచేయాల్సిందేనని నగర కమిషనర్ కే మయూరి అశోక్ హెచ్చరించారు. నగర ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్దేశిత గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. శుక్రవారం లక్ష్మీపురం, కృష్ణ నగర్, బృందావన్ గార్డెన్స్ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. అభివృద్ధి పనులతో పాటు, రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి అధికారులకు తమ ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి అసలు పూర్తిగా సమాధానం చెప్పిన ఏఈలు డిఈ లపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విధులలో,పనులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసు కుంటామని తెలిపారు. ఈ పర్యటనలో సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ ఈ వెంకటేశ్వరరావు, సీఎం ఓహెచ్ డాక్టర్ శాంతి కళ, కార్పొరేటర్ పద్మశ్రీ, విభాగాల అధికారులు పాల్గొన్నారు.




కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వంగా సంస్థ) A Government of India Undertaking

ప్రాంతీయ కార్యాలయం : గుంటూరు విజయపురి 5వ లేను ఎదురుగా, జెకెసి కాలేజ్ రోడ్డు, గుంటూరు-522006, ఆంధ్రప్రదేశ్

**ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు**

టు:

ఋణగ్రహీత: శ్రీ. సయ్యద్ ఖాదర్, తండ్రి: ఉమర్, 4 -174, 4వ వార్డు, ఇపురుపాలెం, చీరాల, బాపట్ల జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 523166.

డియర్ సర్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.

మా కెనరా బ్యాంక్, చీరాల-I బ్రాంచ్ నుండి శ్రీ. సయ్యద్ ఖాదర్, తండ్రి: ఉమర్ పొందిన లోన్/ఋణసౌకర్యాల వివరములు:

| లోన్ స్వభావం & అకౌంట్ నెం. | లోన్ మొత్తం & లోన్ తేది | తేది 28.01.2026 నాటికి వడ్డీతో కలిపి | వడ్డీ రేటు |
|---|---|---|---|
| 619-హౌస్ ఫైనాన్స్ అకౌంట్ నెం. 0896619007978 | రూ. 37,50,000/- తేది: 25.06.2020 | రూ. 31,55,789.05/- | 8.50% |
| 619-హౌస్ ఫైనాన్స్ అకౌంట్ నెం. 160000556311 | రూ. 5,50,000/- తేది: 11.02.2022 | రూ. 4,17,989.00/- | 8.50% |

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ సదరు ఋణాన్ని తేది 23.01.2026 న నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది. అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా రూ. 35,73,778.05/- (అక్షరాల ముప్పై ఐదు లక్షల డెబ్బై మూడు వేల ఏడు వందల డెబ్బై ఎనిమిది రూపాయలు మరియు ఐదు పైసలు మాత్రమే), + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఇందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.

SARFAESI చట్టం, సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డుల్లో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిష్టర్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసును పంపించడం జరిగింది.

**బ్యాంకుకు హైపాథికేట్/తనఖాపెట్టిన స్థిరాస్తి వివరములు దిగువున తెలుపబడినవి :**

ప్రకాశం జిల్లా, చీరాల సబ్-జిల్లా, చీరాల మండలం, ఏపురుపాలెం గ్రామం, సర్వే నెం. 240/6, పాత బ్లాక్ నెం. 4, పాత డోర్ నెం. 4-130, ప్రస్తుత బ్లాక్ నెం. 3, ప్రస్తుత డోర్ నెం. 3-128, అసెస్మెంట్ నెం. 628 కలిగిన 233 చ॥గ॥లు లేదా 194 చ॥మీ॥ల స్థలంలో రెసిడెన్షియల్ ఆర్‌సిసి రూఫ్ గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు గల బిల్డింగ్, హద్దులు: తూర్పు: పంచాయతీ రోడ్డు -24.04 అ॥లు, దక్షిణం: పంచాయతీ రోడ్డు - 77.06 అ॥లు, పడమర: కామంచి శ్రీను యొక్క ఆస్తి – 29-09 అ॥లు, ఉత్తరం: కోడాలి జానకి యొక్క స్థలం – 44.04 అ॥లు, ఎ. పడమర: డిట్టో – 2.00 అ॥లు, ఎ. ఉత్తరం: డిట్టో – 31.00 అ॥లు.

టైటిల్ హోల్డర్: శ్రీ. సయ్యద్ ఖాదర్, తండ్రి: ఉమర్.

తేది: 28.01.2026, ప్రదేశం: గుంటూరు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

# పల్నాడు జిల్లా వార్త



## ఆర్యవైశ్య కుటుంబానికి ఆర్థిక సాయం

కారంపూడి, జనవరి 30 ప్రభాతవార్త: స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద తడికమళ్ల రవికుమార్ గుండెపోటుతో మృతి చెందడంతో కుటుంబానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రూ.51,116 నగదును అందజేశారు. రవికుమార్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఆర్థికంగా సహాయమందించిన ప్రతిఒక్కరికీ రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు. దేవస్థానం మాజీ అధ్యక్షులు చీతిరాల వెంకట కోటేశ్వరరావు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఎస్పీఆర్ కృష్ణ, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు సముద్రాల పవన్‌సాయి, పెద్దలు కొల్లా సాంబశివరావు, కొలిశెట్టి మల్లికార్జునరావు, ఊటుకూరి రాము, ఆతుకూరి గోపి, ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు కొత్త అశోక్, సిందిరి మణి, చింతా అనిల్, వెచ్చా నవీన్, బచ్చు వెంకటేష్, సూరె నాగేశ్వరరావు, బొగ్గవరపు సాయి సుధీర్, మండల ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.



## ఘనంగా జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి

కారంపూడి, జనవరి 30 ప్రభాతవార్త: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలు ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహాత్మాగాంధీ, పొట్టిశ్రీరాములు విగ్రహాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు. సత్యం, అహింస సిద్ధాంతాలతో బ్రిటిష్ పాలన నుంచి భారత దేశానికి స్వాతంత్ర్యం సాధించారని కొనియాడారు. దక్షిణాఫ్రికాలో వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాడి, భారత్‌కు వచ్చాక సహాయ నిరాకరణ, సత్యాగ్రం, ఉప్పుసత్యాగ్రహం వంటి ఉద్యమాల ద్వారా ప్రజలను ఉత్తేజపరిచారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఎస్పీఆర్ కృష్ణ, యువజన సంఘం అధ్యక్షులు సముద్రాల పవన్‌సాయి, ఆర్యవైశ్య నాయకులు సూరె ఆంజనేయులు, ఊటుకూరి రాము, కజ్జం హనుమంతరావు, ఆతుకూరి గోపి, గర్రె సుధాకర్, కొలిశెట్టి మల్లికార్జునరావు, కోటా బుచ్చయ్య, సూరె నాగేశ్వరరావు, కరాలపాటి సాయి, సిందిరి మణి, చింతా అనిల్, ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.



## ఫిబ్రవరి 4న మండల పరిషత్ అధ్యక్షుని ఎన్నిక

కారంపూడి, జనవరి 30 ప్రభాతవార్త: కారంపూడి మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక ఫిబ్రవరి 4వ తేదీన జరపనున్నట్లు ఎంపీడీఓ గంటా శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. గతంలో ఎంపీపీగా పనిచేసిన మేకల శారదపై టీడీపీ ఎంపీటీసీలు పెట్టిన అవిశ్వాసం నెగ్గనడంతో ఈ ఖాళీ ఏర్పడింది. ఎంపీపీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసిందని ఆయన తెలిపారు. ఫిబ్రవరి 4న ఎన్నిక జరుగుతుందన్నారు. ఇప్పటికే ప్రత్యేక సమావేశానికి సంబంధించి ఎంపీటీసీలకు సమావేశానికి హాజరు కావాలని నోటీసు కూడా జారీ చేశామన్నారు.



## మహాత్మాగాంధీకి నివాళుల్పించిన చీఫ్‌విప్ జీ.వీ

వినుకొండ,జనవరి30,ప్రభాతవార్త: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి పురస్కరించుకొని పట్టణంలోని చీఫ్‌విప్ కార్యాలయంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు పూలమాలలు



వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో మహాత్మాగాంధీ చేసిన శాంతి పోరాటం మరువలేనిదన్నారు. సత్యం,అహింసా మార్గాలను ఆయుధాలుగా చేసుకొని బ్రిటిష్ కబంధహస్తాల నుండి భారత జాతికి విముక్తి కల్గించిన మహనీయుడు గాంధీ మహాత్మా అని ఆయన ఆశయాలను నేటి యువత కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీ క్రీడాదుస్తులు అందజేత

నూజెండ్ల, జనవరి30,ప్రభాతవార్త: గుంటూరు జిల్లా స్థాయి అండర్17 బాలికల కబడ్డీ పోటీల్లో మండలంలోని కంభంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్టు పాల్గొననుంది. నూజెండ్ల మండలం జట్టు జిల్లా స్థాయిలో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ స్కూల్ ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు తమ్మిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో క్రీడాకారులకు ఉచితంగా క్రీడాదుస్తులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగ బసవయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు తి.బాబు, ఉపాధ్యాయులు తి.సోమ సూర్య ప్రకాశరావు, బి.రామాంజిరెడ్డి, బి.చిన్న గోవిందు, శేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## టీడీపీ కార్యాలయంలో మహాత్మా గాంధీ 78వ వర్ధంతి

నరసరావుపేట టౌన్,జనవరి 30 ప్రభాతవార్త ::నరసరావుపేట పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సత్యం, అహింస అనే ఆయుధాలతో భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించిన మహానుభావుడు మహాత్మా గాంధీ అని గుర్తు చేశారు.



బాపూజీ చూపిన సత్యమార్గం, అహింసా సిద్ధాంతాలు నేటి సమాజానికి మరింత అవసరమని తెలిపారు.ప్రతి ఒక్కరూ గాంధీజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని, ఆయన చూపిన మార్గంలో నడవడమే జాతిపితకు మనం అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మెహర్, అత్తులూరి సుబ్బు, శ్రీనివాసరావు, మురళి, అప్పారావు, మన్నాన్ షరీఫ్, కడియాల తాండవ కృష్ణ, పొత్తూరి ప్రసాద్, దాసరి నరసింహారావు, కోపూరు బాబు, గాడిపర్తి సురేష్, పల్లెల నాగిరెడ్డి, మాబు, ఆర్య వైశ్య ప్రముఖులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని గాంధీజీ సేవలను స్మరించుకున్నారు.

## 'కృష్ణవేణి'లో క్యాంపస్ డ్రైవ్: 36 మంది ఎంపిక

నరసరావుపేట, జనవరి 30 ప్రభాతవార్త ::స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు మల్టీనేషనల్ కంపెనీ ఫస్ట్ సోర్స్ లిమిటెడ్ నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్ లో 36 మంది విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపికయ్యారు.హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థ ప్రతినిధులు నిర్వహించిన ఈ డ్రైవ్‌లో మొత్తం 226 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ దశల్లో నిర్వహించిన ఇంటర్వ్యూలలో అసాధారణ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 36 మంది విద్యార్థులను కంపెనీ ఎంపిక చేసింది. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ. 2.35 లక్షలు ఉంటుందని, వీరందరూ హైదరాబాద్ లో విధుల్లో చేరతారని కంపెనీ హెచ్.ఆర్ (టీ&బీ) అరుళ్‌వల్లన్ మనోహరన్ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు, నైపుణ్యాలను ఎంపొందించుకోవడం వల్లే విద్యార్థులు ఇటువంటి మల్టీనేషనల్ కంపెనీలలో ఉద్యోగాలుసాధించగలుగుతున్నారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ యోగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం ఆర్ కే సతీష్ బాబు , టిపిఒ బాలకోటేశ్వరరావు అధ్యాపక బృందం మరియు విద్యార్థులు పాల్గొని ఎంపికైన వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.



## హౌసింగ్ కార్యాలయంలో ఘనంగా మహాత్మాగాంధీ వర్ధంతి

మాచర్ల, జనవరి 30 ప్రభాతవార్త: స్థానిక హౌసింగ్ కార్యాలయంలో మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలు ఏఈ మరియదాసు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యం, అహింసలను ఆయుధాలుగా చేసుకుని భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన జాతిపిత గాంధీజీ మహాత్ముడని కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని కుల, మత, వర్గాలకు అతీతంగా ఐక్యతతో జీవించాలన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అలీ, ఎలిసమ్మ, అమర లింగేశ్వరరావు పలువురు పాల్గొన్నారు.



## జగన్ కల్తీ లడ్డూ వ్యవహారం బయటపడింది: మధుబాబు

మాచర్ల, జనవరి 30 ప్రభాతవార్త: తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో జగన్‌రెడ్డి చేసిన మహాపాపం సిట్ దర్యాప్తులో బట్టబయలైందని పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ చిరుమామిళ్ల మధుబాబు అన్నారు. 2019-24 మధ్య రూ.235 కోట్ల విలువైన 60 లక్షల కిలోల కల్తీ నెయ్యితో స్వామివారి ప్రసాదాన్ని అపవిత్రం చేసి, ఇప్పుడు నివేదికలను వక్రీకరించడం సిగ్గు చేటని మండిపడ్డారు. 36 మంది నిందితులతో కూడిన సీబీఐ సిట్ ఛార్జిషీట్ జగన్ పాపాల చిట్టాను స్పష్టం చేస్తుందన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే వైసీపీ కుట్రలను ప్రజల్లోనే ఎండగడతామని మధుబాబు స్పష్టం చేశారు.



## ఘనంగా జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి

గురజాల, జనవరి 30 ప్రభాతవార్త : పట్టణంలో శుక్రవారం జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. గాంధీ బొమ్మ సెంటర్లోని గాంధీజీ కాంస్య విగ్రహానికి ఆర్యవైశ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మాగాంధీ నమ్మిన సిద్ధాంతం సత్యమే జయతే ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. అహింసా మార్గాన్ని వదిలివేయాలని, విద్యార్థులకు గాంధీజీ గొప్పతనాన్ని చాటిచెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల పిచ్చయ్య గుప్త, శ్రీపాతపాటేశ్వరి అమ్మవారి ఆలయ కమిటి చైర్మన్ చీతిరాల సుబ్బారావు, వాణిజ్య విభాగం నేత చిన్ని శ్రీనివాసరావు, తిరుమల ప్రభాకర్‌రావు, అక్కేశ్వరరావు, బాచి, ఆర్యవైశ్య నేత యేచూరి గణేశ్వరరావు, గుండా కిషోర్, అమర్ మణి తదితరులు పాల్గొన్నారు.



## మార్చి 14న జాతీయ లోక్‌అదాలత్

గురజాల, జనవరి 30 ప్రభాతవార్త : స్థానిక కోర్టు ప్రాంగణంలో మార్చి 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పిడుగురాళ్ల జూనియర్ సివిల్ జడ్జి ప్రవల్లిక తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పోలీసు అధికారులతో ఆమె సమావేశమయ్యారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న రాజీపడదగిన సివిల్, క్రిమినల్, మనోవర్తి, బ్యాంకు, చెక్‌బౌన్స్, మోటారు వాహన ప్రమాదం, ముందస్తు వాజ్యములను కక్షిదారులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. రాజీపడదగిన క్రిమినల్ కేసుల పరిష్కారంలో పోలీసు అధికారులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగమణి, పోలీసు అధికారులు సీహెచ్ వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



### అధికారులు అనుసంధానంతో పనిచేయాలి


## భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి: ఎమ్మెల్యే యరపతినేని

గురజాల, జనవరి 30 ప్రభాతవార్త : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా అధికారులు అనుసంధానంతో పనిచేసి ఆలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గంలోని శైవ క్షేత్రాల వద్ద ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లా డుతూ మండలంలోని దైద బిలం వద్ద గల అమర లింగేశ్వరస్వామి ఆలయం వద్ద భద్రతా, పారిశుధ్యం ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. అలాగే నియోజకవర్గంలోని గోగులపాడు, గుత్తికొండ, మోర్జంపాడు, సారంగపల్లి, అగ్రహారం ఆలయాల వద్ద వారం రోజులు ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో మురళీకృష్ణ, డీఎస్పీ జగదీష్, డిఎల్‌డీవో నాయక్, గురజాల సీఐ భాస్కర్, తహసీల్దార్ దుర్గేష్, ఈవో పూర్ణచంద్రరావు, ఎంపీడీవో గౌసియాబేగం, కమిషనర్ శివన్నారాయణ, టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ కన్వీనర్ ఆకుల పిచ్చయ్య గుప్తా, పోటు నాగేశ్వరరావు, అడపా శ్రీనివాసరావు, శరమాల హనుమంతురావు, నేలవెల్లి బొల్లయ్య, చీతిరాల సుబ్బారావు, ఎస్సీ సెల్ నేత రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## చంద్రబాబు, పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలి: 'గోపిరెడ్డి'

నరసరావుపేట, జనవరి30 ప్రభాతవార్త : : తిరుమల లడ్డు ప్రసాదం తయారి నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందనే ఆరోపణలు అబద్ధమని సిబిఐ దర్యాప్తు సంస్థ దాఖలు చేసిన చార్జిషీట్లో నిరూపతమైన దృష్ట్యా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు జగన్మోహన్ రెడ్డికి బహిరంగక్షమాపణ చెప్పాలని వైసీపీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక గుంటూరు రోడ్ లోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో డాక్టర్ గోపిరెడ్డి, వైసీపీ అడ్వకేట్స్ ప్యానల్ సభ్యులు చిట్టా విజయ భాస్కర్ రెడ్డి కలిసి మాట్లాడారు. నిత్యం లక్షలాదిమంది దర్శించుకునే కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదం తయారు చేసే నెయ్యిలో కొవ్వు కలిసిందని చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు. ప్రసాదం తయారు చేసే నెయ్యిలో ఎటువంటి జంతువుల కొవ్వు కలవలేదని సుప్రీంకోర్టు నియమించిన సిబిఐ దర్యాప్తు సంస్థ సుప్రీంకోర్టులో చార్జిషీటు దాఖలు చేసిందని తెలిపారు. ఎటువంటి ప్రాథమిక సమాచారం, దర్యాప్తు చేయకుండా పవిత్ర తిరుమల ప్రసాదంపై సీఎం చంద్రబాబు చేసిన ఆరోపణలు కోట్లాదిమంది హిందువుల మనోభావాలు దెబ్బతీశాయని పేర్కొన్నారు. తిరుమల దేవస్థానానికి నెయ్యి సరఫరా చేసిన బోలె బాబా సంస్థ గతంలో 2018లో తెలుగుదేశం పార్టీ హయాంలోనే తిరుమల తిరుపతి దేవస్థానానికి నెయ్యి సరఫరా చేసిందని తెలిపారు. ఈ సంస్థ నుంచి 2019 ఫిబ్రవరి నెలలోనే టిటిడి 82,000 లీటర్ల నెయ్యి తీసుకోవడం జరిగిందన్నారు. ఈ సంస్థ ప్రస్తుతం పేరు మార్చుకొని శ్రీహర్ష డైరీ పేరుతో కొనసాగుతుందన్నారు. గత టీడీపి హయాంలోనే ఈ సంస్థ ద్వారా నెయ్యి తీసుకున్నారని, మరి ఈ నెయ్యి కల్తీ పాపం ఎవరిదని సీఎం చంద్రబాబుని ప్రశ్నించారు. చిట్టా విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, తిరుపతి లడ్డు ప్రసాదంలో ఎటువంటి జంతువుల కొవ్వు కలవలేదని, ఇందులో ఎటువంటి వాస్తవం లేదని సిబిఐ దర్యాప్తు సంస్థుప్రీంకోర్టుకు నివేదిక సమర్పించిందన్నారు. లడ్డు ప్రసాదంపై ఎటువంటి బహిరంగ విమర్శలు చేసుకోకూడదని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉన్న వాటిని లెక్క చేయకుండా జిల్లాలో అనేక ప్రాంతాల్లో లడ్డు ప్రసాదంపై ఆరోపణలు చేస్తూ టీడీపి నాయకులు ఫ్లెక్సీలు వేశారని ఇది కోర్టు ధిక్కారమని అన్నారు. ఈ వ్యవహారంపై వైసీపీ అధిష్టానం అనుమతి తీసుకొని అన్ని జిల్లా కేంద్రాలలోని పోలీస్ స్టేషన్ లలో కేసులు పెడతామని హెచ్చరించారు. కోర్టును సైతం ఆశ్రయిస్తామన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇద్దరు కలిసి ఆ దేవదేవుడైన వెంకటేశ్వర స్వామిని వీధుల్లోకి లాగారని, ఈ పాపం వారిదే అన్నారు.



## టీడీపి కార్యాలయంలో గ్రీవెన్స్ : అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే

నరసరావుపేట, జనవరి 30 ప్రభా త వార్త : నరసరావుపేటలోని టీడీపి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. నరసరావుపేట నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చి తమ సమస్యలను ఎమ్మెల్యేకి సమర్పించారు. అర్జీలను ఒక్కొక్కటిగా పరిశీలించిన ఎమ్మెల్యే అరవింద బాబు, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.



## మహంకాళి ఆలయ నూతన నిర్మాణానికి భక్తుల విరాళం

రొంపిచర్ల, జనవరి 30 ప్రభాతవార్త:: మండలంలోని ఇస్సాపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ మహంకాళి అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి భక్తులు శుక్రవారం విరాళం అందజేశారు. వివరాలను ఆలయ కార్యనిర్వాణ అధికారి నలబోతు మాధవి దేవి తెలిపారు. నరసరావుపేట పట్టణానికి చెందిన ఎక్కల వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు భార్య సుజాత కుమారుడు అనిల్ కుమార్ మోనిక, చిన్న కుమారుడు శ్రీకాంత్ ఈశ్వరీలు 1,00,116 రూపాయలను అందించారు. ఈ మొత్తం చెక్కు రూపంలో అందించడం జరిగిందని తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు కపలవాయి విజయకుమార్ మాట్లాడుతూ వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు అమ్మవారి ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావటం సంతోషంగా ఉందన్నారు. ఇటువంటి కార్యక్రమాలకు ముందుకు వచ్చిన వారిని అభినందించారు. ఆలయ ఈవో నలబోతు మాధవి దేవి మాట్లాడుతూ దాతలు అందించే విరాళాలకు ప్రభుత్వం ఆదాయ పన్ను మినహాయింపు అందిస్తుందని తెలియజేశారు.



## పేదలకు దుప్పట్లు అందజేత

నరసరావుపేట టౌన్ జనవరి 30 ప్రభాత వార్త ::పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయ వాది శ్రీగిరిరాజు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం పేదలకు నూతన దుప్పట్లను పంపిణీ చేశారు. సత్తెనపల్లి రోడ్ లోని బీసీ కాలనీలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పాత్రికేయులు ఆరూరి రమేష్ అధ్యక్షత వహించారు. కాలనీకి చెందిన వృద్ధులు, వికలాంగులు కు దుప్పట్లను వారు అందజేశారు. కార్యక్రమంలో సుమారు 150 మంది మహిళలు, నిరుపేదలకు దుప్పట్లను పంపించే పంపిణీ చేయడం సంతోషంగా దాతలు శ్రీ గిరిరాజు నాగేశ్వరరావు తెలిపారు. పట్నంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోనూ నూతన దుప్పట్లను అందజేశామని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ తమ సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని, తమకు సహకారం అందిస్తున్న వారికి శ్రీ గిరిరాజు నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు. కాలనీ పెద్దలు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.డీలర్ వెంకటరత్నం, బాషా, కాలనీవాసులు,స్థానికులు పాల్గొన్నారు.



## ఆర్టీసీ డిపో ఆవరణలో 37వ జాతీయ రహదారి భద్రతా మహోత్సవాలు

నరసరావుపేట క్రైమ్,జనవరి 30 ప్రభాతవార్త:: నరసరావుపేట ఆర్టీసీ డిపో గ్యారేజీ ఆవరణలో శుక్రవారం 37వ జాతీయ రహదారి భద్రతా మహోత్సవాలు జరిగాయి. కార్యక్రమానికి డిపో మేనేజర్ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా రవాణా శాఖ అధికారి సంజీవ్ కుమార్, ఆర్టీవో నాగేశ్వరరావు,ట్రాఫిక్ ఎస్ఐ వేణు,రాజశేఖర్, ఆర్టీసీ అధికారులు అజిత కుమారి, ఎం వి ఐ లు ఎన్.శివ నాగేశ్వరరావు,పి పవన్ కుమార్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మనీషా లు పాల్గొని మాట్లాడారు. రోడ్డు భద్రత తో పాటు నూతనంగా వచ్చిన చట్టాలపై వివరాలను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ కచ్చితంగా భద్రత నియమాలను పాటించాలన్నారు. ఆర్టీసీ డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులు నడపాలన్నారు. తమ కుటుంబంతో పాటు ప్రయాణికుల కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని డ్రైవింగ్ చేయాలన్నారు. తప్పనిసరిగా డ్రైవర్లు ఆరోగ్యానికి సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు భద్రతకు సంబంధించి సూచనలను కచ్చితంగా గమనించాలన్నారు. డ్రైవింగ్ లో నిరక్ష్యం వల్ల విలువైన ప్రాణాలను పోగొట్టుకునే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉత్తమ డ్రైవర్లకు ప్రశంసా పత్రాలను అధికారులు పంపిణీ చేశారు.



## కార్మిక హక్కుల సాధనకు సిఐటియు దశల వారీగా పోరాటం

నరసరావుపేట టౌన్,జనవరి 30 ప్రభాతవార్త : కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సిఐటియు ఆధ్వర్యంలో దశల వారీగా పోరాటం చేయనున్నట్లు ఏపి మున్సిపల్ యూనియన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్. సిలార్ మసూద్ హెచ్చరించారు. వచ్చే నెల 12న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ కు సార్వత్రిక సమ్మె వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిలార్ మసూద్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం రాక ముందే కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి వాటి స్థానంలో 4 లేబర్ కోడ్ల వల్ల వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులు ఆయా పరిశ్రమల యజమానులకు బానిసలుగా మారబోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంలో ప్రభుత్వాలకు ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని అంగన్వాడీ, ఆశావర్కర్లకు ఇతర కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఫిబ్రవరి 12 న జరిగే సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్మిక చట్టాలు రద్దయితే కార్మికులు సమస్యలపై ప్రశ్నించే పరిస్థితి ఉండదని, కార్మికుల పరిస్థితి గాల్లో దీపంలా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల, ఉద్యోగుల శ్రమ శక్తిని కారుచౌకగా కార్పొరేట్లకు బడా పెట్టుబడిదారులకు కట్టబెట్టడానికి మోడీ ప్రభుత్వం దుర్మార్గ లేబర్ కోడ్ రద్దు చేసే వరకు పోరాటం సాగిస్తామన్నారు. అవసరమైతే దేశ వ్యాప్తంగా నిరవధిక సమ్మెకు పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అల్లాబక్షు, సోమశేఖర్, పి రాజు, కిరణ్ కుమార్, గౌస్, మాలిక్, కోటేశ్వరావు, శాంతయ్య, గూడ సామ్రాజ్యం, వెంకట్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు రావిపాడులో ఉచిత వైద్య శిబిరం

నకరికల్లు,జనవరి 30 ప్రభాతవార్త:: నరసరావుపేట మండలం లోని రావిపాడు గ్రామంలో సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రాగణంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ప్రముఖ కిడ్నీ వ్యాధుల నిపుణులు డాక్టర్ నల్లమోతు ప్రవీణ్ (సీనియర్ నెఫ్రాలజిస్ట్, ఏలూరు ఆయుష్ హాస్పిటల్ ) శుక్రవారం తెలిపారు. శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు నరసరావుపేట మహాత్మాగాంధీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ చీఫ్ న్యూరాలజిస్ట్ డాక్టర్ మెడబలిమి సౌమ్య పాల్గొని నరాల సంబదిత వ్యాధులకు సేవలు అందిస్తారని తెలిపారు. కిడ్నీ, నరాల సంబంధిత వ్యాధులతో పాటు సాధారణ వ్యాధులైన జలుబు, దగ్గు, బీపీ, షుగర్, జ్వరం వంటి వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి ముందులు పంపిణి చేస్తామన్నారు.

## వెంకటేశ్వరునికి వైకాపా క్షమాపణ చెప్పాలి : నల్లపాటి



నరసరావుపేట టౌన్,జనవరి 30 ప్రభాతవార్త : వైయస్సార్సీపి ప్రభుత్వం వెంకటేశ్వర స్వామికి అపచారం చేసిందని వారు తక్షణమే క్షమాపణలు చెప్పాలని జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లు ప్రజలతో కాకుండా ప్రసిద్ధ తిరుమల వెంకటేశ్వర స్వామి కూడా మోసం చేయాలని చూశారని విమర్శించారు. వెంకటేశ్వర స్వామి వారి లడ్డు ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వాడారని తేటతెల్లమైందన్నారు. బహుశా ప్రపంచం మొత్తంలో ఎక్కడా కూడా దేవుడికి ఇలాంటి మహా అపచారం చేసిన ప్రభుత్వం ఎక్కడా కనిపించదు అన్నారు. సహజంగా ఎంతో భక్తిశ్రద్ధలతో దేవుడికి ప్రసాదం పెడతాము అందులో కూడా కల్తీ చేశారంటే ఎంత పాపం మూట కట్టుకుంటారో చూడాలన్నారు. ఇంత అక్రమములు చోటు చేసుకున్నప్పటికీ ఆనాటి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం కానీ ఆయన నియమించిన చైర్మన్ కాని పట్టించుకోలేదు, కల్తీ ని యదేచ్ఛగా కొనసాగించారు. గౌరవ సుప్రీంకోర్టు నియమించిన సిట్ సంస్థ లడ్డు ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వినియోగించిన విషయాన్ని దర్యాప్తు చేసి బయటపెట్టారు. 2019 24 మధ్యకాలంలో శ్రీ వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదానికి కల్తీ నెయ్యి సరఫరా చేశారని స్పష్టమైంది. సీట్ దాదాపు 15, 16 నెలల పాటు దర్యాప్తు చేపట్టి సినిమా మొత్తం మల్ల చూపించింది. ఏమిటంటే ఇది పామాయిల్లో వాడే కెమికల్ వినియోగించారని బయటపడింది. తేటతెల్లమైంది. ఇప్పటికైనా కలియుగ దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి క్షమాపణలు చెప్పి చేసిన తప్పును ఒప్పుకోని వైయస్సార్సీపీ పార్టీ, ఆనాటి టీటీడీ చైర్మన్ లను డిమాండ్ చేస్తున్నామని జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లపాటి శివ రామచంద్ర ప్రసాద్ అన్నారు.

## చెంపలేసుకుని... చేసిన పాపాన్ని అంగీకరించకుండా....
## నిస్సిగ్గుగా సిఎం, డిప్యూటీ సిఎంలపై విమర్శలా? : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జనవరి 30, ప్రభాతవార్త: కల్తీనెయ్యి మహాపాపానికి ఒడిగట్టింది చాలక, నిస్సిగ్గుగా సొంతమీడియా.. వైసీపీనేతలతో జగన్ హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా దుష్ప్రచారానికి తెగబడ్డాడని, తన పాపాన్ని కప్పిపుచ్చుకునేందుకు విచారణాసంస్థలు, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిపై నిందలేస్తూ విషప్రచారం చేయిస్తున్నాడని మాజీమంత్రి, శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం తెలుగు మహిళల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆలయ సంప్రోక్షణ, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రత్తిపాటి.. దేవాలయ శుద్ధి అనంతరం విలేకరులతో మాట్లాడారు. తర్వాత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించు కొని ఆర్యవైశ్య నాయకులు, కూటమినేతలతో బాపూజీ చిత్రపటానికి ప్రత్తిపాటి నివాళులు అర్పించారు. కల్తీనెయ్యి మహాపాపం నుంచి తప్పించుకునే వైసీపీ ప్రయత్నాలు.. ఆ పార్టీ క్రిమినల్ రాజకీయాల్లో భాగం పరమ పవిత్రమైన కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వేంకటేశ్వరస్వామితో పెట్టుకున్న వారికి ఎప్పటికీ భవిష్యత్ ఉండదని, అందుకు ప్రత్యక్ష నిదర్శనాలు ఎన్నోఉన్నాయని ప్రత్తిపాటి చెప్పారు. కల్తీనెయ్యి మహాపాపాన్ని ఇతరులపైకి నెట్టే ప్రయత్నం చేయడం వైసీపీ క్రిమినల్ రాజకీయాల్లో భాగమేనన్నారు. సిట్ స్పష్టంగా హానికారక రసాయనాలు, ఇతర విషపూరిత కెమికల్స్ తో తిరుమల లడ్డూలు తయారుచేశారని ఆధారాలతో సహా స్పష్టంగా సుప్రీంకోర్టు కు సమర్పించిన నివేదికపై వైసీపీ వక్రభాష్యాలు చెబుతోందని ప్రత్తిపాటి అసహనం వ్యక్తం చేశారు. పాలు లేని నెయ్యి.. అభివృద్ధి రహిత రాష్ట్రం.. మోసకారీ సంక్షేమం... హానికారక మద్యం..ఇవే జగన్ ఐదేళ్ల పాలనా ఘనతలన్నారు. తప్పు ఒప్పుకొని లెంపలేసుకోకుండా.. కూటమిపై ఎదురుదాడి చేస్తున్నారు చేసిన తప్పు ఒప్పుకొని లెంపలేసుకోకుండా.. కూటమిప్రభుత్వంపై ఎదురుదాడి చేస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రిని లక్ష్యంగా చేసుకొని జగన్ విషప్రచారం చేయిస్తున్నాడని ప్రత్తిపాటి తెలిపారు. కల్తీనెయ్యి వినియోగించారని సిట్ విచారణలో తేలినా కూడా వైసీపీ నేతలు తామే పాపం ఎరుగమన్నట్టు నీతివాక్యాలుమాట్లాడటం సిగ్గుచేటన్నారు. టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు మురకొండ మల్లిబాబు, కనమర్లపూడి రమేష్, కొత్త కోటేశ్వరరావు, డాక్టర్ సురేష్, మున్సిపల్ కౌన్సిలర్లు, తెలుగు మహిళా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





## నాణ్యత తగ్గకుండా సకాలంలో రోడ్లు, డ్రైన్ల నిర్మాణం పూర్తయ్యేలా చూడండి : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జనవరి 30, ప్రభాత వార్త: పట్టణంలోని 25 వ వార్డులో నిర్మించతలపెట్టిన సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి ప్రత్తిపాటి స్థానిక కూటమినాయకులతో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 20లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రోడ్లు, డ్రెయిన్లు రోజుల వ్యవధిలోనే పూర్తికావాలని, దగ్గరుండి పనులు పర్యవేక్షించాలని ప్రత్తిపాటి మున్సిపల్ అధికారుల్ని ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలు తగ్గకుండా సకాలంలో రోడ్లు, డ్రెయిన్లు పూర్తిచేస్తేనే గుత్తేదారుకు బిల్లులు చెల్లించాలని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి, డి.ఈ అబ్దుల్ రహీమ్, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రైతులకు న్యాయం చేయడంలో ఇంత తాత్సారమా? : ప్రత్తిపాటి
### 167ఎ జాతీయ రహదారి నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు ఎప్పటికి న్యాయం చేస్తారు.

చిలకలూరిపేట, జనవరి 30, ప్రభాతవార్త: 167 ఏ జాతీయ రహదారి నిర్మాణం, విస్తరణ కోసం పొలాలు, భూములు, స్థలాలు ఇచ్చిన బొప్పుడి రైతులకు ఎప్పటికీ న్యాయం చేస్తారని, రైతులకు న్యాయం చేయడంలో జరిగే తాత్సారం, ప్రభుత్వానికి వ్యవస్థలకు చెడ్డపేరు తెస్తుందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో కూటమినాయకులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (ప్రజాదర్బార్ ) నిర్వహించారు. ఈ సందర్భంగా బొప్పూడి గ్రామస్తులు ప్రత్తిపాటిని కలిసి తమకు అందాల్సిన పరిహారం త్వరగా అందేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. సమస్య తీవ్రతను గ్రహించి.. వీలైనంత త్వరగా పరిష్కరించండి : జేసీ, ఆర్డీవో, తహసీల్దార్, ఎన్.హెచ్.ఏ.ఐ ఈఈలకు ప్రత్తిపాటి ఆదేశం సమస్యపై స్పందించిన ప్రత్తిపాటి గ్రామస్తుల సమక్షంలోనే జిల్లా కలెక్టర్ (శ్రీమతి కృతికా శుక్లా) కు ఫోన్ చేసి మాట్లాడారు. ఎన్.హెచ్.ఏ.ఐకి భూములిచ్చిన రైతుల పరిహారం అంశం జాయింట్ కలెక్టర్, స్థానిక ఆర్డీవోలు పరిశీలిస్తున్నారని, వారితో మాట్లాడి వీలైనంత త్వరగా రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని ప్రత్తిపాటికి చెప్పారు. కలెక్టర్ చెప్పింది విన్న ప్రత్తిపాటి.. వెంటనే జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, చిలకలూరిపేట తహసీల్దార్, ఎన్.హెచ్.ఏ.ఐ ఈఈ శ్రీనివాసరావులతో వరుసగా ఫోన్లో మాట్లాడారు. సమస్య తీవ్రతను గ్రహించాలని, ఇదివరకు ఎన్నోసార్లు చెప్పడం జరిగిందని, ఇంతకాలం ఆలస్యం చేసే రైతు సమస్య ఎప్పటికి పరిష్కారం అవుతుందని ప్రత్తిపాటి అసహనం వ్యక్తంచేశారు. కొత్తగా వచ్చిన కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి మాట్లాడి వీలైనంత త్వరగా సమస్య పరిష్కరించి ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూస్తానని జేసీ ఎమ్మెల్యే ప్రత్తిపాటికి హామీ ఇచ్చారు. అనంతరం ప్రత్తిపాటి .. కలెక్టర్..జేసీలతో మరోసారి మాట్లాడతానని, అధైర్యపడవద్దని బొప్పూడి గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, వివిధ హోదాలలో ఉన్న కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (గార్డ్స్) ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతి

చిలకలూరిపేట, జనవరి 30, ప్రభాతవార్త: స్థానిక జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (గార్డ్స్) ఆధ్వర్యంలో శుక్రవారం ఆ సంస్థ కార్యాలయంలో మహాత్మగాంధీ 77వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ప్రముఖ సాహితీ విమర్శకులు డా.పి.వి సుబ్బారావు పాల్గొని స్వతంత్ర సంగ్రామంలో గాంధీ పోరాటం గురించి వివరించారు. తొలుత మహాత్ముని చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జనవిజ్ఞానవేదిక రాష్ట్ర ప్రచురణల విభాగం కన్వీనర్ డా.దార్ల బుజ్జిబాబు , సంస్థ ఉపాధ్యక్షులు గేరా యాకోబు, మాజీ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ దాసరి విల్సన్ బాబు, షేక్ లాలా దాదాసాహెబ్ సేవాసంస్థ అధ్యక్షులు సిద్ధాంతి కరిముల్లా, సంస్థ సభ్యులు జెర్రిపోతుల బుల్లిబాబు, బెజ్జం రవి, డి. మనోజ్, వద్దాన సతీష్ చంద్రం, తదితరులు పాల్గొన్నారు.



## వేద విద్యార్థులకు నూతన వస్త్రాల బహూకరణ

సత్తెనపల్లి, జనవరి 30, ప్రభాతవార్త: పట్టణంలో ని శ్రీ విరూపాక్షపీఠ స్వరూపానంద గురూజీ స్మార్త వేద పాఠశాల విద్యార్థులకు వ్యాపారవేత్త ఆత్మకూరి వెంకట వీర సీతారామాంజనేయులు శుక్రవారం నూతన వస్త్రాలను అందజేశారు. పాఠశాల ప్రధానఆచార్యులు వానపాముల నాగ కృష్ణమాచార్యులు, ప్రముఖ వ్యాపారవేత్త చల్లా రత్తయ్య, సాయి బాబా గుడి అర్చకులు కంది రామ బ్రహ్మ చారి ఆత్మ ట్రస్ట్ భాద్యులు చింతాడ సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.




## సత్తెనపల్లిలో ఘనంగా మహాత్మాగాంధీ వర్ధంతి

సత్తెనపల్లి, జనవరి 30, ప్రభాతవార్త: పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలుజాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా సత్తెనపల్లి పట్టణములోని గాంధీచౌక్ దగ్గర గల గాంధీ విగ్రహానికి సత్తెనపల్లి పట్టణ ఆర్య వైశ్య యువజన సంగం అధ్యక్షులు చిల్లం ఛత్ర కళ్యాణ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సత్తెనపల్లి పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.




## రోడ్డుప్రమాదంలో బిఫార్మసీ విద్యార్థి మృతి



సత్తెనపల్లి, జనవరి 30, ప్రభాతవార్త: సత్తెనపల్లి మండలం కంటెపూడి వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్ అదుపు తప్పి కిందపడి భరణి అనే బీఫార్మసీ విద్యార్థి మృతి చెందాడు. భరణి కంటెపూడిలోని నలంద బీఫార్మసీ కాలేజీలో సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు వివరాలు తెలియాల్సి వుంది .

# పల్నాడు జిల్లా వార్త



## ఐకమత్యంగా ఉండి నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలబెడదాం: ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, జనవరి 30, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం రఘురామ్ నగర్ ప్రజావేదికలో కూటమి నాయకులతో విస్తృతస్థాయి సమావేశ కార్యక్రమంలో శాసన సభ్యులు కన్నా లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఐకమత్యంగా పనిచేసి నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలబెడదామని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థాగత ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. అమరావతి రాజధాని రావటంతో మన భూముల విలువలు పెరిగాయని, గత ప్రభుత్వంలో రాజధాని ఎక్కడ అంటే పేరు చెప్పే పరిస్థితి కూడా లేదన్నారు. దేశంలో ఎక్కడా లేనటువంటి సంక్షేమ పథకాలు కూటమి ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ప్రజలకు కూటమి ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతోందని, తల్లికి వందనం కింద ఒక కుటుంబంలో పిల్లలు ఎంతమంది ఉన్నా 15 వేల రూపాయలు చొప్పున అందజేయటం జరిగిందన్నారు. జగన్ హయాంలో రాక్షస అరాచక పాలన సాగిందని, గత ఎన్నికల్లో ప్రజలు జగన్ కి బుద్ధి చెప్పినా సిగ్గు రాలేదన్నారు. కూటమి ప్రభుత్వం చేసే అభివృద్ధి చూసి ఓర్వలేక జగన్ విషప్రచారాలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల గ్రామ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు .



## లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి చెక్కుల అందజేత



సత్తెనపల్లి, జనవరి 30, ప్రభాతవార్త: బాధితులకు అండగా సీఎం సహాయనిధి నిలుస్తోందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. కార్పొరేట్ స్థాయిలో వైద్యం పొందలేని బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిది అండగా నిలుస్తోందని అన్నారు. శుక్రవారం సత్తెనపల్లి పట్టణం రఘురామ్ నగర్ ప్రజావేదిక వద్ద సత్తెనపల్లి నియోజకవర్గంలోని ముఖ్యమంత్రి సహాయ నిధికి చెందిన 26మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.17,01,445 విలువైన చెక్కులను సత్తెనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అందజేశారు.

## ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం: ఎమ్మెల్యే 'కన్నా'

సత్తెనపల్లి, జనవరి 30, ప్రభాతవార్త: సత్తెనపల్లి కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాలు అందించారు. ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను ఎమ్మెల్యే కన్నా స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. ప్రజలు. నా దృష్టికి కొన్ని సమస్యలు. గృహ,పెన్షన్, వైద్యం,పలు సమస్యలు తీసుకొచ్చారు. సమస్యల తక్షణ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అందరి సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కన్నా హామీనిచ్చారు.



## మహాత్మాగాంధీకి ఘననివాళి



సత్తెనపల్లి, జనవరి 30, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం రఘురామ్ నగర్ కార్యాలయం నందు జాతిపిత మహాత్మా గాంధీవర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఘనంగా నివాళులర్పించారు. వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## సత్తెనపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎస్టీయు ధర్నా

సత్తెనపల్లి, జనవరి 30, ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇరవై నెలలు గడిచినప్పటికీ రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఇప్పటికీ అమలుపరచలేదని నిరసన వ్యక్తం చేస్తూ ఎస్టీయూ సత్తెనపల్లి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎమ్మార్వో కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. వెంటనే పీఆర్సీ కమిషన్ నియమించాలని నినాదాలు చేశారు.తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ చక్రవర్తి అందచేశారు. రాష్ట్ర కౌన్సిలర్ సుభాని, సత్తెనపల్లి మండల అధ్యక్షులు పాగళ్ల వెంకయ్య, ఆర్థిక కార్యదర్శి .బ్రహ్మేంద్ర నాయక్, గౌరవ అధ్యక్షులు ఎం. అప్పారావు, జిల్లా ఉపాధ్యక్షులు కటారి సురేష్ బాబు, తురకా రాజు, జిల్లా కార్యదర్శి నాగరాజు, పల్నాడు జిల్లా కన్వీనర్ జెల్ది విజయప్రసాద్, సోషల్ మీడియా కన్వీనర్ జానపాటి వెంకటేశ్వరరావు,జిల్లా నాయకులు తూమాటి శరత్ కుమార్,మండల శీగిగే మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు హిమబిందు, జయలక్ష్మి, మాధవి ,.ఫరున్నీసా, మండల నాయకులు నరేంద్ర, .శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు



## బాలికల పరిరక్షణ కోసం న్యాయవ్యవస్థలో పటిష్టమైన చట్టాలు



సత్తెనపల్లి, జనవరి 30, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలోని రఘురాం నగర్ లో ఉన్న ప్రభుత్వ బి. సి బాలికల వసతి గృహంలో శుక్రవారం సాయంత్రం రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు, సత్తెనపల్లి మండల న్యాయసేవధికార కమిటీ చైర్మన్ మరియు సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్ ) వి. విజయ్ కుమార్ రెడ్డి సూచనలమేరకు ఈ నెల 24 వతేది జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా అన్ని ప్రాంతాల్లో ఉన్న బాలికల కోసం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు దివ్వెల శ్రీనివాసరావు, బి. ఎల్. కోటేశ్వరరావు పారా లీగల్ వాలంటీర్ షేక్ సుభాని వార్డెన్ ఇందిరా గాంధీ తదితరులు పాల్గొన్నారు.


## ఋషీంద్రుల ఆరాధన మహోత్సవాలు




సత్తెనపల్లి, జనవరి 30, ప్రభాతవార్త: చత్రపతి కళాపరిషత్ సత్తెనపల్లి ఆధ్వర్యంలో ఫిరో జి ఋషి ఇంద్రుల ఆరాధన బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్ర స్థాయిలో డాన్స్ బేబీ డాన్స్ పోటీలు మరియు కూచిపూడి నృత్య పోటీలు పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోజరిపారు. ఈ పోటీల్లో 30 మంది కళాకారులు పాల్గొన్నారు వీరిలో విజేతగా నిలిచిన ప్రథమ బహుమతి తులసి సత్తెనపల్లి, ద్వితీయ బహుమతి చరిష్మా సత్తెనపల్లి ,తృతీయ బహుమతి రితిక సత్తెనపల్లి, కాన్సిలేషన్ బహుమతులు నిత్య ఐక్య రెడ్డి గాయత్రి జూనియర్స్ ఈ భాగంలో ప్రథమ బహుమతి ఏ నికిత ద్వితీయ బహుమతి తృతీయ మధ్య నాగమణి కైవసం చేసుకున్నారు చత్రపతి కళాపరిషత్ కమిటీ సభ్యులు పులహరి బానోజీ ఫిరోజి అశోక తేజ అమర్ నాగ బ్రహ్మచారి ఆకివీడు కోటేశ్వరరావు, కొరియోగ్రాఫర్ సుభాని శివాజీ ఈ బహుమతి ప్రధానోత్సవం లో పాల్గొన్నారు.

## సుప్రీం లోకల్ ట్రైనింగ్ కేంద్రాన్ని సందర్శించిన అధికారులు

సత్తెనపల్లి, జనవరి 30, ప్రభాతవార్త: శుక్రవారం తమిళనాడుకు చెందిన రూరల్ డెవలప్మెంట్ మరియు పంచాయతీరాజ్ శాఖకు చెందిన చెందిన ఆరుగురు జిల్లా పంచాయతీ అధికారులు, పలువురు బ్లాక్ డెవలప్మెంట్ ఆఫీసర్లు, మరియు డిప్యూటీ బ్లాక్ డెవలప్మెంట్ ఆఫీసర్లు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీలు నందిగామలోని సుప్రీం లోకల్ ట్రైనింగ్ సెంటర్ ను సందర్శించారు.నందిగామ సుప్రీం ఎల్టిసిని సందర్శించారు. తమిళనాడుకు చెందిన ఈ అధికారులకు సత్తెనపల్లి ఇన్చార్జి ఎంపీడీవో టి శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో సుధారాణి, నందిగామ పంచాయతీ కార్యదర్శులు కుంభ వెంకటేశ్వర్లు, చిలువూరి కృష్ణ ప్రసాద్, భట్లూరు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఫణిదం పంచాయతీ కార్యదర్శి షేక్ అజీజుర్ రెహమాన్, బృగుబండ పంచాయతీ కార్యదర్శి కాసిమాల రాజేష్ లు స్థానిక చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో జరుగుతున్న అన్ని కార్యక్రమాల గురించి క్షుణ్ణంగా వివరించడం జరిగింది. అసిస్టు ట్రైనర్ చెంబేటి బోల్లయ్య కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## అచ్చంపేటలో ముస్లిం శ్మశానవాటిక ఆక్రమణపై ఆందోళన - తక్షణ చర్యలకు వినతి



అచ్చంపేట, జనవరి 30 ప్రభాతవార్త: అచ్చంపేట మండల కేంద్రంలో ఉన్న ముస్లిం శ్మశానవాటిక భూమి ఆక్రమణకు గురైందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ గ్రామ ముస్లిం సమాజ ప్రతినిధులు మండల తహసీల్దార్ చింకా శ్రీనివాసరావు గారికి వినతి పత్రం సమర్పించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఆర్ అండ్ బీ రోడ్డుకు ఆనుకుని ఉన్న ఈ స్థలం శతాబ్దాల చరిత్ర కలిగిన సమాధి ప్రదేశమని పేర్కొన్నారు. తక్షణ విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ను కోరారు. మౌలానా ఖలీద్, మోలానా మాభూ, కమల్ సైదా, వజీర్ తదితర ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

## ఉద్యోగుల, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి : ఎస్టీయు డిమాండ్

చిలకలూరిపేట, జనవరి 30, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఇచ్చిన హామీలను ఇప్పటికైనా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, రాష్ట్రోపాధ్యాయ సంఘం చిలకలూరిపేట ఆధ్వర్యంలో చిలకలూరిపేట మండల తహసీల్దార్ షేక్ హుస్సేన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎస్ టి యు రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కే కోటేశ్వరరావు రాష్ట్ర డైరీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఐక్య పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు ఫిబ్రవరి 25వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎస్ టి యు పల్నాడు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు బొంత రవి, జిల్లా ఫైనాన్స్ కమిటీ మెంబర్ షేక్ జమీర్ భాష చిలకలూరిపేట పట్టణ అధ్యక్షులు మేకల కోటేశ్వరరావు ప్రధాన కార్యదర్శి వడ్లన జయప్రకాష్, మహిళా కన్వీనర్ కోట వేదమణి, చిలకలూరిపేట మండల అధ్యక్షులు షేక్ మస్తాన్వలి ప్రధాన కార్యదర్శి వడితే రమణ నాయక్. గోపాలకృష్ణ,నాగేశ్వరరావు, కె ఏడుకొండలు అట్లూరి శ్రీనివాసరావు సోమలా నాయక్ షేక్ కాలేషా షేక్,ఫారిసా. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు




## జాతిపితను అవమానించడమేనా బిజెపి దేశభక్తి?

యడ్లపాడు, జనవరి 30, ప్రభాతవార్త : ప్రపంచంలోని ప్రతి దేశం,ఆ దేశ పౌరులు జాతి పితను, జాతీయ జెండాను, జాతీయ గీతాన్ని గౌరవించి ఆదరించడం సాంప్రదాయ బద్ధంగా జరుగుతుంటే దేశభక్తికి ప్రతీక అయిన మన దేశంలో మాత్రం జాతిపితను అవమానించే రీతిలో భాజపా పాలకులు వ్యవహరించడం జాతికే అవమానమని చిలకలూరిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎం రాధాకృష్ణ అన్నారు. గ్రామీణ ప్రాంత వ్యవసాయ కూలీలు సన్నకారు, చిన్న కారు రైతులను కష్టాల నుండి గట్టెక్కించాలనే ఉద్దేశంతో సోనియా గాంధీ ఆలోచనాత్మకంగా రూపొందించి అమలుపరచిన మహత్తర పథకమే మహాత్మా గాంధీజీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకమని ఈ పథకాన్ని బాధ్యతగా భావించవలసిన కేంద్ర ప్రభుత్వం బరువుగా భావించి రాష్ట్ర ప్రభుత్వాల మీద భారం మోపుతూ గ్రామపంచాయతీల ప్రాధాన్యతను తగ్గిస్తూ ఎటువంటి గ్రామపంచాయతీ తీర్మానం లేకుండానే ఏ గ్రామంలో ఏ పని చేయాలి అనేది ఢిల్లీ పెద్దలు నిర్ణయించే విధంగా మార్పులు తీసుకు రావడం దుర్మార్గమని అన్నారు. ఎడ్లపాడు మండలంలోని ఎడ్లపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ కారుచోల హేమకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఎలాంటి మార్పులు తీసుకురావద్దని జాతిపిత పేరు మార్చవద్దని కోరారు. ప్రధాని నరేంద్ర మోడీ తీసుకువచ్చిన సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. యడ్లపాడు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సాగి నరసింహారావు జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సాగి మల్లికార్జునరావు షేక్ బాజీ రెడ్డెం నర్సి రెడ్డి జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి నాగేశ్వరరావు యల్లమంద చిదంబరం యువజన కాంగ్రెస్ నాయకులు ఇంటూరి భవాని వెంకటేష్, కారుచోల స్వప్న కుమార్ గోవిందు ప్రభాకర్ జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



## బోయపాలెంలో టీడీపీ, వైకాపా మధ్య వాగ్వాదం



యడ్లపాడు, జనవరి 30, ప్రభాతవార్త : మండల పరిధిలోని బోయపాలెం గ్రామం వద్ద తెలుగు దేశం పార్టీ నాయకులు, వైఎస్ సీపీ నాయకుల మధ్య వాగ్వాధం, తోపులాట సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసు కుంది. సంఘటనకు సంబంధించి స్దానికులు తెలుపుతున్న వివరాల ప్రకారం వైఎస్ఆర్ సీపీ నాయకులు రాలు మాజీ మంత్రి విడదల రజని గ్రామ సమీపంలోని శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి దేవస్దానంలో తిరుమలలో లడ్డూ అంశంపై జరిగిన విషప్రచారాన్ని నిరసిస్తూ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్దానిక టీడీపి నాయకులు విషయం తెల్సుకొని దేవాలయం వద్దకు వచ్చి రజని గోబ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ వాగ్వాదానికి దిగటంతో ఇరువర్గాల మధ్య తోపులాట సంఘటన చోటు చేసుకొంది. వెంటనే పోలీసులు అప్రమత్తతై దేవాలయం వద్ద జరుగుతున్న ఘర్షణ పడుతున్నవారిని అడ్డగించి రజనిని కారులో పంపించి వేయటంతో గొడవ సద్దుమణిగింది.

## భూసారం పై రైతులకు అవగాహన



యడ్లపాడు, జనవరి 30, ప్రభాతవార్త : మండల పరిధిలోని లింగారావుపాలెం గ్రామంలో పాల కేంద్రం నందు రైతులకు భూమి ఆరోగ్యం మరియు భూసారం పై రైతులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి యం అరుణ మాట్లాడుతూ సేంద్రీయ పద్ధతిలో భూసారాన్ని పెంపొందించుకోవ్వాలటే పచ్చి రొట్ట పైర్లు, పంట అవశేషాలను కాల్చి వెయ్యకుండా కుళ్ళ బెట్టుకోవాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి ఏ హరిప్రసాద్ మట్టి నమూన తీసే పద్ధతిని, రబీ పంట నమోదు తదితర అంశాలపై అవగాహన కల్పించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిక్షణ కేంద్రం విస్తరణ అధికారి కరీమున్, గ్రామ వ్యవసాయ సహాయకులు గోపి, ఎంపీటీసీ సభ్యులు వీర రాఘవయ్య, రైతులు పాల్గొన్నారు.

## బాసట వేదిక ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్ టెస్ట్

యడ్లపాడు, జనవరి 30, ప్రభాతవార్త : బాసట సామాజిక-సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో గురువారం న స్కాలర్‌షిప్ టెస్ట్ (లెవెల్-2) యడ్లపాడు గ్రామం, పోపూరి రామారావు విజ్ఞాన కేంద్రములో విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖాధికారి నాగరత్నం ప్రారంభించారు. ఎంఈఓ నాగరత్నం మాట్లాడుతూ ఇలాంటి స్కాలర్‌షిప్ పరీక్షల ద్వారా విద్యార్థుల మేధాశక్తి పెరుగుతుందని, పోటీతత్వం పెంపొందుతుందని, అన్నారు. బాసట అధ్యక్షులు నూతలపాటి కాళిదాసు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో బాసట కోశాధికారి కె. రాంబ్రహ్మం, విద్యా కమిటీ కన్వీనర్లు కల్లూరి వాసు, చెరుకూరి సృజన, శేషయ్య, పాఠశాల ప్రధానో పాధ్యాయులు,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




## కొండవీటి ఉత్సవాల ఏర్పాట్లపై ఎస్పీ క్షేత్రస్థాయి పరిశీలన

యడ్లపాడు, జనవరి 30, ప్రభాతవార్త : మండల పరిధిలోని కొండవీడు కోట ఉత్సవాలను ఫిబ్రవరి 7,8తేదీలలో నిర్వహించ తలపెట్టిన సందర్భంగా ఉత్సవాలకు సంబంధించి బందోబస్తు ఏర్పట్లపై శుక్రవారం కొండవీడు కోటను జిల్లా ఎస్పీ బి కృష్ణా రావు సందర్శించారు. ఈ సందర్శన సందర్భంగా ఎస్పీ కొండవీడు కోట పరిధిలోని వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, చారిత్రక కట్టడాలు, చెరువులు, హెలిప్యాడ్, ప్రజల రాకపోకలకు ఉపయోగించే మార్గాలు తదితర అన్ని కీలక ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఉత్సవాల సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు, సందర్శకులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతతో పాటు శాంతి భద్రతలు పటిష్టంగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్ సిఐ సుబ్బనాయుడుకు, స్దానిక ఎస్సై టి శివరామకృష్ణకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉత్సవాల సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సమర్ధవంతమైన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, ఉత్సవాల నిర్వహణలో పాల్గొనే ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు పటిష్టంగా ఏర్పాటు చేయాలని ఎస్పీ అధికారులకు ఆదేశించారు.




## స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శని కార్యక్రమంపై అవగాహన



అచ్చంపేట, జనవరి 30, ప్రభాతవార్త: అచ్చంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయం, అచ్చంపేటలో స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శని కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు ఈరోజు ఉదయం 11.00 గంటలకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కోయ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. మండల వైద్యాధికారి, ఇతర మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు పాల్గొన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్ పి. మస్తానమ్మ గ్రామ స్థాయిలో చేపట్టాల్సిన పనులపై అవగాహన కల్పించారు. మండల వైద్యాధికారి వి. రాంబాబు నాయక్, డిప్యూటీ తహసీల్దార్ ఎస్కే జానీ భాషా, మండల వ్యవసాయ అధికారి పొత్తూరి వెంకటేశ్వర్లు, మండల విద్యాధికారి ఏకుల ప్రసాదరావు, ఆరోగ్య విస్తరణ అధికారిపోసిపోగు వెంకటరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలు అమలు చేయాలి :ఎస్టీయు

పెదకూరపాడు, జనవరి 30, ప్రభాతవార్త: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలకు సంబంధించి ఎస్ టి యు చేస్తున్న దశల వారి ఉద్యమంలో భాగంగా పెదకూరపాడు మండల రెవెన్యూ అధికారి కి ఎస్ టి యు పెదకూరపాడు మండల శాఖ తరపున మెమొరాండం ఇవ్వడం జరిగింది. ఎస్ టి యు ఏపీ పెదకూరపాడు మండల శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ న్యామతుల్లా మండల ఆర్థిక కార్యదర్శి సురేష్ మండల గౌరవ అధ్యక్షులు రాయపూడి సాంబశివరావు మండల ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి మండల అసోసియేట్ అద్యక్షులు రమేష్ జిల్లా కౌన్సిలర్ చంద్రయ్య మహిళా కార్యదర్శులు ఝాన్సీ రాణి మేరి త్రివేణి తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలు

**భట్టిప్రోలు(రేపల్లె), జనవరి 30, ప్రభాతవార్త:** భట్టిప్రోలులో శుక్రవారం జాతిపిత మహాత్మాగాంధీ 78వ వర్ధంతి వేడుకలు వైభవంగా జరిగాయి. రథం సెంటరు, ప్రభుత్వ వైద్యశాలలోని గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భట్టిప్రోలు వాసవి క్లబ్ అధ్యక్షుడు తూనుగుంట్ల నాగభూషణం, వాసవి దేవస్థానం కమిటీ అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా, వాసవి క్లబ్ సభ్యులు ఎం.సతీష్, చెన్నా వెంకటేశ్వరరావు, చందులూరి రామకోటేశ్వరరావు, తూనుగుంట్ల శ్రీధర్, ఉపసర్పంచ్ బి.రామప్రసాద్, వాసవి కుబేర వనిత అధ్యక్షురాలు పెనుగొండ నాగరాజకుమారి, మంగరాజు, నాగ కన్యకాదేవి, ఆరోగ్య సిబ్బంది, ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# బాపట్ల జిల్లా వార్త



## ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం : అనగాని శివప్రసాద్

**రేపల్లె, జనవరి 30, ప్రభాతవార్త:** ప్రజల నుంచి అర్జీల రూపంలో అందుతున్న సమస్యలను పరిశీలించి సత్వరమే పరిష్కరిస్తామని రేపల్లె నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్ వెల్లడించారు. శుక్రవారం రేపల్లె నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరిస్తామని చెప్పారు. రేపల్లె నియోజకవర్గం అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ప్రజాదర్బార్ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు శక్తి వంచనలేకుండా కృషి చేస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జి.వి.నాగేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## లడ్డూ వ్యవహారంలో దోషులను భగవంతుడే శిక్షించాలి : తూనుగుంట్ల సాయిబాబా

**భట్టి ప్రోలు(రేపల్లె), జనవరి 30, ప్రభాతవార్త:** శ్రీవారి లడ్డును అపవిత్రం చేసిన దోషులను భగవంతుడే శిక్షిస్తాడని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అన్నారు. శుక్రవారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని శుద్ధి చేశారు. తొలుత అమ్మవారి చెట్టు వద్ద నుంచి శోభా యాత్రగా బయల్దేరి గోవింద నామాలను ఉచ్చరిస్తూ వాసవిమాత దేవాలయానికి భక్తులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. దేవాలయం గాలిగోపురం మెట్లను పసుపునీటితో శుద్ధి చేశారు. శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తూనుగుంట్ల సాయిబాబా మాట్లాడుతూ లడ్డు తయారీలో ఉపయోగించిన నెయ్యిలో భారీగా కల్తీ జరిగిందని దర్యాప్తు నివేదికలు వెల్లడించడంతో భక్తుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతీసిందన్నారు. 2019-2024 మధ్య కాలంలో రసాయనాలతో తయారు చేసిన కల్తీ నెయ్యి సరఫరా చేసి ప్రసాదాల తయారీలో వినియోగించినట్లు విచారణలో నిర్ధారణైందని చెప్పారు. సుమారు 60 లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా జరిగినట్లు రూ.234 కోట్లకు పైగా ఆర్థిక నష్టం చోటుచేసుకున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని సాయిబాబా వెల్లడించారు. ఈ నెయ్యి తయారీలో వెన్న, పాలు బదులు రసాయన పదార్థాలు, వృక్ష ఆధారిత కొవ్వు పదార్థాలు ఉపయోగించినట్లు అధికారులు నిర్ధారించారని ఆయన తెలిపారు. తిరుమల మహా పుణ్యక్షేత్రంలో ఇటువంటి సంఘటన చోటుచేసుకోవడం శోచనీయమన్నారు. భక్తుల విశ్వాసాన్ని పరిరక్షించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పారదర్శక దర్యాప్తు జరగాలని ఆయన కోరారు. దేవాలయాల పవిత్రతను దెబ్బతీసే తీరును ప్రభుత్వం సహించదన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం భట్టిప్రోలు మండల ధర్మకర్త బి.అరుణ కుమారి, మాటూరు గృహలక్ష్మి, అత్తూరి భవాని, కోట సంధ్యారాణి, సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ, యడ్ల జయశీలరావు, వేల్పూరి శ్రీనివాసరావు, కంభం సుధీర్, డొక్కు శ్రీనివాసరావు, లంక మురళి, ఆదిన బసవపున్నయ్య, అన్వర్ ఆలీ, పున్నారావు, యార్లగడ్డ పాండురంగారావు, భక్తులు పాల్గొన్నారు.




## మత్తు పదార్థాలు,గంజాయి నియంత్రణలో బాపట్ల జిల్లాకు ప్రథమ స్థానం

**బాపట్ల, జనవరి30, ప్రభాతవార్త:** మత్తు పదార్థాలు, గంజాయి నియంత్రణలో బాపట్ల జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల జిల్లాస్థాయి నియంత్రణ, సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు, గంజాయి వంటి మాదకద్రవ్యాల ఉత్పత్తి మూలాలను గుర్తించి, జిల్లాలో పూర్తిస్థాయిలో అరికట్టాలన్నారు. ఈ ప్రాంతాలలో ఇప్పటివరకు 398 కేసులు నమోదు అయ్యాయని, ఏడు వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. 61.370 కిలోల గంజాయిని బాపట్ల జిల్లాలో స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. గడిచిన నెల రోజుల్లో మూడు కేసులు నమోదు అయ్యాయన్నారు. బీహార్, ఒడిస్సా రాష్ట్రాల నుంచి కూలి పనులకు అధిక సంఖ్యలో వలసలు వస్తున్న వారే గంజాయి దిగుమతి చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఆ దిశగా నిఘా ఉంచామని ఇప్పటికే పలుమార్లు రైళ్లలో తనిఖీలు చేసి గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. మత్తు పదార్థాలు, గంజాయి వంటి మాదకద్రవ్యాలు ఏ ప్రాంతాల నుంచి ఉత్పత్తి అవుతున్నాయో నిశితంగా పరిశీలిస్తున్నామన్నారు. మాదకద్రవ్యాల నుంచి యువతను కాపాడడానికి జిల్లా స్థాయిలో 661 విద్యార్థుల క్లబ్ లు ఏర్పాటు చేసుకున్నామన్నారు. అన్ని పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థల్లో విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో చైతన్య కార్యక్రమాలు చేపట్టామన్నారు. రిసార్ట్స్ లాడ్జిలు వద్ద ప్రచార పత్రాలు, గోడపత్రాలు ఉంచాలని అధికారులకు ఆదేశించారు. గంజాయి వినియోగానికి మరుగ్గా ఉన్న 71 ప్రాంతాలను గుర్తించామన్నారు. ఆ ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్ గా గుర్తించి, ఆ ప్రాంతాలలో డ్రోన్ల ద్వారా సర్వేలెన్స్ చేస్తున్నామన్నారు. బ్లాక్ స్పాట్స్ వద్ద మరింత పరిశీలన, పర్యవేక్షణ, నిఘా ఉంచామన్నారు. సీసీ కెమెరాలు, ఫెన్సింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఆ ప్రాంతాలలో పటిష్టమైన భద్రత కొరకు ఎలాంటి అవసరాలు ఉన్నాయో వాటిపై బాపట్ల సేవా సేతు వెబ్ సైట్లో నమోదు చేయాలన్నారు. వివరాలను నిక్షిప్తం చేయగానే దాతలు ముందుకు వస్తారని ఆయన సూచించారు. మాదకద్రవ్యాల ఉత్పత్తి, అక్రమ రవాణా, వినియోగాన్ని బాపట్లలో పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు మార్గ నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ డి.రామాంజ నేయులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎస్ విజయమ్మ, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీవోలు గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి, జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి, కమిటీలోని జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## 12వ పీఆర్‌సి కమిషన్‌ను వెంటనే నియమించాలి

**కర్లపాలెం, జనవరి30, ప్రభాతవార్త:** పెన్షనర్స్ బకాయిలను వెంటనే చెల్లించాలనిఎస్టీయు బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్టీయు రాష్ట్ర సంఘం ఉద్యమ కార్యాచరణ పిలుపుమేరకు కర్లపాలెం మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కర్లపాలెం మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద సీనియర్ అసిస్టెంట్ ఆనందరావు మెమోరాండం అందించారు. ఈ సందర్భంగా ఎస్టీయు బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 12 వ పీఆర్ సి కమిషన్ ను వెంటనే నియమించాలన్నారు. ఐ ఆర్ ను తక్షణమే 30 ప్రకటించాలని, ఆర్థిక బకాయిలు రూ.34000 కోట్లు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల ప్రధాన కార్యదర్శి వై.గుడేరెంకయ్య మాట్లాడుతూ పెన్షనర్స్ బకాయిలను వెంటనే చెల్లించాలని, ఉద్యోగ విరమణ అయిన వెంటనే బకాయిలను చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయు నాయకులు ఓ. శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులు పి. రామారావు, సి పి యస్ కన్వీనర్ వి శ్రీనివాసరావు, జిల్లా మహిళా కన్వీనర్ ఆదంబి, సంగీత బాబు, ఏసు రాజు, శ్రీనివాసరావు, మల్లి ఖార్జున రెడ్డి, వీర జ్యోతి, వాణి, జశ్వంత లక్ష్మీ, రామ్ చంద్, వెంకటేశ్వరరావు, అప్పారావు, అరోన్ రావు, నాంచారయ్య, ఆనందరావు, సుధీర్ బాబు, తిరుపతి వెంకయ్య తదితర ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ

**రేపల్లె, జనవరి 30, ప్రభాతవార్త:** జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఎబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సి.రవిచంద్ర కుమార్, డాక్టర్ వసంతం వీరరాఘవయ్యలు మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఇలైట్ యాంటీ




నార్కోటిక్స్ గ్రూప్‌ఫర్‌లా ఎన్‌ఫోర్స్‌మెంట్(ఈగల్) ఆధ్వర్యంలో కళాశాల నుంచి రేపల్లె తాలూకా కార్యాలయం వరకు మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించే నినాదాలు, బ్యానర్లు ప్లకార్డులు ప్రదర్శించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.దాసు, రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.బుజ్జిబాబు, ఎన్‌సిసిఎఎన్ఓ కె.బాల గురవయ్య, ఐక్యూ ఎసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నరసయ్య, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఎ.గంగాధరరావు, ఎ.కోటేశ్వరరావు, బి.కోటేశ్వరరావు, డాక్టర్ వి.వి.రవిచంద్ర, ఎన్‌సిసి క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, రెడ్ క్రాస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభాకర్‌రావు సేవలు చిరస్మరణీయం : మాజీ ఎమ్మెల్యే దేవినేని

**రేపల్లె, జనవరి 30, ప్రభాతవార్త:** వివిధ రంగాలలో రాణించి ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయిన స్వర్గీయ అడుసుమల్లి ప్రభాకర్ రావు సేవలు చిరస్మరణీయమని రేపల్లె మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు అన్నారు. శుక్రవారం న్యాయవాది, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి దివంగత అడుసుమల్లి ప్రభాకర్ రావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసిన దేవినేని మల్లికార్జునరావు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు డాక్టర్ వసంతం వీరరాఘవయ్య అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు మాట్లాడుతూ ఎన్నెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించిన ఘనత ప్రభాకర్‌రావుకే దక్కుతుందన్నారు. సామాజిక, న్యాయ, వైద్య, పత్రికా రంగాలలో విశిష్ట సేవలు అందించిన రాచాబత్తుల శ్రీనివాసరావు, డాక్టర్ లీలాకృష్ణకుమారి, శివప్రసాద్, అగ్నిహోత్రం పవన్‌కుమార్, సయ్యద్ కరీముల్లా, పుప్పాల ఐజ్‌లను మెమెంటోలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మేకా రామకృష్ణ, శ్రీకాంత్, ఫణి, దివంగత ప్రభాకర్‌రావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## శత్రు,మిత్ర పురుగుల నిష్పత్తి తెలుసుకోవాలి

**నిజాంపట్నం, జనవరి 30, ప్రభాతవార్త:** ప్రతి రైతు తాము పండించే పంటలో శత్రు, మిత్ర పురుగుల నిష్పత్తిని తెలుసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి చుక్కా విజయరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని పసుమర్తిపాలెంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ శత్రు, మిత్ర పురుగుల నిష్పత్తి 1:15గా ఉండాలన్నారు. విచ్చలవిడిగా పురుగు, రసాయన మందుల వాడకంవల్ల మిత్రపురుగులైన కందిరీగ, తూనీగ, సాలీడు, అక్షంతల పురుగులు నశించిపోతున్నాయ న్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మండల కోఆర్డినేటర్ యేమినేని శివకుమారి, ఎఇఓ ప్రేమ్‌కుమార్, విఎఎ అజయ్, రైతులు పాల్గొన్నారు.



## కుష్టు వ్యాధి నివారణ పై ప్రజలు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలి

**బాపట్ల, జనవరి30, ప్రభాతవార్త:** కుష్టు వ్యాధి నివారణపై ప్రజలు తప్పనిసరిగా అవగాహన పొందాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. కుష్టు వ్యాధి నివారణపై చేపట్టిన ఫిబ్రవరి 13వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు.. ప్రజలు అవగాహన పొందడం ద్వారానే కుష్టు వ్యాధిని పూర్తిగా సమాజం నుంచి నిర్మూలించగల మన్నారు.



అవగాహన కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో ప్రారంభించారు. కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవగాహనతోనే కుష్టు వ్యాధిని నిర్మూలించగల మన్నారు. కుష్టు వ్యాధి అవగాహనపై అధికారులం దరితో ప్రతిజ్ఞ చేయించారు. శుక్రవారం నుంచి ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ జి.రామాంజనేయులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ పద్మజ, జిల్లా మలేరియా, కుష్టు నియంత్రణ అధికారి సోమ్లా నాయక్, జిల్లా రవాణాశాఖ అధికారి టి.కె.పరంధామరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు చందోలు దేవాలయాలలో హుండీల లెక్కింపు

**పిట్టలవానిపాలెం, జనవరి30, ప్రభాతవార్త:** చందోలు గ్రామంలోని మూడు దేవాలయాలలో శ్రీ లింగోద్భవ స్వామి వారీ దేవస్థానము, శ్రీ చెన్నకేశవ స్వామి వారి దేవస్థానం, శ్రీ బండ్లమ్మ అమ్మవారి దేవ స్థానములలో ఉప కమిషనర్ దేవాదాయశాఖ గుంటూరు వారి ఉత్తర్వుల మేరకు అధికారులు, ధర్మ కర్తల మండల సభ్యులు, భక్తుల సమక్షంలో హుండీల లెక్కింపు కార్యక్రమం శనివారం జరుగుతుందని గ్రూపు దేవస్థానముల ఈవో జి నరసింహామూర్తి తెలిపారు. ఆసక్తిగల భక్తులు మగవారు లుంగీ టవలు ధరించి ఈ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చునని తెలిపారు.



## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

**భట్టిప్రోలు(రేపల్లె), జనవరి 30, ప్రభాతవార్త:** బాల్యవివాహాలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని ప్రజలలో అవగాహన పెరగాలని పల్లెకోన సెక్టార్ సూపర్‌వైజర్ సునీత అన్నారు. శుక్రవారం మండలంలోని వరికూటివారి పాలెం అంగన్వాడీ కేంద్రంలో బాల్య వివాహాల నిర్మూలనపై తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సునీత మాట్లాడుతూ బాలికల భద్రత కేవలం తల్లిదండ్రులకే కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కోరారు. బాల్య



వివాహాల విషయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రజలలో అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో తల్లులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**రేపల్లెలో:** ఒల్డుటౌన్‌లో బాల్య వివాహాల నిషేధంపై అవగాహన కల్పించేందుకు రేపల్లె మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు చెన్ను నాగమల్లేశ్వరరావు, రాచబత్తుల శ్రీనివాస రావు, సయ్యద్ తాహిర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## కుష్టువ్యాధి పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలి : డాక్టర్ జుబేదా

**చెరుకుపల్లి, జనవరి 30, ప్రభాతవార్త:** కుష్టువ్యాధి పట్ల ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని కావూరు ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారిని జుబేదా అన్నారు. శుక్రవారం జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా కావూరు, కనగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కుష్టువ్యాధి ఎటువంటి హానికరమైన, ప్రమాదకరమైన వ్యాధి కాదని కేవలం అవగాహన ద్వారా దీనిని సాధ్యమైనంత త్వరగా నిర్మూలించవచ్చునని ఆమె తెలిపారు. మైక్రో బాక్టీరియం లెప్రే అనే చిన్నపాటి వైరస్ కారణంగా ఇది ఇతరులకు వ్యాప్తి చెందుతుందని దీనిని సకాలంలో గుర్తించి తగిన చికిత్స పొందడం ద్వారా పూర్తిగా నిర్మూలించవచ్చునని మరోవైద్యాధికారి సమద్ అన్నారు. దీనిపై గ్రామాల్లోని సిబ్బంది నేటి నుండి జనవరి 13వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రజలందరూ ఈ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని వారు తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ఓ వాణిశ్రీ, హెచ్ ఎస్ శ్రీనివాసరావు, హెచ్.పీ రాజకుమారి, హెచ్ ఇ అరుణకుమారి సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు. అదేవిధంగా గుల్లపల్లి గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఈఓపిఆర్డి శ్రీనివాసన్, పంచాయతీ కార్యదర్శి సురేష్ బాబు, ఏఎన్ఎంలు సిహెచ్ పి భవాని, ప్రేమ కుమారి, ఎం ఎల్ హెచ్ పి, సిబ్బంది, స్థానిక నాయకులు, పలువురు పాల్గొన్నారు.




## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తప్పవు : డిఎస్పీ

చెరుకుపల్లి, జనవరి 30, ప్రభాతవార్త : ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించినా..చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా అటువంటి వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని బాపట్ల డిఎస్పి ఏ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని గుల్లపల్లి బూర్లమ్మ డొంకలో కార్డన్ సెర్చ్ తనిఖీ కార్యక్రమాన్ని సిబ్బందితో కలిసి ఆయన నిర్వహించారు. చుండూరు, రేపల్లె సిఐలు, ఆరుగురు ఎస్ఐలు, 55 మంది సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేని 29 మోటార్ సైకిళ్ల ను ఆయన స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా డ్రగ్స్ కార్యక్రమాలు గాని అనుమతి లేకుండా ఆయుధాలు కలిగి ఉండటం గాని చేస్తే చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా గుర్తు తెలియని వ్యక్తులు స్థానికంగా ఎవరన్నా ఉంటుందా అని ఆయన సిబ్బందితో తనిఖీలు చేయించారు. భారతీయ చట్టాలు, పౌరులుగా పాటించవలసిన ప్రాదేశిక సూత్రాలను ఆయన స్థానికులకు సిబ్బందితో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చెరుకుపల్లి ఎస్సై టి అనిల్ కుమార్, నిజాంపట్నం, సోడాయపాలెం, నగరం, రేపల్లె, వేమూరు, పోలీస్ స్టేషన్ల అధికారులు ఆయా పోలీస్ స్టేషన్లో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల సంతృప్తి స్థాయి పెంచేలా ఉద్యోగులు పనిచేయాలి : బాపట్ల ఆర్డీవో గ్లోరియా

**బాపట్ల, జనవరి30, ప్రభాతవార్త:** ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు అందించడంలో ప్రజల సంతృప్తి స్థాయి ని పెంచే విధంగా ఉద్యోగులు పనిచేయాలని బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి గ్లోరియాతెలిపారు. శుక్రవారం బాపట్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల కి చెందిన ఉద్యోగుల సమావేశం లో ఆర్డీవో గ్లోరియా ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన అనేక పథకాలు అమలులో అవినీతి కి, అలసత్వానికి తావు లేకుండా పారదర్శకంగా సేవలందించి ప్రజల ప్రేమాభిమానాలు పొందాలన్నారు. విధులు పట్ల నిర్లక్ష్య ధోరణి తో వుండే వారి పై ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేసి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన బాపట్ల మండలం స్వర్ణ గ్రామం అధికారి పల్నాటి శ్రీరాములు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు సక్రమంగా అందించాలనే లక్ష్యంతో ఏకీకృత కుటుంబ సర్వే ని నిర్వహించి ప్రతి కుటుంబానికి ఉగాది నాటికి ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు ఇస్తుందన్నారు. ఈ సర్వేను వేగవంతం చేయాలని చెప్పారు. సమావేశం లో బాపట్ల మండలం లోని 21 స్వర్ణ గ్రామాల ఉద్యోగులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

**వేమూరు జనవరి 30 (ప్రభాతవార్త) :** అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స చేయించుకున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సీఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. వేమూరు మండలం కుచ్చెళ్ళపాడు గ్రామానికి చెందిన తులం శిరీష ప్రైవేటు వైద్యశాలలో చికిత్స చేయించుకోగా వైద్య ఖర్చుల నిమిత్తం నాలుగు లక్షల 50వేల344చెక్కును, అదే విధంగా కొల్లూరు మండలం కొల్లూరు గ్రామానికి చెందిన ఈమని పల్లవికి లక్ష29వేల348రూపాయల చెక్కులను ఎల్‌ఓసి ద్వారా ఎమ్మెల్యే ఆనందబాబు అందజేశారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న బాధితులు ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. వారితో పాటు మండల పార్టీ అధ్యక్షులు గాజుల వెంకట సుబ్బయ్య, మురళీకృష్ణ, తూమాటి శ్యాంబాబులు ఉన్నారు.



## ప్లాస్టిక్ నిషేధానికి సహకరించండి : మునిసిపల్ కమిషనర్

**తెనాలి మున్సిపాలిటీ జనవరి 30(ప్రభాతవార్త):** ప్లాస్టిక్ వాడకం పై నిషేధం అమలులో ఉందని కావున ప్లాస్టిక్ వినియోగం చేయవద్దని పట్టణంలోని వ్యాపారస్తులకి మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు హెచ్చరికలు జారీ చేశారు. శుక్రవారం పట్టణంలోని మార్కెట్ సెంటర్, మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లోని దుకాణాల్లో మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, పలువురు వ్యాపారస్తులతో మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగం పై నిషేధం ఉందని కావున వ్యాపారస్తులు ప్లాస్టిక్ కవర్లు వినియోగించవద్దని, ఎవరైనా దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే లేదా అమ్మినా, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్లాస్టిక్ వినియోగం వలన పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని, ప్లాస్టిక్ కవర్లు లేదా ప్లాస్టిక్ తో తయారైన ఏ విధమైన వస్తువులైన మట్టిలో కలిసి పోవటానికి కొన్ని వేల సంవత్సరాలు సమయం పడుతుందని, అంతేకాకుండా ప్రజారోగ్యం దృష్ట్యా ప్లాస్టిక్ వినియోగం సరైనది కాదని, ప్రజలు కూడా గమనించి ప్రభుత్వానికి, పురపాలక సంఘానికి సహకరించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరోధించుటలో తమ వంతు బాధ్యతని గుర్తు చేసుకోవాలన్నారు.




## పట్టణంలో వీధి కుక్కల పట్టివేత

**తెనాలి టౌన్ జనవరి30(ప్రభాతవార్త):** తెనాలి పట్టణంలో వీధి కుక్కల సమస్య పరిష్కారానికి మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. వీధి కుక్కలను నియంత్రించే కార్యక్రమంలో భాగంగా, పట్టణంలోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కలు పట్టివేత కార్యక్రమం చేపట్టారు. నందుల పేట, ఐతానగర్ మరియు గంగానమ్మపేట ప్రాంతాల్లో ప్రత్యేక సిబ్బంది ద్వారా వీధి కుక్కలను పట్టుకొని, స్టెరిలైజేషన్‌కి వాటిని తరలిస్తున్నట్టు పురపాలక సంఘ అధికారులు తెలిపారు. ప్రధానంగా వీధి కుక్కల సంఖ్యను తగ్గించేందుకు, ప్రభుత్వ మార్గదర్శకాల ఆధారంగా వీధికుక్కలకి స్టెరిలైజేషన్ నిర్వహించటం, ప్రజల భద్రతను కాపాడటం, కుక్కల నుండి రేబిస్ వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవటం అలాగే వీధి కుక్కల పెరుగుదలపై మానవీయ నియంత్రణ చూపించటం వంటి చర్యలు చేపడుతున్నట్టు పురపాలక సంఘ అధికారులు తెలియజేశారు.



# 'శాంతి'పై చర్చిద్దాం.. రండి!



## మాస్కోకు రావలసిందిగా జెలెన్‌స్కీకి రష్యా ఆహ్వానం

## మీరే కీవ్‌కు రావాలని పుతిన్‌ను కోరిన ఉక్రెయిన్ అధ్యక్షుడు

## రెండు రోజులు కాల్పుల విరమణ

కీవ్/ మాస్కో, జనవరి 30: రష్యా- ఉక్రెయిన్ శాంతి చర్చల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరు దేశాల మధ్య దాదాపు నాలుగు సంవత్సరాల నుంచి కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించడానికి అమెరికా ప్రయత్నాలు ముమ్మరం కావడంతో శాంతి చర్చల కోసం మాస్కోకు రావాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెల్‌న్‌స్కీను రష్యా ఆహ్వానించింది. జెలెన్‌స్కీకు తగిన భద్రత కల్పిస్తామని, అందుకు తాము పూర్తి బాధ్యత తీసుకుంటామని మాస్కో స్పష్టం చేసింది. ఈ విషయాన్ని రష్యా అధ్యక్ష భవనం క్రిమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ వెల్లడించారు. ఇటీవల అమెరికా, రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య తొలి త్రైపాక్షి క సమావేశం జరిగిన నేపథ్యంలో ఉక్రెయిన్ అధ్యక్షుడ్ని రష్యా ఆహ్వానించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక జెలెన్ స్కీ భద్రతపై తాము హామీ ఇస్తున్నట్లు రష్యా స్పష్టం చేసింది. ఉక్రెయిన్‌తో శాంతి చర్చలు జరిపేందుకు రష్యా ఆసక్తిగా ఉన్నట్లు స్పష్టం చేసింది. ఇదే విషయంపై పుతిన్ సన్నిహితుడు యూరీ ఉషాకోవ్ మాట్లాడుతూ జెలెన్ స్కీను రష్యా ఆహ్వానించిందని.. ఒకవేళ అతడు సమావేశానికి సిద్ధమైతేనే అని స్పష్టం చేశారు. ఇంధన, మౌలిక సదుపాయాలపై ఒకరిపై ఒకరు దాడులు చేయడం తక్షణమే ఆపేయాలని ఇరు దేశాలు అంగీకరించాయనే వదంతులపై వ్యాఖ్యానిం చడానికి నిరాకరించిన కొన్ని గంటల తర్వాత క్రెమ్లిన్, జెలెన్‌స్కీని ఆహ్వానిస్తూ ప్రకటన చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. దీనిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ స్పందిస్తూ, శాంతి చర్చల కోసం కీవ్‌కు రావా లంటూ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను ఆహ్వానించారు. మాస్కో దాడులు ఆపితే, ఉక్రెయిన్ తన దాడులను ఆపుతుందని జెలెన్‌స్కీ పునరుద్ఘాటించారు. ఇదిలా ఉండగా, అమెరికా మధ్యవర్తిత్వంతో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లు సమావేశానికి సిద్ధంగా ఉన్నారని పేరు వెల్లడించడానికి నిరాకరించిన ఓ అమెరికా అధికారి తెలిపారు. రష్యా, ఉక్రెయిన్ శాంతి ప్రతినిధుల మధ్య అబుదాబిలో ఆదివారం మరోసారి దఫా చర్చలు జరగనున్నాయి. ఈ పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హర్షం వ్యక్తం చేశారు. శీతాకాలం నేపథ్యంలో దాడులు ఆపాలని రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను ట్రంప్ కోరగా.

సానుకూలంగా స్పందించినట్లు అమెరికా అధ్యక్ష కార్యాలయం పేర్కొంది. అటు జెలెన్‌స్కీ దీనిపై స్పందిస్తూ, ట్రంప్ విజ్ఞప్తి మేరకు ఫిబ్రవరి 1వరకు రష్యాపై తామెలాంటి దాడులు చేయమని స్పష్టం చేశారు.



## అతడి భార్య అందంగా ఉందని పదవి!

### యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ విచిత్ర వ్యాఖ్యలు

వాషింగ్టన్, జనవరి 30: అమెరికా ఇంటీరియర్ సెక్రటరీగా డగ్ బర్గమ్‌ను అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియమించారు. ఈ నియామకంపై ట్రంప్ స్పందిస్తూ విచిత్ర వ్యాఖ్యలు చేశారు. బర్గమ్ భార్య చాలా అందంగా ఉందని, అందుకే ఆయనకు పదవి ఇచ్చినట్లు వెల్లడించారు. ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేస్తున్న సమయంలో బర్గమ్, ఆయన సతీమణి అక్కడే ఉండటం గమనార్హం. మాదకద్రవ్యాల కట్టడి లక్ష్యంగా ఓ ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులపై ట్రంప్ గురువారం సంతకం చేశారు. అనంతరం ఓవల్ ఆఫీసులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అధ్యక్షుడు మాట్లాడుతూ.. 'బర్గమ్, అతని భార్య క్యాథరిన్ గుర్రపు స్వారీ చేస్తున్న విడియో చూశా. అందులో ఆమె చాలా ఆకర్షణీయంగా కనిపించారు. ఆమె ఎవరని నా సిబ్బందిని అడిగా. ఈ జంట గురించి వారు వివరించగానే నాకో అభిప్రాయం ఏర్పడింది. ప్రధానంగా ఆ కారణంగానే డగ్‌కు పదవి ఇచ్చా. డగ్ బర్గమ్ విజయవంతమైన బిజినెస్ మ్యాన్. నార్త్ డకోటాకు రెండుసార్లు గవర్నర్‌గా పనిచేశారు. అయితే, బర్గమ్ విజయం వెనక ఆయన భార్య పాత్ర కీలకంగానే ఉండి ఉంటుంది. అద్భుతమైన జంట' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే, ఈ వ్యాఖ్యలు వైరల్ కావడంతో ట్రంప్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. మహిళలను కించపరిచేలా ఆయన మాటలు ఉన్నాయంటూ పలువురు విమర్శించారు.

# ఐఒఎ అధ్యక్షురాలు పిటి ఉష భర్త హఠాన్మరణం



కోజికోడ్, జనవరి 30: భారత క్రీడా దిగ్గజం, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు పి.టి. ఉష కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆమె భర్త 64 ఏళ్ల వెంగలిల్ శ్రీనివాసన్ శుక్రవారం తెల్లవారుజామున కేరళలోని కోజికోడ్‌లో కన్నుమూశారు. ఈ ఘటన జరిగిన సమయంలో ఉష ఇంట్లో లేరు. పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనడం కోసం ఆమె ఇంటికి దూరంగా ఉన్నారు. పి.టి. ఉష సాధించిన ప్రతి విజయం వెనుక ఉండి ఆమెను ముందుకు నడిపించిన ఆయన ఇక లేరన్న వార్త క్రీడాలోకాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ముందురోజు అర్ధరాత్రి దాటిన తర్వాత శ్రీనివాసన్ కోజికోడ్ జిల్లాలోని థిక్కోడి పెరుమాళ్‌పురంలో ఉన్న తన నివాసంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే అప్రమత్తమైన కుటుంబ సభ్యులు ఆయన్ను పెరుమాళ్‌పురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి అయిన శ్రీనివాసన్ పదవీ విరమణ చేసిన తర్వాత పూర్తిగా ఉష క్రీడా అకాడమీ, ఆమె బాధ్యతల నిర్వహణలో తోడుగా ఉంటూ వచ్చారు. ఎప్పుడూ ఆమె వెన్నంటే ఉంటూ భార్యకు అన్ని విధాలుగా అండగా నిలిచారు. కేరళలోని పెన్నని సమీపంలో కుట్టిక్కడ్‌కు చెందిన నారాయణన్, సరోజినీ దంపతులు శ్రీనివాసన్ తల్లిదండ్రులు. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్‌లో డిప్యూటీ ఎస్పీ హోదాలో ఆయన రిటైర్ అయ్యారు. తన దూరపు బంధువైన పీటీ ఉషను1991లో శ్రీనివాసన్ వివాహం చేసుకున్నారు. వారికి డాక్టర్ ఉజ్వల్ విగ్నేష్ అనే కుమారుడు ఉన్నారు. ఉష అంతర్జాతీయ స్థాయిలో పయ్యోలి ఎక్స్‌ప్రెస్ గా గుర్తింపు పొందడంలో శ్రీనివాసన్ పాత్ర వెలకట్టలేనిది. వారు వివాహం చేసుకున్న నాటి నుంచి ఆమె క్రీడా జీవితంలోనే కాకుండా తదనంతరం ఆమె రాజకీయ ప్రస్థానంలోనూ శ్రీనివాసన్ వెన్నంటే నిలిచారు. ఉష సాధించిన ప్రతీ మైలురాయి వెనుక ఆయన ప్రోత్సాహం ఉండేదని సన్నిహితులు చెబుతుంటారు. ప్రధాని నరేంద్ర మోడీ సైతం పిటి ఉషతో మాట్లాడారు. శ్రీనివాసన్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నట్లు మోడీ తెలిపారు.

# అజిత్‌పవార్ మరణంపై సిఐడి దర్యాప్తు షురూ



ముంబయి,జనవరి 30: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ దుర్మరణానికి కారణమైన బారామతి విమాన ప్రమాదంపై రాష్ట్ర నేర దర్యాప్తు విభాగం (సీఐడీ) విచారణను ప్రారంభించింది. ఈ ఘోర ప్రమాదం ఎలా జరిగింది అనే విషయాన్ని నిగ్గు తేల్చనుంది. పుణె రూరల్ పోలీసుల పరిధిలో నమోదైన ఈ కేసును తక్షణమే సీఐడీకి బదిలీ చేశారు. ఈ కేసులో సీఐడీ ఎంట్రీ ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. సీఐడీ ప్రధానంగా విద్రోహచర్యలున్నాయా అన్న కోణంలో దర్యాప్తు చేయనుంది. అంటే విమానం ముంబయి నుంచి బయలుదేరడానికి ముందే, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా విమానంలో సాంకేతిక లోపాలు సృష్టించారా అనే కోణంలో లోతైన విచారణ జరుపుతున్నారు. బారామతిలో జరిగిన ఈ ఘటనపై తొలుత పుణె రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత సెక్షన్ 194 కింద దీనిని ప్రమాదవశాత్తు జరిగిన మరణంగా నమోదు చేశారు. ఇప్పుడు ఆ ఎఫ్ఐఆర్ సంబంధిత పత్రాలన్నింటినీ సీఐడీకి అప్పగిస్తున్నారు. సీఐడీ బృందం పుణె రూరల్ పోలీసుల నుంచి డాక్యుమెంట్లను సేకరిస్తోంది. విచారణలో భాగంగా సీఐడీ అధికారులు బారామతిలోని ప్రమాద స్థలాన్ని సందర్శించనున్నారు. కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ పరిధిలోని ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో కూడా తన విచారణను ప్రారంభించింది. కాగా అజిత్ పవార్ మరణించిన వెంటనే ఎన్సీపీ పగ్గాలు ఎవరికి ఇవ్వాలనే చర్చ జరగడం బాధాకరమని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ అన్నారు. ఇది అమానవీయ చర్య అని ఆయన మండిపడ్డారు. పుణె జిల్లా బారామతిలో బుధవారం జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆయన మరణించిన మరుసటి రోజే పార్టీలో వారసత్వ చర్చలు మొదలయ్యాయని వార్తలు వచ్చాయి. అజిత్ భార్య సునేత్ర పవార్‌కు రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కొందరు డిమాండ్ చేస్తున్నారని, ఆమెకే పార్టీ బాధ్యతలు అప్పగించాలని మరికొందరు నాయకులు చెప్పినట్లు ప్రచారం జరిగింది. దీనిపై సంజయ్ రౌత్ శుక్రవారం స్పందిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో రాజకీయ పదవుల గురించి మాట్లాడే వారికి మానవత్వం లేదు. సునేత్ర పవార్ తన భర్తను కోల్పోయి తీవ్ర దుఃఖంలో ఉన్నారు. ఆమె కన్నీరు ఇంకా ఆరలేదు. మంత్రులైనా, ఎమ్మెల్యేలైనా ఈ సమయంలో సంయమనం పాటించాలని రౌత్ హితవు పలికారు. సునేత్ర పవార్ ప్రస్తుతం రాజ్యసభ సభ్యురాలిగా ఉన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆమె బారామతి నుంచి పోటీ చేసి ఓడిపోయారు.

# ఆర్బీఐ లాకర్లలో భద్రంగా నిజాం నగలు!

## పార్లమెంటులో స్పష్టంచేసిన మంత్రి గజేంద్రసింగ్ షెకావత్



న్యూఢిల్లీ,జనవరి 30: నిజాం నవాబులకు చెందిన అపురూప ఆభరణాలపై కేంద్ర ప్రభుత్వం విధాన ప్రకటన చేసింది. ఈ నగలన్నీ కూడా ప్రస్తుతం భారత రిజర్వుబ్యాంకు ఆధీనంలో అత్యంత భద్రంగా ఉన్నాయని, అయితే వాటిని శాశ్వత ప్రదర్శన కోసం హైదరాబాద్‌కు తరలించే విషయంపై ప్రస్తుతానికి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసింది. రాజ్యసభలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ నిన్న రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు. 1995 నుంచి 173 అపురూపమైన నిజాం ఆభరణాలు ఆర్‌బీఐ లాకర్లలో ఉన్నాయన్న విషయం ప్రభుత్వానికి తెలుసా అని అడగగా, మంత్రి అవును అని బదులిచ్చారు. ఈ నగల చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని ప్రభుత్వం గుర్తిస్తుందా అని, వాటిని సొంత గడ్డ అయిన హైదరాబాద్‌లో ప్రదర్శించాలన్న ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకుంటుందా అని కూడా ప్రశ్నించారు. దీనికి మంత్రి బదులిస్తూ, నిజాం నగల చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యతను, వాటితో ముడిపడి ఉన్న ప్రజా ప్రయోజనాలను తమ మంత్రిత్వ శాఖ గుర్తిస్తుందని తెలిపారు. అయితే, ఆర్‌బీఐతో ఉన్న ఒప్పందం ప్రకారం వివరించారు.



## రాహుల్‌గాంధీపై శశిథరూర్ పొగడ్తల వర్షం

### పార్టీ మారుతున్నట్లు వచ్చిందంతా ఊహాగానాలే..

న్యూఢిల్లీ,జనవరి 30: తాను పార్టీ మారుతున్నానని వస్తున్న ఊహాగానాలకు కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ చెక్ పెట్టారు. తాను కాంగ్రెస్‌లోనే ఉన్నానని, ఎక్కడికీ వెళ్లబోనని స్పష్టం చేశారు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలను కలిసిన మరుసటి రోజే థరూర్ చేసిన ప్రకటన రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. శశిథరూర్ కొన్ని నెలలుగా ఆర్ఎస్ఎస్, బీజేపీ, ప్రధాని మోడీపై సానుకూలంగా మాట్లాడుతూ వస్తున్నారు. సడెన్‌గా ఆయన ప్రవర్తన మాడంతో కాంగ్రెస్ పార్టీని వీడతారనే ఊహాగానాలు వచ్చాయి. ఎన్నో నెలలుగా ఈ ఊహాగానాలు వ్యక్తమవుతున్నప్పటికీ వీటిపై స్పందించలేదు. తాజాగా ఖర్గే, రాహుల్ గాంధీతో భేటీ అనంతరం స్పందించారు. ఈ భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన థరూర్ రాబోయే కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ గెలుపుకోసం తాను ముందుండి పనిచేస్తానని చెప్పారు. కేరళ ప్రచారంలో చురుకుగా పాల్గొంటానని, కాంగ్రెస్‌కు బలంగా నిలుస్తానని తెలిపారు. తనపై వస్తున్న పార్టీ మార్పు వార్తలకు ఎలాంటి ఆధారం లేదని తేల్చిచెప్పారు.

## మహాత్మాగాంధీకి నివాళులు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జనవరి30, ప్రభాతవార్త: జాతిపిత మహాత్మాగాంధీ 77వ వర్థంతి సందర్భంగా ఆయన



విగ్రహానికి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, గాంధియన్ స్టడీస్ కోఆర్డినేటర్ ఆచార్య ఎం.సురేష్‌కుమార్ నివాళులు అర్పించారు. గాంధీ అడుగుజాడల్లో నడవాలని ఆయన సమాజానికి అందించిన సేవలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకుసాగాలని విద్యార్థులకు సూచించారు.

## మరో గ్రంధాలయ ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జనవరి30, ప్రభాతవార్త: మరో గ్రంధాలయ ఉద్యమం పేరుతో తెలంగాణ- ఆంధ్రప్రదేశ్ అంతటా బస్సు యాత్ర నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏఎన్‌యు వీసీ ఆచార్య కె.గంగాధరరావు బస్సు యాత్ర పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. హైద్రాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ నుంచి బస్సు యాత్ర ప్రారంభం కానుంది. హైద్రాబాద్ నుంచి అమరావతి వరకు ఈ యాత్ర సాగనుంది.



## హిందూ ఫార్మసీ కళాశాలలో వర్క్ షాప్

గుంటూరు విద్య జనవరి 30 ప్రభాతవార్త : హిందూ ఫార్మసీ కళాశాలలో ఫార్మాసూటికల్ అనాలసిస్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 29, 30 తేదీలలో ఎనటికల్ మెథడ్స్ ఇన్ ఫార్మాస్యూటికల్ అనాలసిస్ పై రెండు రోజుల వర్క్ షాపు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి నాగభూషణం తెలిపారు. అనాలసిస్ విభాగాధిపతి డాక్టర్ పి నాగరాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందూ ఫార్మసీ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న ఫార్మసీ డిప్లమా విద్యార్థులకు ఈ వర్క్ షాప్ శిక్షణ ఉపాధి అవకాశాల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్ మధుసూదన్ రావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ ప్రత్యూష, ఫార్మా డి డైరెక్టర్ పి సీతారామయ్య తదితర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## సక్షమ్ క్యాలెండర్ ఆవిష్కరించిన వీసి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జనవరి30, ప్రభాతవార్త: దివ్యాంగుల సంక్షేమ సంస్థ సక్షమ్ ఆంధ్రప్రదేశ్ శాఖ వార్షిక క్యాలెండర్‌ను శుక్రవారం వీసి ఆచార్య కె.గంగాధరరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్‌కుమార్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.వీరయ్య, లైబ్రేరియన్ ఆచార్య కోడెల వెంకట్రావు, ఓఎస్‌డి ఆచార్య ఆర్‌వీఎస్‌ఎస్‌ఎన్.రవికుమార్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులకు ఏఎన్‌యులో సమాన అవకాశాలు కల్పించినట్లు పేర్కొన్నారు. సక్షమ్ ప్రతినిధులు మూర్తి, అరవింద్, ఏఎన్‌యు దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు జె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# అజిత్ శాఖలు ఎన్సీపీ వర్గానికే కేటాయించాలి

## సిఎం ఫడ్నవిస్‌ను కలిసిన అజిత్ వర్గం నేతలు

ముంబయి,జనవరి 30: దివంగత నేత అజిత్‌పవార్‌నిర్వహించిన ప్రభుత్వశాఖలన్నీ ఎన్సీపీ పరిధిలోనే ఉండాలని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) నాయకులు కలిసి విజ్ఞప్తిచేసారు. విమాన ప్రమాదంలో మరణించిన డిప్యూటీ సీఎం అజిత్ పవార్ పోర్ట్‌ఫోలియోలపై చర్చించారు. ఆయన నిర్వహించిన మంత్రి పదవులపై తమ పార్టీకే హక్కు ఉన్నదని తెలిపారు. ఎన్సీపీ సీనియర్ నేతలు ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరే, ఛగన్ భుజ్‌బల్ కలిసి సీఎం ఫడ్నవీస్ అధికార నివాసానికి వెళ్లారు. అజిత్ పవార్ నిర్వహించిన కీలకమైన ఆర్థిక, రాష్ట్ర ఎక్సైజ్, క్రీడా శాఖలతో సహా అన్ని మంత్రిత్వ శాఖలు ఎన్సీపీ కోటాలోనే కొనసాగాలని కోరారు. ఈ మేరకు ఒక లేఖను సమర్పించారు. సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో సమావేశం తర్వాత ఎన్సీపీ కీలక నేత ప్రఫుల్ పటేల్ మీడియాతో మాట్లాడారు. మహాయుతి కూటమి ప్రభుత్వంలో తాము భాగస్వాములని తెలిపారు. అజిత్ పవార్ నిర్వహించిన పదవులను వీలైనంత త్వరగా భర్తీ చేయడానికి సరైన నిర్ణయం తీసుకోవాలని ఫడ్నవీస్‌ను కోరినట్లు చెప్పారు. మరోవైపు ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు పార్టీతోపాటు ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్నదని ప్రఫుల్ పటేల్ తెలిపారు. దుఃఖం నుంచి కోలుకోవడానికి అజిత్ పవార్ కుటుంబానికి కొంత సమయం ఇవ్వాలి. మేం త్వరలోనే సునేత్ర పవార్, ఇతర కుటుంబ సభ్యులతో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తామని అన్నారు.

# విలీనం దిశగా మహారాష్ట్ర ఎన్సీపీ

## నేడు ఎన్సీపీ శాసనసభా పక్ష సమావేశం



ముంబయి, జనవరి 30:మహారాష్ట్ర రాజకీయాల్లో ఎన్సీపీ చీలికవర్గంనేత అజిత్‌పవార్ మరణంతో ఆపార్టీలో నెలకొన్న శూన్యతను భర్తీచేసేందుకు పార్టీ కసరత్తుల ఁప్రారంభించింది. ఈ నేపథ్యంలో శనివారం ఎన్సీపీ శాసనసభా పక్ష సమావేశం జరుపుతోంది. అక్కడే శాసనసభ పక్ష నేతను ఎన్నుకోనున్నారు. అజిత్ పవార్ కుమారులు అంత ఆసక్తిగా లేకపోవడంతో ఆయన భార్య సునేత్రా పవార్‌నే నాయకురాలిగా ఎంచుకోవచ్చని వార్తలు వినిపిస్తున్నాయి. అజిత్ పవార్ నిర్వహించిన పోస్టులన్నీ ఎన్సీపీ తన ఖాతాలో వేసుకోవాలని భావిస్తోంది. ఇప్పటికే ఆ పార్టీ సీనియర్లు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌తో చర్చలు జరిపారు. అజిత్ పవార్ డిప్యూటీ సీఎంతో పాటు ఆర్థిక శాఖ, మరిన్ని శాఖలు నిర్వహించారు. ఆ శాఖలన్నీ ఎన్సీపీ నిలబెట్టుకోవాలని భావిస్తోంది. ఇదిలా ఉంటే ఎన్సీపీ తిరిగి విలీనం అయి ఒకే పార్టీకావాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి సెకండ్ వీక్‌లో ఒక ప్రకటన వచ్చే అవకాశం ఉన్నట్లు వర్గాలు చెబుతున్నాయి. ఇక ఎన్సీపీ ఒక్కటి చేసేందుకు రెండు వర్గాల నాయకులు వచ్చే వారం సమావేశం కానున్నట్లు వర్గాలు తెలిపాయి. నాయకత్వం వహించేందుకు ముగ్గురు రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. అజిత్ పవార్ భార్య సునేత్ర, సుప్రియ సూలే, ప్రఫుల్ పటేల్‌లో ఎవరొకరు నాయకత్వం వహించే అవకాశం ఉందని సమాచారం. 1999లో కాంగ్రెస్ నుంచి విడిపోయిన తర్వాత శరద్ పవార్ ఎన్సీపీని స్థాపించారు. అనంతరం అజిత్ పవార్ జూలై 2023లో పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. ఆయన వర్గం అధికార మహాయుతిలో చేరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ప్రఫుల్ పటేల్, ఛగన్ భుజ్‌బాల్, దిలీప్ వాల్సే పాటిల్ వంటి శరద్ పవార్ సన్నిహితులు కూడా అజిత్ పవార్ శిబిరంలో చేరారు.

# సంక్షిప్తంగా..

## సైబర్ నేరాల నిరోధంలో 'సంచార్ సాథీ' కి విశేష ఆదరణ



న్యూఢిల్లీ, జనవరి 30: సైబర్ నేరాలు, చోరీలను అరికట్టడానికి తీసుకొచ్చిన 'సంచార్ సాథీ' యాప్‌కు వినియోగదారుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని కేంద్రం వెల్లడించింది. ఇప్పటివరకు 2 కోట్లకు పైగా మంది సంచార్ సాథీని డౌన్‌లోడ్ చేసుకున్నట్లు కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. ఈ యాప్‌సాయంతో చట్టవ్యతిరేక, అనుమానాస్పద కార్యకలాపాలతో సంబంధం ఉన్న 1.52 కోట్ల మొబైల్ నంబర్లను బ్లాక్ చేశామన్నారు. మోసపూరిత సిమ్‌లతో ముడిపడి ఉన్న 27 లక్షల వాట్సప్ ఖాతాలతో పాటు ఇతర డిజిటల్ కమ్యూనికేషన్ ప్లాట్‌ఫామ్‌లను కూడా బ్లాక్ చేసినట్లు పేర్కొన్నారు. సైబర్ మోసాలను ఎదుర్కొనే బలమైన ఆయుధంగా సంచార్ సాథీ పనిచేస్తోందన్నారు.

## శబరిమల కేసు: నటుడు జయరామ్ విచారణ



తిరువనంతపురం, జనవరి 30: శబరిమల ఆలయంలో బంగారం తాపడాల అదృశ్యం కేసులో ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కుంభకోణానికి సంబంధించి ప్రముఖ నటుడు జయరామ్‌ను సిట్ విచారించినట్లు తెలుస్తోంది. చెన్నైలోని ఆయన నివాసంలో ఈ విచారణ జరిగినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఈ కేసులో ఉన్నికృష్ణన్ పొట్టి ప్రధాన నిందితుడిగా ఉన్న సంగతి తెలిసిందే. బంగారం పూత కోసం ఆలయం నుంచి తీసుకొచ్చిన తాపడాలతో 2019లో చెన్నైలో ఉన్నికృష్ణన్ నిర్వహించిన పూజల్లో జయరామ్ పాల్గొన్న వీడియోలు ఇటీవలే బయటికి వచ్చాయి. ఇందుకు సంబంధించి సిట్ ఆరా తీసినట్లు సమాచారం. ఉన్నికృష్ణన్‌తో కలిసి ఎన్నిసార్లు పూజల్లో పాల్గొన్నారని సిట్ బృందం నటుడిని ప్రశ్నించిందని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి.

## 'నిఫా'తో ప్రమాదం లేదు: ప్రపంచ ఆరోగ్య సంస్థ




జెనివా, జనవరి 30: భారత్‌లోని పశ్చిమబెంగాల్‌లో ఇటీవల ఇద్దరికి నిఫా వైరస్ సోకరడంతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం వైరస్ వ్యాప్తి కట్టడికి చర్యలు తీసుకుంటోంది. అయితే ఈ వైరస్ వ్యాప్తిపై భయంతో చైనా, థాయ్‌లాండ్, నేపాల్, మలేసియా, తైవాన్ వంటి దేశాలు తమ దేశంలోకి వచ్చే భారతీయులకు 'నిఫా' స్క్రీనింగ్ టెస్టులు ప్రారంభించాయి. దీనిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పందిస్తూ.. భారత్‌లో నిఫా ప్రభావం తక్కువగానే ఉందని.. దానితో ప్రమాదమేమీ లేదని ప్రపంచ దేశాలకు తెలిపింది. వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి భారత్ వేగవంతమైన చర్యలు తీసుకుంటుందని పేర్కొంది. ఈ వైరస్ వల్ల భారత్‌పై ప్రయాణ, వాణిజ్య పరిమితులు విధించాల్సిన అవసరం లేదని డబ్ల్యూహెచ్ఓ ప్రపంచ దేశాలకు సూచించింది. ఈ నిఫా వైరస్ ఒకరి నుంచి ఒకరికి వేగంగా వ్యాపిస్తున్నట్లు ఆధారాలు ఏమీ లేవని.. దీని వల్ల ప్రపంచ దేశాలకు ప్రమాదం తక్కువేనని తెలిపింది.

## ఇండిగో విమానానికి బాంబు బెదరింపు




అహ్మదాబాద్,జనవరి 30: కువైట్ నుంచి ఢిల్లీ కి బయలుదేరిన ఇండిగో విమానానికి బాంబు బెదిరింఎ సందేశం రావడం కలకలం సృష్టించింది. దాంతో విమానాన్ని అహ్మదాబాద్‌లో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. కువైట్ నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఇండిగో విమానం గాల్లో ఉండగానే టాయిలెట్‌లోని ఓ టిష్యూ పేపర్‌పై బాంబు బెదిరింపు సందేశం కనిపించింది. విమానంలో బాంబు పెట్టినట్లుగా ఆ టిష్యూ పేపర్‌లో రాసి ఉన్న బెదిరింపు సందేశాన్ని ఓ ప్రయాణికుడు గుర్తించి, సిబ్బందిని అప్రమత్తం చేశాడు. వెంటనే స్పందించిన పైలట్లు అహ్మదాబాద్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కి సమాచారం అందించి అత్యవసర ల్యాండింగ్ కోసం అభ్యర్థించారు. దాంతో విమానాశ్రయ అధికారులు ఫైర్ టెండర్లు, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాన్ని సురక్షితంగా దించారు.

# ప్రమాదాల నివారణలో బాపట్ల జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**బాపట్ల, జనవరి30, ప్రభాతవార్త:** ప్రమాదాల నివారణలో బాపట్ల జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం కలెక్టరేట్ లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు 78 ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్ గా గుర్తించామన్నారు. ఆ ప్రాంతాలలో ప్రమాదాల నివారపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వాహన ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణమే ఈడర్ యాప్



లో ప్రమాద వివరాలను నమోదు చేయాలని పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులకు సహాయపడే వారిని రహ్ వీర్ లుగా గుర్తించి రూ.25 వేలు ఆర్థిక బహుమతి ఇస్తున్నామన్నారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలన్నారు. రహదారి భద్రతఅధికారులు సమన్వయంతో పని చేయాలని, రహదారి ప్రమాదాల లను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. పోలీస్, రవాణా, రహదారులు భవనాల శాఖల ఇంజినీరింగ్, అయితే ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆన్ లైన్ యాప్ లో ప్రమాదాలను నమోదు చేయాలన్నారు. ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గత నెలరోజుల్లో 14 మంది మృతిచెందగా పదిమంది మరణపాయ స్థితిలో ఉన్నారన్నారు. మరో 18 మంది క్షతగాత్రులయ్యారని వివరించారు. ఈ సంఖ్య పూర్తిగా తగ్గేలా అధికారులంతా కలిసికట్టుగా పని చేయాలన్నారు.రహదారి ప్రమాదం జరిగినప్పుడు బాధితులకు సహాయపడే వారికి చట్ట ప్రకారం రక్షణ కల్పించాలన్నారు.వారిని ఎట్టి పరిస్థితుల్లో ఇబ్బందులకు గురిచేయరాదని పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాలలో రవాణా శాఖ నిర్వహించిన కార్యక్రమాలపై సూచనలు చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ జి.రామాంజనేయులు, జిల్లా రవాణాశాఖ అధికారి టి.కె.పరంధామరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, పి ఆర్ డిఈ ఎన్.రాజన్ బాబు, మునిసిపల్ కమీషనర్ జి.రఘునాథరెడ్డి, ఆర్ అండ్ బి డిఈ అరుణకుమారి, జాతీయ రహదారుల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ

**గుంటూరు క్రైమ్, జనవరి30, ప్రభాతవార్త:** గుంటూరు నగరంలోని ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన"కానూరు – జింఖానా మాతా – శిశు సంరక్షణ ఆసుపత్రి భవనం"ను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం ప్రారంభించనున్న సందర్భంగా, జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భద్రతా,బందోబస్తు ఏర్పాట్లను గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ట త్రిపాఠీ, గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, గుంటూరు నగర మున్సిపల్ కమిషనర్ కే. మయూర్ అశోక్, ఇతర అధికారులతో కలిసి గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ క్షేత్ర స్థాయిలో పర్యటించి సమగ్రంగా పరిశీలించారు. పోలీస్ పరేడ్ మైదానంలోని హెలిప్యాడ్ వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లు,ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలవడానికి విచ్చేసే ప్రముఖులకు అనుమతి ఇచ్చే విధానం తదితర అంశాలను ఐజీ తో కలిసి సమీక్షించారు.అదేవిధంగా, ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి ప్రాంగణంలో జరుగనున్న ప్రారంభోత్సవానికి సంబంధించిన ప్రదేశాలను జిల్లా కలెక్టర్ తో కలిసి పరిశీలించి, అక్కడ చేపట్టిన బందోబస్తు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి భద్రతా బందోబస్తు ఏర్పాట్లలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రతి స్థాయిలో విధులు



నిర్వహించాలని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ పోలీసు అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు జిల్లా అదనపు ఎస్పీలు జి.వి. రమణమూర్తి (అడ్మిన్), ఎ.టి.వి. రవికుమార్ (ఎల్ ఓ),ఏ. హనుమంతు(ఏఆర్), గుంటూరు శిదీవీ శ్రీనివాసరావు, ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, వెస్ట్ డీఎస్పీ అరవింద్, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్బీ సీఐ అలహరి శ్రీనివాస్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శీలీజు రమణ, కొత్తపేట సీఐ వీరయ్య తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజాదర్బార్ : ఆలపాటి


**తెనాలి మున్సిపాలిటీ జనవరి 30(ప్రభాతవార్త):** ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికి ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు, శాసనమండలి సభ్యులు, తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన,ప్రజాదర్బార్ (గ్రీవెన్స్)కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజలు తమ సమస్యలపై ఎమ్మెల్సీ ఆలపాటికి అర్జీలు అందించారు. అనంతరం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు,ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రజాదర్బార్ (గ్రీవెన్స్) కార్యక్రమంలో,ముఖ్యంగా ప్రజలు పెన్షన్ల కోసం, అలాగే ఇంటి స్థలాలు మంజూరు కోసం,వికలాంగుల పెన్షన్ కోసం, నూతన రేషన్ కార్డులు మంజూరు కోసం,ఇలా ప్రభుత్వపరమైన పలు సమస్యలపై వినతి పత్రాలు అందించడం జరిగిందని, వాటిని పరిశీలించి సంబంధిత అధికారులకు పంపి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేదిశగా ఆదేశాలు ఇస్తున్నామన్నారు.అలాగే పట్టణంలో గాని రూరల్ గ్రామాల్లో గాని ప్రధానంగా, నూతన రోడ్ల నిర్మించాలని, కొందరికి టిడ్కో గృహాలు ఇవ్వకుండానే బ్యాంకర్లు లోను కట్టమని ఒత్తిడి తీసుకొస్తున్నారని, మరికొందరు జగనన్న కాలనీలో ప్లాటు ఇచ్చారు కానీ అవి ఎక్కడ ఉన్నాయో మాకు చూపించలేదని, వస్తున్న ఫిర్యాదులను తక్షణమే పరిష్కరిస్తామని, రాష్ట్రంలో



కూటమి ప్రభుత్వ పాలనలో,ప్రజా సమస్యలకు ప్రాధాన్యమిస్తున్న, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యువ నాయకుడు లోకేష్ అలాగే పవన్ కళ్యాణ్ లకు ధన్యవాదాలు తెలుపుతున్నానని,అలాగే తెనాలి నియోజకవర్గంలో సమస్యలు లేకుండా చూడాలన్నదే తెలుగుదేశం పార్టీ నిర్ణయం అని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ తెదేపా అధ్యక్షులు మహమ్మద్ ఖుద్దూస్,రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్, ప్రధాన కార్యదర్శి వసంతం అశోక్, సహాయ కార్యదర్శి అకిసెట్టి వెంకటేశ్వరరావు, పలువురు సీనియర్ నాయకులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# పోలీసు సిబ్బంది వినతులను స్వీకరించిన ఎస్పీ

**గుంటూరు క్రైమ్, జనవరి30, ప్రభాతవార్త:** గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి శుక్రవారం జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న సిబ్బంది వినతులు,సమస్యల పరిష్కారార్థం పోలీస్ స్టాఫ్ గ్రీవెన్స్ మీటింగ్" నిర్వహించ



బడుతుంది.ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పోలీస్ సిబ్బందిని ప్రత్యక్షంగా కలుసుకొని వారి వినతులను స్వీకరించారు. సిబ్బంది సమస్యలను పూర్తిగా ఆలకించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యతా క్రమంలో చర్యలు తీసుకుంటానని తెలిపారు.శాఖాపరమైన చర్యల కారణంగా విధుల నుండి తప్పించబడిన సిబ్బందిని, తగిన విచారణ అనంతరం విధుల్లోకి తీసుకుంటామని ఎస్పీ చెప్పారు.పోలీస్ సిబ్బంది తమ వృత్తిపట్ల నిబద్ధత, నిజాయితీ, బాధ్యతతో పని చేస్తూ ప్రజలకు ఉత్తమమైన సేవలు అందించాలన్నారు. తద్వారా పోలీస్ శాఖ పట్ల ప్రజల్లో నమ్మకం మరింతగా పెంపొందుతుందని తెలిపారు.పోలీస్ సిబ్బందికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించి, వారు స్వేచ్ఛగా, మనస్ఫూర్తిగా విధులు నిర్వర్తించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వెల్లడించారు.

# వైకాపా కార్యాలయంలో ఘనంగా మహాత్మా గాంధీ వర్ధంతి

**మంగళగిరి, జనవరి 30 ప్రభాతవార్త :** మంగళగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జాతి పిత మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ హనుమంతరావు మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతి రెడ్డి వేమారెడ్డి హాజరై గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ వేమారెడ్డి మాట్లాడుతూ శుక్రవారం మహాత్మా గాంధీ ని స్పందించుకోవడం భారతదేశంలోని ప్రతి ఒక్క పౌరుడికి గర్వకారణం అని అన్నారు. భారతదేశానికి స్వాతంత్రం తెచ్చిన మహానుభావుల్లో మహాత్మా గాంధీ ముందు వరుసలో నిలిచారు. మహాత్మాగాంధీ సౌత్ ఆఫ్రికాలో బాలిస్టర్ చదివే సమయంలో ఒక సంఘటన ఆయనకు భారతీయులను ఆంగ్లేయులు అణచి వేసే పద్ధతి ఆయనను ఫలించి వేసింది. ఆయన స్వదేశానికి తిరిగి వచ్చి ఆంగ్లేయుల పైన స్వాతంత్రం కోసం ఎంతో కృషి చేశారు అని పేర్కొన్నారు. దేశ స్వాతంత్రం కోసం తమ జీవితాన్ని, ప్రాణాన్ని కూడా త్యాగం చేసిన మహానుభావుడు మహాత్మా గాంధీ అని



కొనియాడారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మేకా అంజిరెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ సంయుక్త కార్యదర్శి ఈపూరి ఆదామ్, రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చిన్న పోతుల దుర్గారావు, గుంటూరు జిల్లా దివ్యాంగ విభాగ అధ్యక్షులు బొక్క అగస్టిన్, గుంటూరు జిల్లా ఆక్టివిటీ కార్యదర్శి మల్లవరపు సుధారాణి, మంగళగిరి పట్టణ మహిళా విభాగ అధ్యక్షురాలు సంకే సునీత, మంగళగిరి మండల ప్రధాన కార్యదర్శి ఆర్దల చిన్నారి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రేతలను అరెస్టు చేసిన తెనాలి రూరల్ పోలీసులు

**తెనాలి టౌన్ జనవరి30(ప్రభాతవార్త):** అక్రమంగా గంజాయి సేవిస్తున్న ముగ్గురు వ్యక్తులతో పాటు,గంజాయిని విక్రయిస్తున్న మరొక ఐదుగురిని తెనాలి రూరల్ పోలీసులు శుక్రవారం మధ్యాహ్నం, మండల గ్రామం



పెదరావూరు సమీపంలోని, చిన్న మాలపల్లి వద్దగల ఎన్టీఆర్ కాలనీ ప్రాంతంలో అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం,తమకు అందిన సమాచారం మేరకు, తెనాలి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ షేక్.నాయబ్ రసూల్ మరియు సబ్ ఇన్స్పెక్టర్ కె.ఆనంద్ తమ సిబ్బందితో పెదరావూరు శివారు చిన్న మాలపల్లి వద్ద గంజాయి సేవిస్తున్న,మైనేని రోహిత్ చౌదరి,తుమ్మలపెంట లక్ష్మీ సూర్య ప్రకాష్,గంపల వెంకట శివనాగ మణికంఠ వీరితోపాటు గంజాయి అమ్ముతున్న వల్లగి విజయ్, వడ్లమూడి గోపి కిరణ్, దేవరకొండ మను శివశంకర్, దేవిశెట్టి బసవేశ్వర రావు,షేక్ జాకీర్ హుస్సేన్ లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 1600 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఎస్సై ఆనంద్ తెలిపారు.ఈ సందర్భంగా రూరల్ సీఐ నాయబ్ రసూల్ మాట్లాడుతూ,గంజాయి అమ్మటం మరియు కొనటం తో పాటుగా గంజాయి సేవించడం గురించి ప్రజలకు ఎలాంటి సమాచారం అందిన వెంటనే 100 లేదా 112 టోల్ ఫ్రీ నెంబర్లకు వెంటనే ఫోన్ చేసి తెలియపరచవలసిందిగా, అలాగే సమాచారాన్ని తెలియజేసిన వ్యక్తుల యొక్క వివరాలను గోప్యంగా ఉంచుతామని,వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, తెలియజేస్తున్నామన్నారు. గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, తెనాలి సబ్ డివిజన్ పోలీస్ అధికారి బి.జనార్ధన్ రావు పర్యవేక్షణలో,తెనాలి చుట్టుపక్కల ప్రాంతాల్లో "సంకల్పం"అనే కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ మరియు విద్యార్థులకు గంజాయి సేవించటం వలన కలిగే అనర్థాలను తెలియజేస్తూ, ప్రజలందరికీ తెలిసే విధంగా అవగాహన సదస్సులను విస్తృతంగా ఏర్పాటు చేస్తున్నామని, కావున ప్రజలు సహకరించాలని సిఐ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ కె. ఆనంద్,హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, సిబ్బంది రవి, పోతురాజు, ప్రసాదు, శ్రీనివాసరావు,రమేష్,ప్రదీప్ పాల్గొన్నారు.

# సిపిఎం సీనియర్ నాయకుడు సుబ్బారావు మృతి

## -పలువురు సిపిఎం నాయకులు సంతాపం

**కొల్లిపర, జనవరి 30 (ప్రభాతవార్త) :** సిపిఎం సీనియర్ నాయకుడు బత్తుల సుబ్బారావు (95)అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందాడు. సుబ్బారావు మృతదేహానికి శుక్రవారం సిపిఎం తెనాలి రూరల్ కార్యదర్శి ములకా శివసాంబిరెడ్డి,



మండల కార్యదర్శి కోట చంద్రశేఖర్, సిపిఎం నాయకులు జిలుగు ముక్కంటి, పిల్లి విజయభాస్కర్, బాపట్ల జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు బొనిగల అగస్టీన్, వైసిపి నాయకులు గుదిబండి జితేంద్రరెడ్డి, పిల్లి గంగాధర్, మంద్రు రాజులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

# ఘనంగా వైకాపా సమన్వయకర్త బలసాని జన్మదినోత్సవ వేడుకలు

**వట్టిచెరుకూరు, జనవరి30, (ప్రభాతవార్త) :** గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త బాలసాని కిరణ్‌కుమార్ జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. నియోజకవర్గ పరిధిలోని గుంటూరు రూరల్ మండలం ఏటుకూరు రోడ్డు బైపాస్ సమీపంలో ఉన్న పార్టీ కార్యాలయంలో శుక్రవారం భారీ సంఖ్యలో వైయస్ఆర్సీపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానుల నడుమ ఘనంగా నిర్వహించారు. గత ఎమ్మెల్యే ఎన్నికల్లో పత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా బాలసాని అతి స్వల్ప తేడాతో గెలిపించుకోలేకపోయామని, ఈ సారి



పక్కాగా 2029 ఎన్నికలలో పత్తిపాడు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిపించుకొని ఎమ్మెల్యే పదవిని గిఫ్ట్ గా అందిస్తామని వైయస్సార్సీపి కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు శపథం చేశారు. పత్తిపాడు నియోజకవర్గానికి కాబోయే ఎమ్మెల్యే బాలస్వామి అంటూ నినాదాలతో పార్టీ కార్యాలయం అంతా మారుమోగింది. కార్యక్రమంలో వట్టిచెరుకూరు, కాకుమాను, పెదనందిపాడు, గుంటూరు రూరల్, ప్రత్తిపాడు మండలాల వైసీపీ అధ్యక్షులు మన్నవ వీరనారాయణ, రవికుమార్, కాశీం పీరా, ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, హను మంతు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి నాదెండ్ల రామచంద్రయ్య, మండల డిప్యూటీ ఎంపీపీ, వైసిపి జిల్లా పంచాయతీ రాజ్ వింగ్ సెక్రటరీ బొడ్డపాటి శ్రీనివాసరెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు బుర్రి ప్రకాష్, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు నూరుల్లా, సర్పంచ్ లు భవనం వెంకట సుబ్బారెడ్డి, గుమ్మడి శ్రీనివాసరావు, ఎర్రాకుల గోపాలకృష్ణ, బుర్రి మోజేష్, ఎనుముల బాలస్వామి, తదితర వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ప్రారంభంలో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు.

# కుష్టు వ్యాధి రహిత స్థితిని సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం : డిఎల్‌పిఓ స్వరూపరాణి

**కొల్లిపర, జనవరి 30, (ప్రభాతవార్త) :** కుష్టు వ్యాధి రహిత స్థితిని సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని డిఎల్‌పిఓ స్వరూపరాణి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అత్తోటలో నివారించవచ్చునన్నారు. మండల వైద్యాధికారి స్నేహ మాట్లాడుతూ బ్యాక్టీరియా వల్ల వస్తుందన్నారు. ఇది చర్మం మరియు నరాలపై ప్రభావం చూపుతుందన్నారు. శరీరంపై




ఆరోగ్య సిబ్బందితో కలిసి కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ కుష్టు వ్యాధి అంటు వ్యాధి కాదన్నారు. కుష్టు వ్యాధికి సకాలంలో చికిత్స తీసుకుంటే వికలాంగతత్వాన్ని స్పర్శలేని మచ్చలుంటే కుష్టువ్యాధి లక్షణాలు సంక్రమించినట్లు భావించాలన్నారు. వ్యాధి నివారణ కోసం రోగులకు అవసరమైన మందులను ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సమిష్టిగా పని చేసి గ్రామాలను అభివృద్ధి చేద్దాం

## -ఎంపీపీ భీమవరపు పద్మావతి

**కొల్లిపర, జనవరి 30, (ప్రభాతవార్త) :** ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరూ కలసి కట్టుగా పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. తొలుత ప్రభుత్వ అధికారులతో శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు.





ఎంపీటీసీలు సభ్యులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంటేనే అంటు వ్యాదులు రాకుండా ఉంటాయన్నరు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎంపీడీవో విజయలక్ష్మీ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘ నిధులతో అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. స్వంత ఆదాయ వనరులతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చునని చెప్పారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు బొల్లిముంత పోతురాజు, తహశీల్దార్ సిద్దార్ధ, డిఎల్‌పిఓ స్వరూపరాణి, పరిపాలనాధికారి కిషోర్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో దానయ్య, సిడిపిఓ విజయగౌరి, వివిధశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# మాతా శిశు మరణాలను తగ్గించాలి

## -మండల వైద్యాధికారి స్నేహ

**కొల్లిపర, జనవరి 30 (ప్రభాతవార్త) :** మాతా శిశు మరణాలను తగ్గించడానికి ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకుంటుందని మండల వైద్యాధికారి స్నేహ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం



కొల్లిపర ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీలు నిర్వహించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా స్నేహ మాట్లాడుతూ గర్భిణీలు ఆసుపత్రిలోనే ప్రసవించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణీల విషయంలో అజాగ్రత్త వహిస్తే ఇబ్బంది పడేది ఆరోగ్య సిబ్బందేనన్నారు. అదే విధంగా పిల్లలకు వ్యాక్సిన్ వేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యాక్సిన్ వేసే ముందు తేదిని పరిశీలించి రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. వ్యాక్సిన్ వేసిన తరువాత అర్ధగంట వరకు బిడ్డ పరిస్థితిని పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ ప్రమీలారాణి, ఎంఎల్‌హెచ్‌సి రమ్యజ్యోత్న, ఎఎన్ఎం అనిత, డిఇఓ బొమ్ము కోటిరెడ్డి, ఆశా కార్యకర్తలు జ్యోతి, శేషారత్నం, సుబ్బులు తదితరులు పాల్గొన్నారు.

# ఏఎన్‌యు పరిశోధకురాలు విశ్వజకు అమెరికా ఆహ్వానం

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జనవరి30, ప్రభాతవార్త:** ఏఎన్‌యులోని సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగం పీహెచ్‌డి పరిశోధకురాలుకు రంగన్నగారి



విశ్వజ అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి ఆహ్వానం అందింది. అక్కడ ఫిబ్రవరి 6–8 తేదీల్లో జరుగనున్న ప్రతిష్టాత్మక హార్వర్డ్ కాలేజ్ ప్రాజెక్ట్ ఫర్ ఆసియన్ అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ (హెచ్‌పిఎఐఆర్) వార్షిక సమావేశంలో ఆమె పాల్గొననున్నారు. 50దేశాల నుంచి పరిశోధకులు, మేధావులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. హెచ్‌పిఎఐఆర్ అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన విద్యార్థి సంస్థ ఆసియా పసిఫిక్ ప్రాంతానికి సంబందించి కీలక ఆర్థిక ,రాజకీయ, సామాజిక సమస్యలపై సంభాషణకు ఈ సంస్థ ప్రపంచ వేదికను అందిస్తుంది. ఈ సమావేశంకు ప్రపంచ నాయకులు, విధాన రూపకర్తలు, పండితులుకు ఆతిథ్యం ఇచ్చే వారసత్వానికి ప్రసిద్ధి చెందింది. గత సమావేశాల్లో నోబెల్ శాంతి అవార్డీ, దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు కిమ్ డే జంగ్, మాజీ ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ బాన్ కీ మూన్, సింగపూర్ అధ్యక్షుడు ఎస్.ఆర్ నాథన్, ఆస్ట్రేలియా గవర్నర్ జనరల్ పీటర్ హూలింగ్‌వర్త్, జపాన్‌కు మాజీ అమెరికా రాయబారి జాన్ థామస్ పిషర్, గోల్డ్‌మన్ సాచ్స్ మాజీ అధ్యక్షుడు ఫిలిప్ మర్ఫీ వంటి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వజను వీసి ఆచార్య కె.గంగాధరరావు, అభినందించారు.ఈ ప్రత్యేకత విద్యా నైపుణ్యానికి నిదర్శనం, అలాగే వర్సిటీ ఒక గౌరవంగా పేర్కొన్నారు. విశ్వజ పరిశోధన పర్యవేక్షకులు ఆచార్య సరస్వతీ రాజు అయ్యర్ మాట్లాడుతూ ఇది విశ్వజ విద్యా ప్రయాణంలో ఒక మైలురాయిగా అభిర్ణించారు.

# గాంధీ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడవాలి

**కొల్లిపర, జనవరి 30 (ప్రభాతవార్త) :** గాంధీ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడవాలని ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు అన్నవరపు రమేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపరలో ఆర్యవైశ్య సంఘ నాయకులు మహాత్మగాంధీ 78వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ నాయకులు మహిళలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ శాంతి, అహింసలే ఆయుధాలుగా భారతావనికి స్వతంత్ర్యాన్ని సముపార్జించిన మహనీయుడు బాపూజీ అన్నారు. మహాత్మా గాంధీ ఆశయాలకు పునరంకితమవుదామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ కార్యదర్శి చుండూరు వెంకటరత్నం, వాసవి క్లబ్ అధ్యక్షురాలు చుండూరు



వెంకటసావిత్రి, వాసవి క్లబ్ కార్యవర్గ సభ్యులు మునగాల సుభద్రాదేవి, నాళం రమాదేవి, మునగాల శ్రీదేవి, మునగాల వరలక్ష్మీ, మునగాల నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు,

# లింగంగుంటపాలెంలో సివిల్ రైడ్స్ డే కార్యక్రమం

**కాకుమాను జనవరి 30( ప్రభాత వార్త):** మండల పరిధి లింగంగుంటపాలెం గ్రామం లో శుక్రవారం జరిగిన సివిల్ రైడ్స్ డే కార్యక్రమం లో మండల తహసీల్దార్ బి. వెంకటస్వామి పాల్గొని గ్రామంలో ప్రతి ఒక్కరు కుల, మత, వర్గ,విచక్షణ లేకుండా కలసి జీవించాలని సూచించారు.ప్రతి ఒక్కరికి జీవించే హక్కు ఉందని,చట్టం దృష్టిలో అందరు సమానమేనని, వివక్ష చూపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రెవిన్యూ, పంచాయతీ అధికారులు,గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ఇంటి పన్ను ఆన్‌లైన్‌లో చెల్లించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలి

## -డిఎల్‌పిఓ స్వరూపరాణి

**కొల్లిపర, జనవరి 30 (ప్రభాతవార్త) :** ఇంటి పన్నులను ఆన్‌లైన్‌లో చెల్లించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని డిఎల్‌పిఓ స్వరూపరాణి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ ఇంటి పన్ను వసూళ్ళ పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నూటికి నూరు శాతం వసూళ్ళు చేయాల్సిన



బాధ్యత పంచాయితీ కార్యదర్శులపై ఉందన్నారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి తగిన సమయంలో సేవలు అందించాలన్నారు. ప్రజల నుండి ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని చెప్పారు. కుటుంబ డేటా సేకరణ సర్వేను వేగవంతంగా చేయాలన్నారు. స్వచ్ఛ సంపద కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. సమావేశంలో ఎంపిడివో విజయలక్ష్మీ, పరిపాలనాధికారి కిషోర్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో దానయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌విఆర్‌జెసి ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు

**గుంటూరు విద్య జనవరి 30 ప్రభాతవార్త :** సత్యం, అహింస మార్గంలో నడిచి ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించిన మహామనిషి మహాత్మా గాంధీ అని, నేటి యువత గాంధీజీ చూపిన బాటలో నడిచి దేశాభివృద్ధిలో క్రియాశీలకంగా భాగస్వాములు కావాలని ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి మురళీమోహన్, డా. జగదీష్ కె. మద్దినేని పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ 78వ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక చౌడవరంలోని ఆర్.వి.ఆర్



జె.సి. ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల యెన్.ఎస్.ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో, కళాశాల సిబ్బంది మరియు విద్యార్థులు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. భారత స్వాతంత్రం కోసం అలుపెరగని పోరాటం చేసి, అహింసనే ఆయుధంగా మలిచిన జాతిపిత మహాత్మా గాంధీ త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించుకొని, ఆయన ఆశయాలను కొనసాగించాలని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ శ్రీ రాయపాటి గోపాల కృష్ణ, ట్రెజరర్ డా. కొండబోలు కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్ డీ డైరెక్టర్ డా. కె. రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డా. ఎన్.వి. శ్రీనివాస రావు, కళాశాల యెన్.ఎస్.ఎస్ యూనిట్స్ ప్రోగ్రాం ఆఫీసర్స్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# పిబ్రవరి 3న భగవాన్ శ్రీ సత్య షిర్డి సాయిబాబా మందిరం 20వ వార్షికోత్సవ మహోత్సవం

**మంగళగిరి, జనవరి 30, ప్రభాతవార్త :** మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి పెదవడ్లపూడి లోని భగవాన్ శ్రీ సత్య షిర్డి సాయిబాబా మందిరం 20వ వార్షికోత్సవ మహోత్సవం ఫిబ్రవరి 3వ తేదీ మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్, ఆలయ కమిటీ ఛైర్మన్ పాతూరి నాగభూషణం తెలిపారు. శుక్రవారం ఆలయం ఆవరణలోని కళ్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో వార్షికోత్సవానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాతూరి నాగభూషణం మాట్లాడుతూ... మన సంస్కృతి, సంప్రదాయాలే భావితరాలకు ఇచ్చే వారసత్వ సంపద అన్నారు. గత 20 సంవత్సరాలుగా పెదవడ్లపూడిలోని శ్రీ సత్య షిర్డి సాయిబాబా మందిరం వార్షికోత్సవ వేడుకలు దిగ్విజయంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఫిబ్రవరి మూడో తేదీ మంగళవారం భగవాన్ శ్రీ సత్య షిర్డి



సాయిబాబా 20వ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం 5:15 గంటలకు బాబా వారికి కాగడ హారతి, 6 గంటలకు పాలాభిషేకం, 8 గంటలకు బాబా వారికి అన్నాభిషేకం, ఉదయం 9 గంటల నుండి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగా సినీ సంగీత గాయనీ, గాయకుల చే సంగీత విభావరి, ప్రముఖ కళాకారులచే హాస్యవల్లరి, డూప్ స్టార్స్, టాకింగ్ డాల్, మిమిక్రీ తో పాటు ఇంకా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉదయం 8 గంటల నుండి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుందని, కావున భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాబా కృపకు పాత్రులు కాగలరని పాతూరి నాగభూషణం కోరారు. ఈ కార్యక్రమంలోమాజీ సర్పంచ్ చిట్టి బొమ్మ వెంకటేశ్వరరావు, రాష్ట్ర పద్మశాలియ సంఘం అధ్యక్షులు జగ్గారపు శ్రీనివాసరావు, పట్టణ బీజేపీ అధ్యక్షులు మునగాల నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు అన్నే శేషారావు, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# చింతలపూడి గ్రామంలో ఉన్నత భారత్ అభియాన్ కార్యక్రమం

**తాడేపల్లి,జనవరి 30,ప్రభాతవార్త :** ఉన్నత భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళగిరి నిర్మల ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో



శుక్రవారం దుగ్గిరాల మండలంలో 3వ రోజు చింతలపూడి గ్రామంలో విజయవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఉన్నత భారత్ అభియాన్ సెల్ సమన్వయంతో కళాశాల జాతీయ సేవా పథకం బృందం మద్దతుతో నిర్వహించారు.గ్రామ సర్వే ప్రారంభ కార్యక్రమానికి చింతలపూడి గ్రామ సర్పంచ్ తాడిబోయిన రామకృష్ణ విద్యార్థులను ఉద్దేశించి సర్వేను నిర్వహిస్తున్న టీమ్ ను జెండా ఊపి ప్రారంభించారు.కార్యక్రమంలో పెద్దలు కోలా వెంకటరమణ బాబు,ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీశెట్టి సూర్యనారాయణ,స్వర్ణ గ్రామ సిబ్బంది,తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ప్రొగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ రేఖా నరేష్‌బాబు ఉన్నత భారత్ అభియాన్ కార్యక్రమ లక్ష్యాలను వివరిస్తూ,విద్యార్థులు నిర్వహించబోయే సర్వేను సమర్థవంతంగా చేపట్టడానికి అవసరమైన సర్వే మార్గదర్శకాలు సూచనలు అందించారు.ఇంకా కార్యక్రమంలో కళాశాల ఫార్మాస్యూటికల్ రెగ్యులేటరీ అఫైర్స్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజు,స్టూడెంట్ కోఆర్డినేటర్స్ కె.ముస్తఫా,ఎం.బిందు ప్రియాంక,టి.సుస్మిత,జి.హర్షవర్ధన్, ఎం.హరినాథ్, దుగ్గిరాల ఎంపిడివో ఏ.శ్రీనివాసరావు,నిర్మల ఫార్మసీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రెవ.సిస్టర్ జి.నిర్మల జ్యోతి,ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పాములరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# షాదీఖానా నిర్మాణానికి రూ.2.85కోట్లు మంజూరు

**పొన్నూరు, జనవరి 30,ప్రభాతవార్త:** పట్టణంలోని 25వ వార్డులో షాదీఖానా నిర్మాణానికి ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ రూ.2.85కోట్లు మంజూరు చేయించడం పట్ల ముస్లీం నాయకులు, కార్యర్తలు, మహిళలు పెద్ద ఎత్తున నరే ంద్రకుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా షేక్ జాజిసాహెబ్ మాట్లాడుతూ 2014-19 టిడిపి



హయాంలోనే ముస్లీం మైనార్టీల అవసరాలను గుర్తించిన ఎమ్మెల్యే షాదీఖానా నిర్మాణానికి 35సెంట్లు కేటాయించి సుమారు రూ.3.50కోట్ల విలువైన భూమిని కేటాయింపచేశారన్నారు. అదేసమయంలో భవన నిర్మాణానికి రూ.1.20కోట్లు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అర్థాంతరంగా పనులు ఆగిపోయాయి. మళ్ళీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నరేంద్రకుమార్ రూ.2.85కోట్లు కేటాయించి ముస్లీంల పట్ల చిత్తశుద్ధిని చాటుకున్నారన్నారు. ఎమ్మెల్యే చొరవను నాయకులు, కార్యకర్తలు, ముస్లీం మహిళలు తదితరులు అభినందించారు.

# జడ్పీ పాఠశాల మరమ్మతులకు విరాళం అందజేత

**పెదనందిపాడు జనవరి 30 (ప్రభాతవార్త)** పెదనందిపాడు జడ్పీ పాఠశాల లోని పురాతన భవనం మరమ్మతులకు పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అప్నా



జడ్పీహెచ్ఎస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ కోదండరామయ్య. సెక్రటరీ గుంటుపల్లి అప్పారావు. కోశాధికారి మక్కెన జవహర్ రాణి లకు. అబ్బినేని గుంట పాలెం కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు ఇడపలపాటి చంద్రయ్య తన భార్య సరస్వతి గుర్తింపుగా లక్ష రూపాయలు చెక్కును అందజేశారు. దాత చంద్రయ్య మాస్టారు 1982 నుండి 95 వరకు ఈ పాఠశాలలో సైన్స్ ఇంగ్లీష్ ఉపాధ్యాయులుగా పనిచేశారు. తను ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన పాఠశాల అభివృద్ధికి తాను సహకరించటం ఎంతోసంతోషకరంగా ఉందన్నారు. తమ స్వగ్రామమైన అబ్బినేని గుంట పాలెం లో నిర్మించిన కళ్యాణ మండపం అభివృద్ధికి పది లక్షలు విరాళం అందజేశారు. శివాలయం నిర్మాణంకు మూడులక్షలు విరాళం అందజేశారు. వివేకాక పలు రకాల అభివృద్ధి కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందిస్తూ ఈ ప్రాంత ప్రజల మన్ననలు పొందుతున్నారు. అప్నా జడ్పీహెచ్ఎస్ హెల్పర్ అసోసియేషన్ సభ్యులు దాత ఇడ పలపాటి చంద్రయ్యను పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు.

# ఇతరులకు ఉద్యోగం ఇచ్చే ఎంట్రీప్రెన్యూర్‌గా ఎదగాలి

## ఏపీ మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల

**వట్టిచెరుకూరు, జనవరి 30, ప్రభాతవార్త :** విద్యార్థులు ఉద్యోగం చేసే ఆలోచనలు మార్చుకొని ఉద్యోగం ఇచ్చే ఎంట్రీప్రెన్యూర్ గా ఎదగాలని ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు




ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని వింజనం పాడు గ్రామ పరిధిలో ఉన్న కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం డేటా సైన్స్ విభాగం నందు టెక్నో ఫ్యూచర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ వారి సౌజన్యంతో 12 గంటల జాతీయ స్థాయి యాత్రాన్ నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో కళాశాల ఛైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు పాల్గొని మాట్లాడుతూ..ఈ విధమైన హ్యాక్ థాన్ ద్వారా విద్యార్థులలో నూతన ఆవిష్కరణలపై ఆసక్తి కనపరచాలని సూచించారు. ఈ యాత్రాన్ ద్వారా ఇన్నోవేషన్ కల్చర్ మరియు టెక్నాలజీ మీద దేశవ్యాప్తంగా 255 గ్రూపుల నుండి 40 గ్రూపులను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరు డొమైన్లు టూరిజం, హెల్త్ కేర్, ఎడ్యుకేషన్, అగ్రికల్చర్, సివిక్ సిస్టం అండ్ ఓపెనింగ్ ఇన్నోవేషన్ లపై విద్యార్థులు నూతన ఆవిష్కరణలు ప్రదర్శించారు. గౌరవ అతిథిగా హైదరాబాద్ సిబి ఐటి కాలేజ్ ప్రొఫెసర్ డాక్టర్ స్వామిదాస్ పాల్గొని ఉదాహరణలతో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా తమ అమూల్యమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా విజయ్ గణేష్ అనే విద్యార్థి తన స్టార్ట్ అప్ ప్రొడక్ట్ ను లాంచ్ చేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కోయి శేఖర్, ప్రిన్సిపల్ డాక్టర్ పి. బాబు, అకాడమిక్ డైరెక్టర్ కె. హరిబాబు, విభాగాధిపతి డాక్టర్ పి.భానుప్రకాష్, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**వట్టిచెరుకూరు, జనవరి 30, ప్రబాతవార్త :** మహాత్మా గాంధీ ఆశయం మేరకు కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కాట్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ జి.వెంకటేశ్వరరావు, డాక్టర్ దివ్యశ్రీ పేర్కొన్నారు. మండలంలోని కాట్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రపంచ కుష్టు వ్యాధి దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు దివ్యశ్రీ, వెంకటేశ్వరరావులు పాల్గొని మాట్లాడుతూ..ప్రపంచ కుష్టు వ్యాధి దినోత్సవం ప్రతి సంవత్సరం జనవరి చివరి ఆదివారం నాడు మరియు భారతదేశంలో జనవరి 30వ తేదీన (మహాత్మా గాంధీ వర్ధంతి) జరుపుకుంటారని తెలియజేశారు. ప్రపంచ కుష్టి వ్యాధి దినోత్సవాన్ని 1954లో ఫ్రెంచ్ మానవతావాది, పాత్రికేయుడు రౌండ్ ఫోలెరో ప్రారంభించారని పేర్కొన్నారు. ఈ వ్యాధి సోకిన వారి పట్ల కరుణ, చికిత్స మరియు సామాజిక పునరావాసం గురించి అవగాహన కల్పించడమే ఈ



దినోత్సవ ముఖ్య ఉద్దేశం అన్నారు. మనదేశంలో మహాత్మా గాంధీ కుష్టురోగుల పట్ల చూపిన ప్రేమకు నివాళిగా ఆయన వర్ధంతి రోజున కుష్టు వ్యాధి నిర్మూలన దినోత్సవం లేదా స్పర్శ్ కుష్టు అవగాహన ప్రచారం గా పాటిస్తారని చెప్పారు. మహాత్మా గాంధీ ఆశయాలను గౌరవిస్తూ కుష్టు వ్యాధి బాధితులకు మద్దతుగా వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. సమాజంలో ఎవరైనా చర్మంపై స్పర్శ కోల్పోయి మచ్చలు కలిగి ఉంటే, వాటిని తాకినప్పుడు నొప్పి కలగనప్పుడు దానిని కుష్ఠ వ్యాధిగా నిర్ధారించాలన్నారు. కుష్టు వ్యాధి కారణంగా అంగవైకల్యం ఏర్పడిన వ్యక్తులు ఉంటే వారిపట్ల ప్రత్యేక శ్రద్ధవహించి వారికి సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలలో పూర్తి చికిత్స తీసుకునేలా సూచనలు అందించాలని సూచించారు. వ్యాధిగ్రస్తులను సొంత కుటుంబ సభ్యులుగా భావించి వారికి అవసరమైన సలహాలు అందించి చికిత్సలు అందేవిధంగా కృషి చేయాలన్నారు. వారిపట్ల ఎలాంటి వివక్ష చూపరాదని, ఆత్మ గౌరవానికి భంగం కలిగించకుండా ప్రవర్తించాలని కోరారు. కుష్టు వ్యాధి పూర్తిగా నయం చేయదగినదని సకాలంలో చికిత్స పొందితే అంగవైకల్యాన్ని నివారించవచ్చని వివరించారు. కుష్టు వ్యాధి పట్ల ప్రజలలో అవగాహన పెంచే విధంగా సందేశాలను విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. మహాత్మా గాంధీ కలలు కన్న విధంగా భవిష్యత్తులో కుష్టు వ్యాధి రహిత భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ వ్యాధి మైకో బ్యాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియా వల్ల వస్తుందని కానీ ఇప్పుడు దీనికి బహుళ ఔషధ చికిత్స (ఎండిటి) అందుబాటులో ఉందని వివరించారు. కార్యక్రమంలో సి హెచ్ ఓ కె. విజయసుశీల, పి.హెచ్.ఎన్ లక్ష్మీకుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు ఎం. వెంకటేశ్వరరావు హెచ్ వి. రత్నప్రియ, ఏఎన్ఎంలు, ఎంఎల్ హెచ్పిలు, కార్యాలయ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణ అలవాట్లలో మార్పు స్కూట్ సర్వే వెల్లడి

**విజయవాడ, జనవరి 30, ప్రభాతవార్త :** దక్షిణ భారతదేశం నుండి కొత్తప్రదేశాలకు విహార యాత్రలు చేసే ప్రయాణికులకు అంతర్జాతీయ గమ్యస్థానాల పట్ల పెరుగుతున్న అభిరుచిని తమ తాజా ప్రయాణ ట్రెండ్ నివేదిక "సౌత్ ఇండియా ట్రావెల్ ఇన్సైట్స్ 2025" సర్వే వెల్లడిస్తుందని స్కూట్ ఎయిర్లైన్స్ ప్రతినిథులు తెలిపారు. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, తిరువనంతపురం విశాఖపట్నంలలో సర్వే చేశామన్నారు.

# నేడే సామాజిక పింఛన్ల పంపిణీ



వట్టిచెరుకూరు, జనవరి 30, ప్రభాతవార్త : సామాజిక పింఛన్ పంపిణీ దారులకు ఫిబ్రవరి ఒకటవ తేదీ ఆదివారం రావడంతో జనవరి 31వ తేదీన లబ్ధిదారులందరకు పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని ఎంపీడీవో రమేష్ బాబు శుక్రవారం తెలిపారు. ఫిబ్రవరి1కి బదులుగా ఒకరోజు ముందుగా జనవరి 31వ తేదీన జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 7 గంటలు నుంచి గ్రామ సచివాలయ సిబ్బంది లబ్దిదారుల ఇళ్లకు వచ్చి పింఛన్లను అందజేస్తారని తెలిపారు. జనువరి నెలకు గాను మండలంలో 6845 మంది పింఛన్ దారులకు రూ.2కోట్ల 93లక్షల 71వేలు విడుదల చేసినట్లు చెప్పారు. ఈ నగదును 30వ తేదీన బ్యాంకు ఖాతాల నుండి డ్రా చేయడం జరిగిందన్నారు. సంబంధిత సచివాలయాల సిబ్బంది నేడు విత్‌డ్రా చేసిన నగదును పింఛన్ దారులకు అందిస్తారని చెప్పారు. నేడు పింఛన్ తీసుకుని వారు ఫిబ్రవరి రెండవ తేదీన సచివాలయ సిబ్బంది నుండి వారి పింఛన్ ను తీసుకోవచ్చని తెలియజేశారు. పింఛన్దారులకు నగదు పంపిణీ విషయంలో సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# నేటి నుంచి విజ్ఞాన్స్ బాల మహోత్సవ్

## -రాష్ట్రస్థాయిలో చిన్నారులకు మెగా పోటీలు -ముఖ్య అతథులుగా జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

**పొన్నూరు, జనవరి 30,ప్రభాతవార్త:** విజ్ఞాన్స్ యూనివర్సిటీలో చిన్నారుల ప్రతిభను వెలికి తీసేందుకు నిర్వహిస్తున్న రెండో ఎడిషన్ రాష్ట్రస్థాయి బాల మహోత్సవ్ కార్యక్రమం విజ్ఞాన్ బాల



మహోత్సవ్-2కే26ను శనివారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు వర్సిటీ ఇంచార్జివీఇ కేవీ క్రిష్ణకిషోర్ శుక్రవారం తెలిపారు. ఈ పోటీలను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయనున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఫిబ్రవరి 2న జరిగే ముగింపు వేడుకలకు ముఖ్య అతిధిగా విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లవరపు సూర్యతేజ(ఐఆర్ఎంఎస్) హాజరవుతారని చెప్పారు. క్రిష్ణకిషోర్ మాట్లాడుతూ చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారికి సరైన వేదిక కల్పించడమే ఈ బాల మహోత్సవ్ ప్రధాన లక్ష్యమన్నారు. విద్యతోపాటు క్రీడలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ప్రతిభకనబరిచే అవకాశాన్ని ఈ వేడుక కలి ్పసు ందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థులంతాఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. బాల మహోత్సవ్‌కు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయినట్లు చెప్పారు.

# 2న పాసుపుస్తకాలు పంపిణీ : తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్

**పొన్నూరు, జనవరి 30,ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని భూములన్నింటిని రీ సర్వే చేసేందుకు శ్రీకారం చుట్టిందని, అందులో భాగంగా సర్వే పూర్తయిన గ్రామాల్లో నూతన పట్టాదారు ఈ పాసుపుస్తకాల పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు తహశీల్దార్ మహమ్మద్



జియావుల్ హక్ తెలిపారు. మండలంలో పలు గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వేని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ మాట్లాడుతూ మండలంలో మొదటి విడత రీ సర్వే పూర్తయిన దండమూడి గ్రామంలో ఈ పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఫిబ్రవరి రెండో తేదీ ఉదయం 10గంటల నుంచి గ్రామ సచివాలయంలో పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. అదేవిధంగా పచ్చలతాడిపర్రు గ్రామంలో మూడో తేదీన గ్రామసచివాయలంలో పంపిణీ చేస్తామన్నారు. దండమూడి గ్రామంలో 796పుస్తకాలకు గాను 681మందికి పాసుపుస్తకాలు అందజేస్తామన్నారు.మిగిలిన 115పుస్తకాలు ఆయా రైతుల వ్యక్తిగత సమాచారం పూర్తిగా అందుబాటులో లేని కారణంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిని వీలైనంత త్వరగా వివరాలను సేకరించి మార్చి నెలలో ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. అదే విధంగా పచ్చలతాడిపర్రు గ్రామంలో 787పుస్తకాలకు గాను 582మందికి ఫిబ్రవరి మూడవ తేదీన పాసుపుస్తకాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. మిగిలిన 205పుస్తకాలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని కూడా త్వరితగతిన విచారణ చేసి, వివరాలను సేకరించి అందజేస్తామన్నారు. ఆయా గ్రామాల రైతులు సచివాలయానికి వచ్చి పాసుపుస్తకాలను పొందాలని తహశీల్దార్ కోరారు.

# అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు వస్తుంది : అర్చకస్వామి రఘు

**పొన్నూరు, జనవరి 30,ప్రభాతవార్త:** విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన వ్యక్తులు ఎవరైనా గుర్తింపబడతారని, అందుకు ఉదాహరణే కార్యనిర్వహణాధికారి ఎన్‌విఎన్ మల్లేశ్వరి అని శ్రీ గోవర్ధనగిరి స్వామి దేవాలయం వంశపారంపర్య అర్చకస్వామి రఘు అన్నారు. తెనాలి, పొన్నూరు తదితర గ్రూప్-1 దేవాలయాల కార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వహిస్తున్న ఎన్‌విఎన్ మల్లేశ్వరి ఇటీవల జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ కార్యనిర్వహణాధికారిగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పలు దేవాలయాల సిబ్బంది మల్లేశ్వరిని ఘనంగా సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా రఘు



మాట్లాడుతూ మల్లేశ్వరి గ్రూపు దేవాలయాల్లో పనిచేస్తూ ఆయా దేవాలయాల అభివృద్ధికి కృషి చేయడంతోపాటు, భక్తుల మనోభావాలకు తగ్గట్లుగా పనిచేసి భక్తుల, అధికారుల మన్ననలను అందుకున్నారన్నారు. ఆమె చేసిన అభివృద్ధి కార్యక్రమాలే ఆమెకు అవార్డు వరించేందుకు కారణమయ్యాయని పలువురు భక్తులు కూడా చెప్పారు. మల్లేశ్వరిని దుశ్శాలువాలతో, బొకేలతో, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంల జయదేవ్, కొప్పాక రవికిరణ్, మేడూరి శ్రీనివాస్, అనంతాచార్యులు, రామాచార్యులు, భట్టాచార్యులు, మాధవ, కేశవ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞాన్స్ యూనివర్సిటీ విద్యార్థినికి పీహెచ్‌డీ పట్టా

**పొన్నూరు, జనవరి 30,ప్రభాతవార్త:** చేబ్రోలు మండలం, వడ్లమూడి విజా ్నన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలోని డిపార్టుమెంట్ ఆఫ్ కెమిస్ట్రీకి చెందిన షేక్



షాజియా అమ్రీన్ అనే విద్యార్థినికి గురువారం యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసినట్లు ఇంచార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్ మాట్లాడుతూ షేక్ షాజియా అమ్రీన్ ఎక్స్‌ప్లోరింగ్ అడ్సార్షన్ ప్రాసెస్ ఫ్రమ్ అల్యూమినోసిలికేట్ బేస్డ్ నానోక్లేస్ ఫర్ క్యాటయానిక్ డై రిమూవల్ టు ఎగ్-షెల్ డెరైవ్డ్ అడ్సార్బెంట్ ఫర్ డ్రగ్ అడ్సార్షన్ అనే అంశంపై పరిశోధనచేసి డాక్టరేట్ డిగ్రీని సాధించారని తెలిపారు. ఈ పరిశోధనకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని డిపార్టుమెంట్ ఆఫ్ కెమిస్ట్రీ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆనంద్‌రూప్ గోస్వామి గైడ్‌గా వ్యవహరించారని తెలిపారు. ఈ అడ్సార్షన్ పరిశోధన ప్రకృతిలోని నానోక్లే ఉపయోగించి మన నీటి జలాలు నుండి విషపూరిత పరిశ్రమ రంగుల మలినాన్ని తొలగించడంల సహాయపడుతుంది. అలాగే,గుడ్డు పొర వ్యర్థాలను ఉపయోగించి పార్కిన్సన్స్కి వ్యాధి సంబంధించిన ఔషధం కోసం అడ్సార్బెంట్‌గా ఉపయోగించారు. తద్వారా రోగులు మందులను మరింత సమర్థవంతంగా శోషించడం,అవసరమైన కాల్షియం పొంద వచ్చు. ఈ పరిశోధనలతో పర్యావరణహిత సాధనాలు కాలుష్యాన్ని తగ్గించడానికి తక్కువ ఖర్చుతో సహకరించే మార్గాన్ని, ఆరోగ్య సంరక్షణను మెరుగుపరచే అవకాశాన్ని అందిస్తాయి. అనంతరం పీహెచ్‌డీ పట్టా పొందిన షేక్ షాజియా అమ్రీన్‌ను విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్, నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, వివిధ విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

# ఘనంగా మహాత్ముని వర్ధంతి వేడుకలు

**పొన్నూరు, జనవరి 30,ప్రభాతవార్త:** వాసవి స్వర్ణపురి కపుల్స్ క్లబ్, వాసవి వనితక్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలోని మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి




నివాళులర్పించారు. మహాత్ముని కృషిని, ఖ్యాతిని, జీవిత చరిత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో బాపూజీ హిందీ విద్యాలయం ప్రిన్సిపాల్ ఆలపాటి శ్రీనివాస్, పాదర్తి సాంబశివరావు, సుబ్బయ్య, వీఎన్ బాలశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పసుపులేటి మురహరి మృతి

**చేబ్రోలు(పొన్నూరు), జనవరి 30,ప్రభాతవార్త:** చేబ్రోలు మండల పరిషత్ ఉపాధ్యక్షులుగా విధులు నిర్వహిస్తున్న పసుపులేటి శ్రీనివాసరావు అన్న పసుపులేటి మురహరి(77) శుక్రవారం తుది శ్వాస విడిచారు. ఇటీవల కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ తుది శ్వాస విడిచారు.



విషయం తెలుసుకొన్న వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ చేబ్రోలు వెళ్ళి మురహరి మృతదేహంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. మృతికి గల కారణాలను వైస్ ఎంపిపి శ్రీనివాసరావును అడిగి తెలుసుకొన్నారు. అంబటి వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులున్నారు.

# మహాత్మాగాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలి

## -వైకాపా మండల పార్టీ అధ్యక్షుడు చింతలపూడి

**పొన్నూరు, జనవరి 30,ప్రభాతవార్త:** దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన జాతిపిత మహాత్మాగాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైకాపా మండల పార్టీ అధ్యక్షుడు చింతలపూడి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన మాట్లాడారు. శాంతి, త్యాగం,అహింసా



అనే మార్గాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం తేవడంలో మహాత్మాగాంధీ ప్రధాన భూమిక పోషించారన్నారు. ఆ మహనీయుని ఆశయ సాధనకు ప్రతి యొక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గేరా సంజీవ్, గోపిశెట్టి వాసు, పీర్‌సాహెబ్, వేముల మూర్తిరాజు, షేక్ మౌలాలి, అక్కిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జాతిపిత మార్గం అనుసరణీయం

## -ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు బాపనపల్లి

**పొన్నూరు, జనవరి 30,ప్రభాతవార్త:** జాతిపిత మహాత్మాగాంధీ మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీయం, ఆచరణీయమని ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు బాపనపల్లి ప్రభాకర లక్ష్మీ ప్రసాదరావు అన్నారు. నిడుబ్రోలు



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్మాగాంధీ శాంతియుతంగా పోరాటం చేసిన దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన విషయాన్ని ప్రతి ఒక్కరూ గురి ్తంచాలన్నారు. అహింసా మార్గం ద్వారానే ఏదైనా సాధించవచ ్చని మహాత్మాగాంధీ నిరూపించారన్నారు. ఈ కార్యక్రమలో పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# నేటి నుండి గాయత్రీ మహా యజ్ఞం

**పొన్నూరు, జనవరి 30,ప్రభాతవార్త:**

పొన్నూరు గాయత్రీ పరివార్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీ, ఫిబ్రవరి ఒకటో తేదీన 24వ వార్షికోత్సవం సందర్భంగా గాయత్రీ మహా యజ్ఞాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అందులో భాగంగా శనివారం ఉదయం కలశ శోభాయాత్ర,సాయంత్రం 2400దీపములతో దీపమహాయజ్ఞం జరుగుతుందన్నారు. ఆదివారం 24కుండముల గాయత్రీ మహాయజ్ఞం జరుగుతుందన్నారు. పట్టణంలోని అతి పురాతనమైన దేవాలయం శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావనారాయణస్వామి దేవాలయం ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని గాయత్రీమాత అమ్మవారికి కృపకు పాత్రులు కావాలని కోరారు. అన్న సంతర్పణ కార్యక్రమం ఉంటుందన్నారు.

31-1pg 12 GNT_31-1pg10.qxd 30/Jan/26 9:42 PM Page 1





## ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో గాడెక్కి, పీర్స్‌కు మిక్స్‌డ్ డబుల్స్ కిరీటం

### ఫైనల్స్‌కు అల్కరాజ్

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మిక్స్‌డ్ డబుల్స్ కిరీటాన్ని గాడెక్కి-పీర్స్ జోడీ దక్కించుకుంది. ఇదే సమయంలో స్పెయిన్ సంచలనం, వరల్డ్ నంబర్ 1 కార్లోస్ అల్కరాజ్ ఫైనల్లోకి అడుగుపెట్టాడు. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియన్లు ఒలివియా గాడెక్కి-జాన్ పీర్స్ 4-6, 6-3, 10-8 తేడాతో ఫ్రెంచ్ జంట క్రిస్టినా మ్లాడెనోవిక్-మాన్యుయెల్ గినార్డ్‌ను ఓడించి, 37 సంవత్సరాల తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను నిలబెట్టుకున్న తొలి జంటగా నిలిచారు. తొలి గేమ్‌లో మ్లాడెనోవిక్-గినార్డ్ పీర్స్‌ను బ్రేక్ చేసి ఆధిక్యాన్ని పదిలం చేసుకున్నారు. కానీ ఆస్ట్రేలియన్లు 2-2తో సమం చేయడానికి తీవ్ర ప్రయత్నంలో తిరిగి పోరాడారు. సెట్ కోసం సర్వ్ చేస్తున్నప్పుడు మ్లాడెనోవిక్ బ్రేక్ అయ్యాడు. కానీ ఫ్రెంచ్ జంట గినార్డ్ సర్వ్‌లో 6-4తో దాన్ని ముగించింది. ఈ ఆస్ట్రేలియన్ ద్వయం రెండవ సెట్‌లో స్థిరపడి, ప్రారంభంలోనే బ్రేక్ వేసి 3-1 ఆధిక్యంలోకి వెళ్ళి సర్వ్‌ని నిలబెట్టుకోగలిగింది. పీర్స్ రెండవ సెట్‌ను ఏస్‌తో 10 పాయింట్ల టైబ్రేక్‌కు బలవంతం చేశాడు. మ్లాడెనోవిక్ తొలి డబుల్ ఫాల్ట్ రెండవ సర్వ్‌లో ఫ్రెంచ్ ద్వయం 7-5తో ఆధిక్యంలోకి వెళ్లే ముందు, సర్వింగ్ జట్టు వరుసగా ఐదు పాయింట్లు కోల్పోవడంతో ముగింపుకు దారితీసింది. అలాగే సెమీఫైనల్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్‌ను ఓడించి ఫైనల్‌లోకి అల్కరాజ్ చేరుకున్నాడు. హోరాహోరీ సాగిన ఈ పోరులో 6-4, 7-6(5), 6-7 (3), 6-7 (4), 75 తేడాతో అల్కరాజ్ విజయం సాధించాడు.



# స్వదేశంలో టీమిండియాకు షాక్

## టీ20ల్లో 210 + లక్ష్య ఛేదన అంటేనే టెర్రర్

### అతిపెద్ద పరాజయాల లిస్ట్‌లో విశాఖ అగ్రస్థానం

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ జట్టు సాధారణంగా స్వదేశంలో అద్భుతమైన ప్రదర్శనలతో ప్రత్యర్థులను మట్టికరిపిస్తుంది. అయితే కొన్ని సందర్భాల్లో మాత్రం నిరాశపరిచే రీతిలో పరాజయాలు కూడా ఎదురయ్యాయి. ప్రధానంగా పొట్టి ఫార్మాట్‌లో టీమిండియా దూసుకుపోతున్నప్పటికీ, త్వరలో ప్రారంభం కాబోతోన్న టీ20 వరల్డ్ కప్ ముంగిట ఓ అంశం కలవరపెడుతోంది. టీ20ల్లో ఇప్పటికే భారత్ వరుసగా 11 సిరీస్‌ల్లో విజయం సాధించి జోష్‌లో ఉంది. అయితే 210+ పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో మాత్రం తడబాటుకు గురవుతోంది. జట్టులో స్టార్ ప్లేయర్లు ఉన్నప్పటికీ టీ20 చరిత్రలో టీమిండియా ఇప్పటిదాకా 210 పరుగులకు పైగా లక్ష్యాన్ని ఒక్కసారి కూడా ఛేదించలేదు. దీంతో ఇది వరల్డ్ కప్ ముంగిట భారత్‌కు పెద్ద బలహీనత అయినా ఈ సారి అటువంటి అవకాశం ఇవ్వకుండా దూకుడుగా ముందుకు వెళ్లాలనే పట్టుదలతో ఉంది. భారత్ టీ20ల్లో ఇప్పటిదాకా 118 సార్లు ఛేజ్ చేసింది. అందులో 80 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. ఇందులో ఒక్క మ్యాచ్‌లో కూడా 210+ టార్గెట్ లేకపోవడం గమనార్హం. మరో 34 టీ20ల్లో ఓటమి పాలైంది. మిగిలిన నాలుగు మ్యాచ్‌ల ఫలితాలు తేలలేదు. ముఖ్యంగా భారీ పరుగుల తేడాతో ఓడిన మ్యాచ్‌లు భారత క్రికెట్ చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిపోయాయి. సొంతగడ్డపై భారీ పరాజయాల జాబితా ఓసారి చూస్తే 2025లో ముల్లాన్పూర్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో భారత జట్టుకు స్వదేశంలో పరుగుల పరంగా ఎదురైన అతిపెద్ద పరాజయంగా నిలిచింది. ఈ మ్యాచ్‌లో భారత్ 51 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్ ఫలితం భారత అభిమానులకు పెద్ద షాక్ అనే చెప్పాలి. ఇక టీమిండియా అతి పెద్ద ఓటముల్లో ఐదు టీ20 సిరీస్ భాగంగా ఈ నెల 28న విశాఖలో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్ రెండో స్థానంలో ఉంది. ఈ మ్యాచ్‌లో భారత్ 50 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. ఈ ఓటమి టీమిండియా ప్రదర్శనపై ప్రశ్నలు లేవనెత్తింది. 2022లో ఇండోర్లో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 49 పరుగుల తేడాతో ఓడింది. అప్పట్లో బ్యా టింగ్, బౌలింగ్ రెండింటిలోనూ జట్టు విఫలమైంది. 2016లో నాగ్పూర్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 47 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. న్యూజిలాండ్‌మంచి ప్రదర్శనతో భారత్‌పై ఆధిపత్యం చెలాయించింది. అలాగే 2017లో రాజ్‌కోట్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 40 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. స్వదేశంలో వరుసగా న్యూజిలాండ్ చేతిలో ఎదురైన ఈ ఓటములు అప్పట్లో పెద్ద చర్చకు దారి తీశాయి. మొత్తంగా చూస్తే భారత్ స్వదేశంలో బలమైన జట్టే అయినప్పటికీ కొన్ని మ్యాచ్‌లో మాత్రం చేతులెత్తేసింది.







## సెమీస్‌కు ఢిల్లీ వారియర్స్: పంజాబ్ రాయల్స్‌పై 5-4తో విక్టరీ

**న్యూఢిల్లీ:** ప్రో రెజ్లింగ్ లీగ్-2026 చివరి లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ దంగల్ వారియర్స్ పంజాబ్ రాయల్స్ పై 5-4 తేడాతో అద్భుత విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకుంది. ఢిల్లీ జట్టు నిర్ణయాత్మక క్షణం మ్యాచ్‌లోని ఎనిమిదో టైలో వచ్చింది. దీనిలో తురాన్ బేరామోవ్ అండర్23 ఆసియా ఛాంపియన్ చంద్రమోహన్‌ను ఆధిపత్య ప్రదర్శనతో ఓడించి టైను 4-4తో సమం చేశాడు. తద్వారా ఢిల్లీ చివరి నాలుగు స్థానాలను కైవసం చేసుకుంది. అంతకుముందు, మహిళల 62 కిలోల పోటీలో ఫైటర్ ఆఫ్ ది మ్యాచ్ అనా గోడినెజ్ విజయంతో పంజాబ్‌ను పోటీలో నిలిపింది. 6 పాయింట్లతో ఇప్పటికే సెమీఫైనల్ బెర్త్‌ను నిర్ధారించుకున్న పంజాబ్ రాయల్స్ (76 కిలోల) మహిళల విభాగంలో ప్రియా మాలిక్ వ్యూహాత్మక పోటీలో అనస్తాసియా అల్పీవాను 2-0 తేడాతో ఓడించి టైను బలంగా ప్రారంభించింది. పురుషుల విభాగంలో (86) ఢిల్లీ వాఫైపూర్ హది భక్తియార్ ధీటుగా స్పందించి నిరంతర దాడితో సందీప్ మాన్‌ను 20-7 తేడాతో ఓడించి టైను సమం చేశాడు. ఆ తర్వాతపురుషుల విభాగంలో (65) అనుజ్ కుమార్‌పై కెప్టెన్ సుజీత్ కల్కల్ 10-1 తేడాతో గెలుపొందగా, చిరాగ్ చికారాపై శుభమ్ కౌశిక్ 9-0 తేడాతో ఆధిక్యాన్ని 3-1కి పెంచడంతో ఢిల్లీ దూసుకెళ్లింది. మహిళల విభాగంలో (57) రజనితా జాంగ్రా పంజాబ్ ను వెనక్కి నెట్టి, కార్లా గోడినెజ్ గొంజాలెజ్ పై 5-1 తో విజయం సాధించింది. మహిళల బౌట్‌లో (62) మళ్లీ జోరు పెంచిన అనా గోడినెజ్ మొదటి పీరియడ్‌లో 5 పాయింట్ల భారీ త్రోతో ఆధిక్యాన్ని సాధించగా, రెండవ పీరియడ్‌లో అంజ్లీ ప్రతిఘటనను ఎదుర్కొన్నప్పటికీ, 11-7 విజయాన్ని సాధించింది.

## స్క్వాష్ ఆన్ ఫైర్ ఓపెన్‌లో చోత్రాణి, అనాహత్ విజయం



**న్యూఢిల్లీ:** స్క్వాష్ ఆన్ ఫైర్ ఓపెన్‌లో భారత్ షట్లర్లు వీర్ చోత్రాని, అనహాత్ సింగ్ ప్రత్యర్థులను మట్టికరింపించగా, వేలవన్ సింథిల్ కుమార్ ఓటమిపాలయ్యాడు. వాషింగ్టన్‌లో శుక్రవారం జరిగిన 16వ రౌండ్‌లో ఐదు గేమ్‌ల థ్రిల్లర్‌లో చోత్రాని ఫ్రెంచ్ ప్రపంచ 19వ నంబర్ బాప్టిస్ట్ మసోట్టిని ఓడించింది. ప్రపంచ 49వ ర్యాంకర్ చోత్రాని వరుసగా రెండోసారి పునరాగమనం చేసి 4వ ర్యాంకర్ మసోట్టిని 11-6, 7ı11, 8-11, 11-1, 11-9తో ఓడించాడు. మొదటి రౌండ్‌లో బాలాజ్ ఫర్కాస్‌ను చోత్రాని 2-1, 8-2 తేడాతో ఓడించాడు. తదుపరి 24 గంటల తర్వాత ఫ్రాన్స్‌కు చెందిన మసోట్టిని ఓడించడానికి మరోసారి ఐదు గేమ్‌లు అవసరమయ్యాయి, ఉత్కంఠత నిండిన ఐదవ గేమ్‌లో అతను ఐదు మ్యాచ్ బంతులతో 10-4,ఆపై 10-9 వద్ద స్మార్ట్ బ్యాక్ హ్యాండ్ డ్రాప్‌తో ఆరవదాన్ని తీసుకున్నాడు. ఐదు మ్యాచ్‌లలో ముహమ్మద్ అసిమ్ ఖాన్‌పై గెలవడానికి డెక్లాన్ జేమ్స్ 2-0 తేడాతో వెనుకబడి ఉన్నప్పటికీ, చోత్రాని ఈ మ్యాచ్‌లో 72 నిమిషాల పాటు జరిగిన పోరును 11-7 తేడాతో ముగించాడు. అలాగే నంబర్ 2 సీడ్ కార్డెనాస్ సెంథిల్‌కుమార్‌పై మరో అద్భుత ప్రదర్శన చేసి గెలుపొందాడు. మహిళల విభాగంలో ఏడో సీడ్ అనహత్ సింగ్ రెండో రౌండ్‌లో హేలీవార్డ్ (రిపబ్లిక్ ఆఫ్ సౌతాఫ్రికా)ను 11-5, 11-8, 12-14, 11-5 తేడాతో ఓడిం చింది. ఆమె క్వార్టర్ ఫైనల్స్‌లో ఈజిప్టుకు చెందిన రెండో సీడ్ సనా ఇబ్రహీంతో తలపడనుంది.

## కిరణ్ జార్జ్ నిష్క్రమణ



## థాయిలాండ్ మాస్టర్స్‌లో ఇషా చేతిలో రెండో సీడ్ ఓటమి

**న్యూఢిల్లీ:** థాయిలాండ్ మాస్టర్స్- 2026, సూపర్ 300 టోర్నమెంట్‌లో భారత్ షట్లర్ ఇషారాణి బారువా రెండవ సీడ్‌ను ఓడించగా, కిరణ్ జార్జ్ నిష్క్రమించాడు. చైనీస్ తైపీకి చెందిన రెండవ సీడ్ సంగ్ షో యున్‌పై విజయం సాధించి భారత్‌కు చెందిన ఇషారాణి బారువా క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. మహిళల సింగిల్స్‌లో ప్రపంచ 48వ ర్యాంక్‌లో ఉన్న ఇషా, 1 గంటా 2 నిమిషాల పాటు జరిగిన పోరులో 21-13, 14-21, 21-14 తేడాతో విజయం సాధించింది. 16వ రౌండ్‌లో మెరిసిన ఏకైక భారత మహిళల సింగిల్స్ షట్లర్ బారువాతో పాటు, దేవిక సిహాగ్ కూడా సీడెడ్ ప్రత్యర్థిని ఓడించింది. చైనీస్ తైపీకి చెందిన ఎనిమిదో సీడ్ తుంగ్ సియోటాంగ్‌పై జరిగిన మ్యాచ్‌లో సిహాగ్ కేవలం 32నిమిషాల్లోనే 21-14, 21-14 తేడాతో సునాయాసంగా విజయం సాధించాడు. అలాగే మన్నెపల్లి తరుణ్ కూడా పురుషుల సింగిల్స్‌లో చైనీస్ తైపీకి చెందిన టింగ్‌యెన్ చెన్‌పై 21-17, 14-21, 24-22 తేడాతో గట్టి పోరా టంతో గెలిచి క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. గంటా 18 నిమిషాల తర్వాత విజయం సాధించాలని భారత ఆటగాడు తీవ్రంగా ప్రయత్నించడంతో ఇది ఉత్కంఠభరితంగా సాగింది. ఇక పురుషుల సింగిల్స్‌లో ఏడో సీడ్ కిరణ్ జార్జ్ ఇండోనేషియాకు చెందిన ప్రహ్దిస్కా బాగాస్ షుజివో చేతిలో కేవలం 36 నిమిషాల్లోనే 16-21, 11-21 తేడాతో ఓడిపోయాడు. వలిశెట్టి శ్రియాన్షి, అన్మోల్ ఖర్బ్ కూడా మూడు ఆటల నిర్ణయాత్మక మ్యాచ్‌లలో వారివార మహిళల సింగిల్స్ మ్యాచ్‌లలో ఓడిపోవడం ద్వారా థాయ్‌లాండ్ మాస్టర్స్‌లో వారి ప్రచారాలకు తెరపడింది.


---

## నెస్లే ఇండియా నికరలాభం రూ.1018 కోట్లు



**ముంబయి,జనవరి 30:** నెస్లే ఇండియా నికరలాభాల్లో 46శాతం వృద్ధిని నమోదుచేసింది. ప్యాకేజ్డ్ ఫుడ్ ఐటమ్స్‌లో భారీ వృద్ధి కనిపించింది. మ్యాగీ నూడిల్స్,కిట్‌క్యాట్ చాకొలేట్స్ వంటివాటిలో భారీ మార్కెట్ జరిగింది. పన్ను రాయితీలు కూడా కొంతమేర వ్యయాన్ని పెంచాయి. స్విస్ ఫుడ్ మేజర్ భారత యూనిట్ నికరలాభం మూడో త్రైమాసికంలో రూ.1018 కోట్లుగా వెల్లడించింది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో రూ.696 కోట్లు ఆర్జించింది. కంపెనీ షేర్లు నాలుగుశాతం పెరిగినట్లు కంపెనీ ప్రకటించింది. ద్రవ్యోల్బణం దిగిరావడం కూడా ప్రభుత్వ ఆదాయవనరులు, వినియోగరంగంలో పన్ను రాయితీలు అంటే జిఎస్టీ హేతుబద్ధీకరణ వంటివి కంపెనీ లాభాలకు కలిసొచ్చాయి. మూడోత్రైమాసికంలో నెస్లే రాబడులు 19శాతం పెరిగి 5667 కోట్లుగా ఉన్నాయి. కిట్‌క్యాట్, మంచ్ చాకొలేట్‌బ్రాండ్‌లు రెండంకెల వృద్ధిని నమోదుచేసాయి. గ్రామీణప్రాంతాల్లోకూడా డిమాండ్ పెరిగి ఆన్‌లైన్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌ల్లో ఎక్కువ ఆర్డర్లు వచ్చాయి. సిఎండి మనీష్ తివారి మాట్లాడుతూ జిఎస్టీ హేతుబద్ధీకరణ, మా పెట్టుబడులు ఉత్పత్తిసామర్థ్యం పెంపు వంటివి కలిసొచ్చాయని చెప్పారు. తోటి సంస్థలయిన గోద్రెజ్ కన్స్యూమర్ ఉత్పత్తులు,ఐటిసిలు కూడా తక్కువ నికరలాభాలు ప్రకటించాయి. భారత్‌లోని కొత్త లేబర్‌కోడ్‌లు ఒకపర్యాయం అదనపు భారాన్ని వేసినట్లు కంపెనీలు చెప్పుకొచ్చాయి. అయితే నెస్లె ఇండియాకు కూడా లేబర్‌కోడ్‌లు భారం పడినా తక్కువస్థాయిలోనే ఉంది.

# వారాంతంలో సెన్సెక్స్, నిఫ్టీలు రివర్స్‌గేర్




**ముంబయి, జనవరి 30:** బెంచ్‌మార్క్ ఈక్విటీ సూచీలు వారాంతంలో స్వల్పంగా తగ్గాయి. మూడురోజుల ర్యాలీనుంచి తిరోగమించాయి. గ్లోబల్‌మార్కెట్ల ధోరణులు క్షీణించడం, కేంద్ర బడ్జెట్ రానుండటంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ట్రేడింగ్ చేసారు. విదేశీ నిధులు కూడా కొంతమేర విత్‌డ్రాలు పెరిగాయి. మూడోత్రైమాసిక ఫలి తాలు, భౌగోళిక ఉద్రిక్తతలు, కేంద్ర బడ్జెట్ అంశాలపైనే ట్రేడర్లు ఫోకస్ పెంచడంతో సూచీలు కొంతమేర క్షీణించాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 296.59 పాయింట్లు క్షీణించి 82,269.78 పాయింట్లవద్ద ట్రేడింగ్‌ముగిస్తే నిఫ్టీ 50 సూచీ కూడా 98.25 పాయింట్లు క్షీణించి 25,320.65 పాయింట్లు వద్ద ట్రేడింగ్ నిలిపి వేసింది. గడచిన మూడు సెషన్లలో సెన్సెక్స్ 1.26శాతం, నిఫ్టీ 1.48 శాతం క్షీణించాయి. హిందాల్కో 5.98శాతం, టాటాస్టీల్ 4.81 శాతం, ఐసిఐసిఐబ్యాంకు 1.92శాతం క్షీణించాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్ సూచీ 0.09శాతం తగ్గితే స్మాల్‌క్యాప్ సూచీ 1.25శాతంపెరిగింది. డాలరుతో రూపాయి మారకం విలువలు 91.97గా చెలామణి అయితే ఎంసిఎక్స్‌లో పసిడి ఫిబ్రవరిఫ్యూచర్స్ 4.29శాతం క్షీణించి రూ.1,62,352గా కొనసాగాయి. కమోడిటీ మార్కెట్‌లో బ్రెంట్‌ముడిచమురు 63 సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 70.08 డాలర్లుగా కొనసాగాయి. నిఫ్టీలోమెటల్‌సూచీ 5.21శాతం పెరిగింది. హిందూస్థాన్‌జింక్ 12.4 శాతం వేదాంత 11.27శాతం, హిందూస్థాన్ కాపర్‌లు 11.07శాతం క్షీణించాయి. ఇక ఎన్ఎసి 10.69 శాతం, హిందాల్కో 5.98శాతం, టాటాస్టీల్ 4.81శాతం, ఎన్ఎండిసి 4.26 శాతం, సెయిల్ 3.94శాతం, జిందాల్ స్టీల్ 2.97శాతం, ల్లాయిడ్స్ మెటల్స్ 2.77శాతం చొప్పున క్షీణించాయి. ఇక ఆటోమొబైల్ పరంగా టాటా మోటార్స్ 2.54శాతం క్షీణించింది. డాబర్ ఇం డియా 0.57శాతం పడిపోయింది. ఐటిసి మాత్రం 1.11శాతం, కాల్గేట్ పామోలివ్ 0.39శాతం, ఎంటార్ టెక్నాలజీస్ 7శాతం, అల్లీడ్ బ్లెండర్స్ డిస్టిలరీస్ 6.58శాతం, నిప్పన్‌లైఫ్ ఇండియా అసెట్‌మేనేజ్‌మెంట్ 1.30 శాతం చొప్పున పెరిగాయి. వన్97 కమ్యూనికేషన్స్ 2.71శాతం క్షీణించింది. స్విగ్గీ కూడా 4.98శాతం షేర్లుపతనం అయ్యాయి. జిల్లెట్ ఇండియా 5.83శాతంపెరిగింది .కంపెనీ నికర లాభాలు పెరగడమే ఈ షేర్లు పెరగడానికి కారణం.


అలాగే ప్రభుత్వరంగంలోని హిందూస్తాన్ ఏరోనాటిక్స్ కూడా 0.34శాతం పెరిగింది. పవన్ హ్యాన్స్‌నుంచి 10 ధృవ్ ఎన్‌జి హెలికాప్టర్ల తయారీకి ఆర్డరును సాధించడంతో షేర్లుపెరిగాయి. పదేళ్ల బెంచ్‌మార్క్ యుఎస్ బాండ్లు కూడా 0.13శాతం క్షీణించి 6.690శాతంగా కొనసాగాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో రూపాయి డాలరుకు చెలామణి కొంత క్షీణించడం కూడా ఇందుకు దోహదంచేసింది. అయితే ముందురోజు 91.99కంటే కొంతమెరుగుపడింది.

## బజాజ్ ఆటో నికరలాభం రూ.2759 కోట్లు




**ముంబయి,జనవరి 30:** ఆటోమొబైల్ మేజర్ బజాజ్ ఆటో శుక్రవారం ప్రకటించిన త్రైమాసిక ఫలితాల్లో 25శాతం నికరలాభాల్లో వృద్ధిని నమోదుచేసింది. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో నికరలాభం రూ.2759 కోట్లుగా ఉందని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో లాభాలు రూ.2195.65 కోట్లుగా ఉన్నాయి. కంపెనీ రాబడులు త్రైమాసికంలో 21.2 శాతం పెరిగి రూ.15,378.24 కోట్లకు చేరాయి. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో రూ.12,688.96 కోట్లు మాత్రమే ఉండగా ఈసారి భారీ వృద్ధిని నమోదుచేసింది. ఎగుమతులు రెండంకెల వృద్ధిని సాధించడమే ఇందుకు మూలకారణం టూవీలర్లు, వాణిజ్యవాహనాల సెగ్మెంట్‌లోనే ఎక్కువ అమ్మకాలుజరిగాయి. మొత్తంగా బజాజ్ ఆటో అమ్మకాలు ఈత్రైమాసికంలో ఏడు శాతం పెరిగి 1.13 మిలియన్‌యూనిట్లుగా ఉన్నట్లు కంపెనీ వెల్లడించింది. వాణిజ్య వాహనాలు తొమ్మిది శాతంపెరిగి 1,29,829గా ఉంటే ఎగుమతులు టూవీలర్లు 5,31,175 వరకూ ఉన్నాయి. 14శాంపెరిగినట్లుకంపెనీ వెల్లడించింది. అలాగే వాణిజ్య వాహనాలు కూడా 56శాతం వృద్ధిని నమోదుచేసి 1,29,829 యూనిట్లుగా ఉన్నాయి.

## ఆర్థికలోటు తొమ్మిదినెలలకు రూ.8.56 లక్షలకోట్లు: వార్షిక లక్ష్యంలో 54.5% చేరిక



**న్యూఢిల్లీ,జనవరి 30:**భారత్ ఆర్థికవ్యవస్థలో లోటు అనేది కీలకంగా పరిగణిస్తారు. భారత్ ఆర్థికలోటు ఏప్రిల్‌డిసెంబరునెలలమధ్యకాలంలో మరింతగాపెరిగి రూ.8.56 లక్షలకోట్లుగా ఉంది. వార్షికటార్గెట్‌లో 54.5శాతం వరకూ ఉన్నట్లు కాగ్ శుక్రవారం ప్రకటించింది. తొలి తొమ్మిది నెలల్లో గత ఏడాది లోటు రూ.9.1 లక్షలకోట్లుగా ఉంది. అంటే వార్షిక టార్గెట్‌లో 56.7శాంగా ఉంది. పన్ను వసూళ్లు గణనీయంగా పెరగడం, రూ.19.39 లక్షలకోట్లు పన్నువసూళ్లు జరగడం ఇందుకు కీలంగా భావిస్తున్నారు. వార్షిక టార్గెట్‌లో వసూళ్లు 19.39 లక్షలుగా ఉన్నాయి. మూలధన వ్యయం కూడా పెరిగింది. 2026 ఆర్థికసంవత్సర టార్గెట్‌లో 70.3వాతం చేరుకుని రూ.7.87 లక్షలకు చేరింది. అంతకుముందునెలలోనే మూలధనవ్యయం రూ.6.58 లక్షలకు చేరింది. 58.7శాతంగా ఉందని కాగ్ ప్రక టించింది. అంతకుముందు ఏడాది అధిక పన్నుల వసూళ్లు అధిక ఆదాయపు పన్నురేట్లు పరోక్షపనుల రేట్లు కూడా కొంతమేర పెరగడంతో జిఎస్టీ శ్లాబ్‌లు కొంతమేర రాబడికి గండికొట్టాయి. కేంద్రం రెవెన్యూ లోటు ఏప్రిల్ డిసెంబరు మధ్యకాలంలో రూ.1.13 లక్షలకోట్లుగా ఉంది. వార్షిక టార్గెట్ 21.8శాతం సాధిస్తుందన్న అంచనా ఉంది. ఏడాదిక్రితం ఈ లోటు 44.1 శాతంగా ఉంది. తొలితొమినమదినెలల్లో మొత్తం వ్యయం రూ.33.8 లక్షలకోట్లుగా ఉంది. అఈంచనా బడ్జెట్‌లో 66.7శాతంగా ఉంది. మొత్తం రాబడులు తొమ్మిదినెలల కాలానికిగాను రూ.25.25 లక్షలకోట్లుగా ఉన్నాయి. వార్షిక లక్ష్యంతో 72.2శాతంగా ఉంది. పన్నువసూళ్లే 72.5శాతంగా ఉన్నాయి. తొమ్మిది నెలల్లో రూ.24.8 లక్షలకోట్లు రాబట్టింది. పన్నేతర ఆదాయం విభాగంలో ప్రభుత్వం వార్షిక టార్గెట్‌లో 92.6శాతం సాధించింది. డివిడెండ్లు, లాభాలు డిసెంబరు చివరినాటికి రూ.3.5 లక్షల కోట్లుగా ఉన్నాయి. వసూళ్లు వార్షిక లక్ష్యంలో 98శాతానికి చేరుకున్నట్లు కాగ్ అంచనావేసింది.

## సౌత్‌ఇండియన్ బ్యాంకు ఎండిసిఇఒగా వైదొలగుతున్న పిఆర్ శేషాద్రి




**త్రిచూర్, జనవరి 30:** ప్రైవేటురంగంలోని సౌత్ ఇండియన్ బ్యాంకు ఎండి సిఇఒ పిఆర్ శేషాద్రి తన పదవినుంచి వైదొలుగాలని నిర్ణయించుకున్నారు. మరోసారి ఆ పదవిలో కొనసాగేందుకు ఆయన సుముఖంగా లేరు. దీన్నిబట్టి ఇకపై ఆయన బ్యాంకులో తన పదవీకాలం 2026 సెప్టెంబరువరకూమాత్రమే కొనసాగాలని నిర్ణయించుకన్నట్లు తెలుస్తోంది. తన వ్యక్తిగత కారణాలపైపైనే శేషాద్రి రాజీనామాచేయాలని నిర్ణయించుకున్నారు. ఎస్ఐబి శేషాద్రి స్థానం భర్తీకోసం ఇప్పటినుంచే అన్వేషణ ప్రారంభించింది. అయితే కొత్త అపాయింట్‌మెంట్ రిజర్వుబ్యాంకు ఆమోదం పొందాల్సి ఉంటుంది. శేషాద్రి నిర్ణయం ప్రకటించినవెంటనే బ్యాంకు షేర్లు 18శాతం పడిపోయాయి. ఇంట్రాడేలో రూ.36.05 రూపాయలకు చేరాయి. మూడు నెలల కనిష్టంగా చెపుతున్నారు ఐఐఎం బెంగళూరు పూర్వ విద్యార్థి అయిన శేషాద్రి ఎండ ి సిఇఒగా 2023 అక్టోబరులో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు కరూర్ వైశ్య బ్యాంకులో ఎండి సిఇఒగా పనిచేసారు. బిఎఫ్‌సి బ్యాంకు సిఇఒగాను ఎండిగాను పనిచేసిన ఆయన సిటీబ్యాంకు ఆసియా పసిఫిక్ విభాగం ఎండిగా కూడా పనిచేసారు. బ్యాంకు తన మూడోత్రైమాసికంలో నికరలాభాలు రూ.374 కోట్లు ఆర్జించింది. అంతకుముందు ఏడాది 442కోట్లతో పోలిస్తే 9శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇపుడు శేషాద్రి వైదొలుగుతుండటంతో బ్యాంకు ఆర్థికపరిపుష్టివైపుయాజమాన్యం మళ్లీ ఫోకస్ పెంచింది.

## గిఫ్ట్‌సిటీ వైపు గ్లోబల్ రీఇన్సూరెన్స్ కంపెనీలు



**అహ్మదాబాద్,జనవరి 30:** ప్రపంచంలోని అతిపెద్ద రీఇన్సూరెన్స్ కంపెనీలన్నీ ఇపుడు గుజరాత్‌లోని గిఫ్ట్‌సిటీవైపు చూస్తున్నాయి. ఇతర అంతర్జాతీయ ఆర్థిక హబ్‌లకంటే భారత్‌లోని గిఫ్ట్‌సిటీ పై వీరి దృష్టిపడింది. ఇందుకోసం అనుమతుల సాధించేందుకు ఇప్పటికే దరఖాస్తులుచేసుకున్నారు. వీటిలో లండన్‌కు చెందిన ల్లాయిడ్‌సంస్థ కూడా ఉంది. గ్లోబల్‌కంపెనీల్లో దక్షిణ కొరియా శాంసగ్‌రీ, కన్యారే, స్పెయిన్ మాప్‌ఫ్రీరే వంటి కంపెనీలతోపాటు సుమారు డజనుకు పైగా గ్లోబల్ రీఇన్సూరర్లు యూరోప్; మధ్యప్రాచ్యం, ఆసియా దేశాలనునంచి కొత్త గిఫ్ట్‌సిటీవైపు దృష్టిసారించారు. భారత్‌లోని రూ.129.78 బిలియన్ డాలర్ల బీమా మార్కెట్‌పై వీరి కన్ను పడింది. భారత్ బీమా రంగం ప్రపంచంలోనే పదో అతిపెద్ద రంగంగా ఈ సంస్థలు పేర్కొంటున్నాయి. ఈ ఏడాదిలోనే ఈకంపెనీలకు ఆమోదం లభిస్తుందని అంచనా వేస్తున్నారు. గిఫ్ట్‌సిటీలో శాఖలుప్రారంభిస్తే సానుకూల పన్నుల వ్యవస్థ ఇబ్బందికరంగా లేని వాతావరణం ఉంటుందని, పదేళ్లపాటు ట్యాక్స్ హాలిటీ కూడా ఉంటుందని, మూలధన లబ్దిపై పన్నుకు కూడా మినహాయింపులు ఉంటాయని తెలుస్తోంది. అయితే భారత్‌తోపాటు సింగపూర్, దుబాయిల్లో కూడా అం తర్జాతీయ ఆర్థికకేంద్రాలున్నాయి. ప్రస్తుతం రీఇన్సూరెన్స్ మార్కెట్ స్విస్‌రే, మ్యునిచ్‌రేలు ఆధిపత్యంతో ఉన్నాయి. ప్రభుత్వపరిధిలోని జ ఇఐసిరే కూడా ఇపుడిపుడే వృద్ధిలోకి వస్తుంది. ఇప్పటికే గిఫ్ట్‌సిటీలో సౌదీరే, కొరియన్‌రే, పీక్‌రే, కువైట్‌రే, అబూదాబి నేషనల్ ఇన్సూరెన్స్, కజక్‌కేంద్రంగా ఉన్న యూరేసియా బీమా కంపెనీ, జెఎస్‌సి సంస్థలు కూడా అనుమతులు పొందినట్లు తెలుస్తోంది. గ్లోబల్ రీఇన్సూరెన్స్‌కంపెనీలు 14 వరకూ గిఫ్ట్‌సిటీలో పనిచేస్తున్నాయి. సాలీనా 700 నుంచి 800 మిలియన్ డాలర్లు ప్రీమియంల రూపంలో వస్తున్నట్లు సమాచారం.మార్చినాటికి 20 సంస్థలకు పెరిగే అవకాశాలు న్నాయి. డాలరుకు రూపాయి విలువలు కూడా 91.90గా కొనసాగుతుం డటంతో డాలర్ల పరిధిలోనే ఇక్కడి టర్నోవర్‌ను కూడా లెక్కిస్తున్నారు. అందుకే గ్లోబల్ సం స్థలన్నీ ఇపుడు గుజరాత్ గిఫ్ట్‌సిటీవైపు చూస్తున్నాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14